1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి:3
సంచిక :9
పుటలు :52
రు. 20/-లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి


నుడి నాడు నెనరు


నవంబరు 2017

'తాపీ'ది పాతపాళీ, కొత్తపాళీ.... నాది 'తాపీపాళీ'...

– తాపీ ధర్మారావు పురస్కారాన్ని అందుకున్న 'సతీష్‌చందర్'








మౌనంలోని మాటలు

(సంచారి నాగోళ్ళ రామప్ప ఆత్మకథ)

ధారావాహిక



- తేటతెలుగు ఊటలు - తెలంగాణ మాటలు
- ఉత్తరాంధ్ర ఆదివాసీ భాషాసాహిత్యం
- కదులుతున్న జానపదం
- బౌద్ధం - వైజ్ఞానిక మార్గం
- రామప్పగుడులకు యునెస్కో సొగసులు

తెలుగు కోసం ఇద్దరు ముఖ్యమంత్రులూ పోటీపడాలి

సతీష్‌చందర్ గారికి తాపీ ధర్మారావు పురస్కార సభ

హైదరాబాదు

15-10-2017

















పత్రికా సంపాదకుడు, వ్యంగ్య రచయిత, విమర్శకుడు, కవి, మీడియా బోధకుడు సతీష్‌చందర్ గారికి 2017 సంవత్సరానికి తాపీ ధర్మారావు పురస్కారాన్ని అందజేసిన సభాదృశ్యాలు. 1. తాపీ ధర్మారావుగారి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అతిథులు, 2. సభికుల, 3. ముఖ్య అతిథి విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్ ఉపన్యాసం, 4. కె.రామచంద్రమూర్తి అధ్యక్షోపన్యాసం 5. సతీష్ చందర్ ప్రసంగం, 6. విశిష్ట అతిథి డా॥నందినీ సిధారెడ్డి, ఆత్మీయ అతిథులు ఏటుకూరి ప్రసాద్, విమలా సోహోన్, 7. మన్నన పత్రాన్ని చదివిన సన్నిధానం నరసింహశర్మ, 8. గాయని ఊటుకూరి భూదేవి

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



నవంబరు 2017

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు. 3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము. 4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము. **అమ్మనుడి** లో ప్రచురణైన తరువాత ఇతర పత్రికలలోగాని, సోషల్ మీడియాలోగాని ప్రచురించేట్లయితే – **అమ్మనుడి** నుంచి తీసుకున్నట్లు తప్పక పేర్కొనాలి.

లోపలి పుటలలో....

రేఖా చిత్రాలు : **చిదంబరం** కార్టూన్లు : **సరసి**

ఫొటోలు : **శ్రీనివాసులు** కంప్యూటరీకరణ : **సోమయాజులు**

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* e-mail : editorammanudi@gmail.com

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

	వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా :	రూ.5000	రూ.7500	--
5 సం॥ :	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥ :	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥ :	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.
AMMA NUDI - AXIS BANK, TENALI
అక్కౌంట్ నెం. **915020010550189**
IFSC Code : UTIB0000556
ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా
డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది
నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు-1.** ఫోన్:7386223538.

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురించాలని సంకల్పించాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల్లో ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికంగా 500రూ. ఇవ్వబడుతుంది.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- తరువాత ఈ కథానికలతో ఒక సంకలనాన్ని తెస్తాం.
- ప్రముఖ కథానికారచయిత **డా.వేదగిరి రాంబాబు** ఈ శీర్షికను **అమ్మనుడి** కోసం నిర్వహిస్తున్నారు.
- మన భావాలకు శాశ్వత రూపాన్నిచ్చే మన మాతృభాష కేంద్రంగా మీరు పంపే కథానికల కోసం ఎదురు చూస్తుంటాం. అమ్మభాష కోసం నిర్వహిస్తున్న ఈ వినూత్న శీర్షికకు విలువైన మీ కథానికలను పంపాల్సిన చిరునామా:

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. కార్యాలయం ఫోన్ : 0866-2439466. సంపాదకుడు : 9848016136. e-mail : editorammanudi@gmail.com

గమనిక : కథలను అనుఫాంట్స్‌లో గాని, యూనికోడ్‌లో గాని టైప్ చేసి, పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. ఫైల్సులోపంపించాలి. చేతివ్రాతలో పంపేట్లయితే వ్రాసిన దానిని స్కాన్ చేయించిపంపాలి. లేదా వ్రాతప్రతిని పోస్టులో గాని, కొరియర్‌లో గాని పంపించాలి.

తెలంగాణ ప్రభుత్వ నిర్వహణలో

ప్రపంచ తెలుగు మహాసభలు - 2017

తెలుగు సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక, భాషావైభవాన్ని, తెలంగాణ ప్రాంత ఔన్నత్యాన్ని చాటిచెప్పే లక్ష్యంతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్నాయి. డిసెంబరు 15 నుండి 19 వ తేదీ వరకు హైదరాబాదులో ఈ మహాసభలను తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్నది. కవులు, సాహితీవేత్తలు, కళాకారులు, రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ విదేశాల నుండి పాల్గొననున్న ఈ సభలను భాషాసాహిత్య, సంస్కృతులను చాటిచెప్పే విధంగా నిర్వహించేందుకు రూపకల్పన జరిగింది.

మహాసభలు జరిగే ఐదు రోజుల్లో – తొలిరోజు ప్రారంభోత్సవాలు, చివరిరోజు ముగింపు వేడుకలు వుంటాయి. మిగిలిన మూడు రోజులు సభలు, సమావేశాలు, సమ్మేళనాలు, చర్చాగోష్ఠులు వుంటాయి. మహాసభల ప్రారంభం, ముగింపుల కోసం రాష్ట్రపతి, ప్రధాని, ఉపరాష్ట్రపతిలను ఆహ్వానిస్తున్నాం. ఈ ప్రపంచ మహాసభలకు 6,000 మంది హాజరయ్యే అవకాశం వుంది. తెలంగాణ నుంచి 4,500 మంది, ఇతర రాష్ట్రాల నుండి 1,000 మంది, విదేశాల నుండి 500 మంది వస్తారని అంచనా. అమెరికా, ఐరోపా, గల్ఫ్, ఆఫ్రికా దేశాలు, మారిషస్, సింగపూర్, మలేసియా వంటి దేశాల నుండి భాషావేత్తలు, పండితులు హాజరవుతారు. కేంద్ర సాహిత్య అకాడమీ, జ్ఞానపీఠ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను పొందిన ప్రముఖులను కూడా ఈ సభలకు ఆహ్వానిస్తున్నాము.

ఎల్‌బి స్టేడియం ప్రధానవేదికగా మహాసభలు జరుగుతాయి. తెలుగు విశ్వవిద్యాలయం, రవీంద్రభారతి, ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం, లలితకళాతోరణం, నిజాం కళాశాల మైదానం, భారతీయ విద్యాభవన్ వంటి వేదికలపై సాహిత్య, సాంస్కృతిక, జానపద కళారంగాల కార్యక్రమాలు నిర్వహించటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సాహిత్యంలో విశేషంగా కృషిచేసిన సాహితీవేత్తలను భాగస్వామ్యులను చేస్తూ ఇష్టాగోష్టులను నిర్వహించటం జరుగుతుంది. 2000 సంవత్సరాల నుండి పరిఢవిల్లిన సాహిత్యం నేపథ్యంగా ఈ సభలు విశిష్టతను సంతరించుకోనున్నాయి.

భాషావైభవంపై ప్రత్యేక కార్యక్రమాలను మహాసభల్లో నిర్వహిస్తారు. తెలంగాణలో వర్ధిల్లిన తెలుగును ప్రపంచం నలుమూలలకు తెలిపే విధంగా కార్యక్రమాలుంటాయి. తెలంగాణ ప్రాంతంలో తెలుగుభాషాభివృద్ధికి, భాషా వైభవానికి జరిగిన కృషిపై సభలో చర్చాగోష్ఠులు నిర్వహిస్తారు. ప్రవాస తెలంగాణ వాసులను గురించి సభలో ఒకపూట చర్చ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

తెలంగాణకు చెందిన ప్రముఖుల జీవితచరిత్రలతో కూడిన విశేష సంచికను తెలుగు మహాసభల సందర్భంగా వెలువరిస్తారు. నారాయణభట్టు, మహోపాధ్యాయ మలినాథసూరి, పంపన, పైడి జయరాజ్, ప్రభాకరరెడ్డి, కాంతారావు వంటి ఎందరెందరో ప్రముఖుల జీవితవిశేషాలను మోనోగ్రాఫ్‌లుగా తెలుగు అకాడమీ తీర్చిదిద్దుతుంది. తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీలు 'వాఙ్మయి', 'తెలుగు' ప్రత్యేక సంచికలను ప్రచురిస్తాయి. చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ, లఘుచిత్రాల ప్రదర్శనలతో పాటు, ఆదివాసి, గిరిజన, జానపద, శాస్త్రీయ అంశాలతోపాటు పల్లెపాటల గానాలుంటాయి.

తెలంగాణ సాహిత్య అకాడమీ, సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో పనులను నిర్వహిస్తున్నారు. మహాసభల సందర్భంగా హైదరాబాదుతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లో ప్రపంచ తెలుగు మహాసభల ఔన్నత్యాన్ని చాటిచెప్పే కార్యక్రమాలకు కూడా రూపకల్పన జరిగింది. మహాసభల సందర్భంగా రాష్ట్రమంతటా పండుగ వాతావరణం నెలకొననున్నది. ఐదు రోజుల పాటు తెలుగుతనం, తెలంగాణ పరిమళం, భాషాసాంస్కృతిక, చారిత్రక వైభవం ఉట్టిపడే విధంగా అంగరంగవైభవంగా కార్యక్రమాల రూపకల్పన జరుగుతున్నది. సభలకు వచ్చే ప్రతినిధులు, ఔత్సాహికులు, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు చిరస్థాయిగా గుర్తించుకునేలా – ఆ యా రంగాల కార్యక్రమాలను నిర్మాణ క్రమపద్ధతిలో విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ కమిటీలు సన్నద్ధమవుతున్నాయి.

ఈ సభను విజయవంతం చేయవలసిందిగా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాము.

వివరాలకు ప్రపంచ తెలుగు మహాసభల వెబ్‌సైట్ : www.wtc.telangana.gov.in

డాక్టర్ నందిని సిధారెడ్డి

ఛైర్మన్, తెలంగాణ సాహిత్య అకాడమీ

తాపీ ధర్మారావుగారిది పాతపాళీ, కొత్తపాళీ...
నాది 'తాపీ పాళీ' : సతీష్‌చందర్



ప్రతిష్ఠాత్మకమైన 'తాపీ ధర్మారావు పురస్కారా'న్ని 2017 సంవత్సరానికి కవి, వ్యంగ్యరచయిత, సంపాదకుడు, జర్నలిజం గురువు సతీష్‌చందర్‌గారికి అందజేశారు- విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్. ఇందుకోసం అక్టోబరు 15 ఆదివారం ఉదయం హైదరాబాదు-ఖైరతాబాదులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కాలేజి సభామందిరంలో సీనియర్ సంపాదకులు శ్రీ కె.రామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన నిండైన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షులుడా॥ నందినీ సిధారెడ్డి, ఆత్మీయ అతిథులుగా : తాపీధర్మారావు జీవితం, రచనలపై పరిశోధన చేసిన డా॥ ఏటుకూరి ప్రసాద్, 'తాపీ' మనుమరాలు శ్రీమతి విమలా సోహన్ పాల్గొన్నారు. తొలుత 'తాపీ ధర్మారావు వేదిక' స్థాపకుడు డా॥ సామల రమేష్‌బాబు సభకు స్వాగతం పలికి, అతిథులను వేదికపైకి ఆహ్వానించగా 'తెలుగు జాతి ట్రస్టు' ట్రస్టీలు డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సామల లక్ష్మణబాబు, శ్రీ కోటిపల్లి సుబ్బారావు వారిని సత్కరించారు.

శ్రీ కె.రామచంద్రమూర్తి తన అధ్యక్షోపన్యాసంలో 'తాపీ ధర్మారావు పురస్కారం' ప్రతిష్ఠాత్మకం అయిందనీ, ఇప్పుడు ఈ పురస్కారాన్ని అందుకొంటున్న సతీష్‌చందర్‌కు ఒక్క సినిమారంగంలో తప్ప తక్కిన అన్నిటిలోనూ తాపీతో సారూప్యం ఉందని అన్నారు. పలు పత్రికలలో పనిచేసిన అనుభవంతోపాటు పాతికేళ్లుగా జర్నలిజం పాఠశాలను నిర్వహిస్తూ అనేకమంది జర్నలిస్టులను సమాజానికి అందించిన కృషి సతీష్‌చందర్‌కు ఈ ఘనతను తెచ్చిపెట్టిందని ప్రశంసించారు. ఆయన రచనల్లో అధిక్షేపణ, వ్యంగ్యం పుష్కలం అని అన్నారు.

ముఖ్య అతిథి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ 'సామాజిక మార్పునకు కవులు, రచయితలదే కీలకపాత్ర అనీ, ప్రపంచంలో ఏ ఉద్యమాలు, విప్లవాలు జరిగినా సాహిత్యకారులు ప్రముఖపాత్ర పోషించారని ఉదాహరణలతో ప్రస్తావించారు. తాపీ ధర్మారావు మూఢనమ్మకాలపై, సామాజిక దురాచారాలపై విమర్శనాత్మక రచనలు చేశారనీ, అదే ఆదర్శంతో మంచి సమాజం కోసం సతీష్‌చందర్ విప్లవాత్మక రచనలు చేస్తున్నారని, ఆయన ఆధునిక కవి సామ్రాట్' అని ప్రశంసించారు.

తర్వాత, వేదికపైనున్నవారంతా కలిసి సతీష్‌చందర్ గారిని, వారి శ్రీమతి గౌరీచందర్ గారిని శాలువాతో గౌరవించి, పురస్కార జ్ఞాపికను, మన్ననపత్రాన్ని (సైటేషన్), నగదును అందజేశారు. మన్ననపత్రాన్ని శ్రీ సన్నిధానం నరసింహశర్మ సభకు చదివి వినిపించారు. తాపీ ధర్మారావుగారు రచయితలనుద్దేశించి రాసిన ప్రబోధగీతాన్ని సన్మానానికి ముందుగా 'తెలుగు కోకిల' భూదేవి ఆలపించారు. సతీష్‌చందర్ గారి అభిమానులు, శిష్యులు, అనుచరులు కూడా ఆయనను ఘనంగా సత్కరించారు.

తర్వాత, విశిష్ట అతిథి డా॥ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, అధ్యయనం కలిగిన, అలిసిపోని రచయిత సతీష్‌చందర్ అని అన్నారు. సతీష్‌చందర్ తొలినాళ్లలోనే, తెలంగాణవాదాన్ని సమర్థించారని అన్నారు. తెలంగాణ భావసారూప్యత గల తెలుగువారందరూ ఒక్కటే అన్నారు. ప్రాంతాలకతీతంగా నాడు కవులు, రచయితలు రాసిన రచనలతోనే తాము స్ఫూర్తిపొందామన్నారు. తాపీ రచనలతో తాను స్ఫూర్తిపొందానని, సాహిత్యానికి మార్గనిర్దేశనం చేసిన గొప్ప వ్యక్తి తాతాజీ అని అన్నారు. ఆత్మీయఅతిథి డా॥ ఏటుకూరి ప్రసాద్ మాట్లాడుతూ తెలుగువారు తెలుగువారి కోసం తెలుగులో రాయడంపై నాటి సాహిత్యకారుల్లో జరిగిన చర్చను వివరించారు. శ్రమజీవుల నుంచే భాష పుడుతుందనీ అన్నారు. ఆత్మీయఅతిథి శ్రీమతి విమలా సోహన్, "తెలుగుభాషను, తెలుగు జాతిని కించపరిచే ప్రయత్నాలను ఆపివేయండి" అని 1955లోనే తెలుగు వ్యతిరేకులను తాతాజీ హెచ్చరించారని అంటూ, ఎలా రాయాలో ఎలా రాయకూడదో తెలుపుతూ తాపీ రాసిన కవితలను ఉటంకించారు.

తర్వాత తాపీ పురస్కార స్వీకర్త సతీష్‌చందర్ ఎంతో లోతైన అంశాలను, భావోద్వేగాన్నీ తనదైన నిగ్రహంతో, వ్యంగ్యరసభరితంగా, ఆర్ద్రతతో, బాధ్యతతో నిండిన ప్రసంగం చేసి, సభికుల ప్రశంసలను పొందారు. ఈ సందర్భంగా వారి ప్రసంగాంశాలను, ఇతర వివరాలతో కూడిన వారి ప్రత్యేకవ్యాసాన్ని, డిసెంబరు 'అమ్మనుడి'లో చదవండి. సమావేశకర్త డా॥ సామల రమేష్‌బాబు వందన సమర్పణ చేశారు. గురజాడ దేశభక్తగీతం"దేశమును ప్రేమించుమన్నా" పాడడంతో, తాపీ ధర్మారావుగారి చిత్రపటానికి పూలు సమర్పించడంతో ప్రారంభమైన సభలో 200 మందికి పైగా పాల్గొన్నారు వీరిలో రచయితలు, భాషోద్యమరాకులు, అభిమానులు, తాపీ కుటుంబసభ్యులు, సతీష్‌చందర్ అభిమానులూ ఉన్నారు.సభ ఆలస్యంగా ముగిసినా ప్రశాంతంగా చివరివరకు పాల్గొని, సభను విజయవంతం చేశారు.

ఛాయాచిత్రాలు : రెండవ పుట(అట్టపై) చూడండి...

సంపాదకీయం

తెలుగుకోసం ఇద్దరు ముఖ్యమంత్రులూ పోటీపడాలి

ఒకటి నుంచి పన్నెండవ తరగతి వరకూ తెలుగును ఒక పాఠ్యాంశం (సబ్జెక్టు)గా తప్పనిసరి చేస్తామని సెప్టెంబరులో తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు గారు ప్రకటించిన కొద్దిరోజులకు– ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కూడా ఈ దిశగా నిర్ణయం తీసుకోనున్నారని, ఇందుకు సంబంధించిన కసరత్తు జరుగుతోందని, రెండు మూడు రోజుల్లోనే ఉత్తర్వులు వెలువడనున్నాయని రెండు ప్రముఖ దినపత్రికల్లో మొదటిపుటలో పెద్ద పెద్ద వార్తలు ప్రత్యక్షమైనాయి. కానీ నెలరోజులు గడచిపోతున్నా, ఇంతవరకూ ఎటువంటి ప్రకటనా వెలువడలేదు. మేము పదే పదే గుర్తుచేస్తూనే వున్నట్లు 1 నుంచి 10 వ తరగతి వరకూ తెలుగును ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చేసిన జి.ఒ.నెం.86/ 2003 ఉండనే ఉంది. 11, 12 తరగతుల్లో అంటే – ఇంటర్మీడియెట్‌లో మాతృభాష (తెలుగు)ను తప్పనిసరి చేసే ఉత్తర్వు మాత్రం రావడం లేదు. ఇందుకు చంద్రబాబునాయుడు గారి చేతులను కట్టివేస్తున్న శక్తులు సాక్షాత్తు ఆయన మంత్రిమండలిలోనే ఉన్నాయి. ఆ శక్తులే పురపాలకశాఖ క్రింద ఉన్న పాఠశాలల్లో తెలుగు బోధనను నులిమివేసి, తమ వ్యాపారావసరాలకు తగ్గట్లుగా రాష్ట్ర విద్యారంగాన్ని మొత్తంగా శాసిస్తున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన ప్రపంచ తెలుగు మహాసభల కోసం ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్న దశలో – ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుగారు రాష్ట్రంలో 1 నుంచి 12 వరకూ తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించడాన్ని తప్పనిసరి చేసేందుకు చట్టాన్నే తేనున్నట్లు, సభలకు ముందుగానే ఇందుకై చర్యలు తీసుకోనున్నట్లు మళ్లీ ప్రకటించారు.

ఇద్దరు ముఖ్యమంత్రులనూ నమ్ముదాం. ఆలస్యంగానైనా, ఈ చిన్న పనినైనా తెలుగు కోసం చేస్తామన్నందుకు వారికి అభినందనలు. అయితే, ఇక్కడ వారిద్దరూ పట్టించుకోని కీలకాంశం ఒకటి ఉంది. తెలుగుగానీ, మరే భాష గాని, నేటి అవసరాలన్నిటికీ తగ్గట్లు నిరంతర వినియోగంలో పెడితేనే మనుగడలో ఉండి, అభివృద్ధి చెందుతుంది. అంటే శాస్త్ర, సాంకేతిక రంగాలు సహా సమస్త రంగాల్లోనూ ఆ భాషను బోధనకు, పరిశోధనకు, పాలనకు, ప్రచారానికి అన్ని అవసరాలకూ పూర్తిస్థాయిలో వినియోగించాలి. అప్పుడే ఇతర భాషల నుండి కూడా జ్ఞానాన్ని మన భాషలోకి తెచ్చుకోవడమూ, మన సృజనాత్మకతను, ఉత్పాదకశక్తినీ పెంచుకోవడమూ సాధ్యపడుతుంది. దీనికి తొలిమెట్టయిన ప్రాథమికవిద్యను మాతృభాషలోనే బోధించడాన్ని తప్పనిసరి చెయ్యడం మొట్టమొదటి కీలకాంశం. కనుక రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ ఒక విధానంగా దీనిని తేవడానికై చట్టాన్ని అత్యవసరంగా తేవాలి.

దీనితోపాటు ఒక మీడియంగా ఇంగ్లీషును ప్రాథమికవిద్య నుంచే పసిబిడ్డలనెత్తిన రుద్దాలన్న అసంబద్ధ ఆలోచనను తక్షణం విరమించుకోవాలి. ప్రాథమికవిద్య దశలో ఇంగ్లీషును ఒక సబ్జెక్టుగా మాత్రమే సమర్థులైన ఉపాధ్యాయులతో నేర్పిస్తే సరిపోతుంది. ప్రాథమిక విద్య పూర్తయ్యేసరికి, విద్యార్థికి తన మాతృభాషపై పట్టుతోపాటు, ఆంగ్లంతో తగినంత పరిచయం ఏర్పడుతుంది. 6వ తరగతి నుండి 10 వరకూ, ఆపైనా రెండు మాధ్యమాలలోనూ బోధనకు అవకాశాలనందించడంతోపాటు ఇంగ్లీషు మాధ్యమ విద్యార్థులకు తెలుగును ఒక భాషగా శ్రద్ధగా నేర్పించడాన్ని సాగించాలి. రెండు మాధ్యమాల విద్యార్థులకూ కొన్ని సబ్జెక్టులను మాతృభాషలోనూ, కొన్ని సబ్జెక్టులను ఇంగ్లీషులోనూ బోధిస్తే – క్రమంగా రెండు భాషల్లోనూ నేర్చుకోగల, వినియోగించగల శక్తి ఏర్పడుతుంది. ఇది విద్యార్థికి ఆపైదశల్లో – డిగ్రీ, పిజిలలో మరింతగా సమర్థంగా దూసుకుపోవడానికి – సృజనాత్మకతతోపాటు విస్తరించడానికీ, అవకాశాల నందుకోవడంతోపాటు తన సేవలను తన మాతృభూమికి, ప్రజలకు అందించడానికీ సమర్థతనిస్తుంది.

ప్రజాశ్రేయస్సు, దేశశ్రేయస్సు దృష్ట్యా విద్యారంగానికి సంబంధించి స్పష్టమైన, శాస్త్రీయమైన విధానాన్ని రూపొందించుకోవడం కోసం రాష్ట్రాలూ, కేంద్రమూ సరికొత్త ప్రయత్నానికి పూనుకోవాలి. రాజ్యాంగం ప్రకారం 'విద్య' ఉమ్మడిజాబితాలో ఉంది. జి.ఎస్.టి. విషయంలోనో, ఎన్నికల విషయంలోనో, జాతీయ స్థాయి విధానాలు

కావాలని పట్టుదలగా ఉన్న కేంద్రప్రభుత్వ నేతలు – దేశ అభివృద్ధికి, భవిష్యత్తుకు సంబంధించిన 'విద్య' విషయంలో మాతృభాషల (అవి మన జాతీయ భాషలు) రక్షణ, అభివృద్ధి విషయంలో ఎందుకు పట్టుదల వహించరు? అది మన ప్రజాస్వామ్యవ్యవస్థకు ఊపిరి అన్న సంగతిని విస్మరించడం తగదు. మాతృభాషలో ప్రాథమిక విద్యను తప్పనిసరి చేసేందుకు, రాష్ట్రాల ప్రత్యేకతలకి భంగం కలుగని విధంగా రాజ్యాంగంలో తగు సవరణలను చేయడంతోపాటు షెడ్యూల్ 8లో గల భాషలన్నిటిని సాధికారం చేసేందుకు ఉపక్రమించవలసి ఉంది. ఈ విషయంలో కూడా మన ముఖ్యమంత్రులు చొరవ తీసుకుంటే అది చరిత్రాత్మకం అవుతుంది. రాజకీయపార్టీలు రాబోయే ఎన్నికల సందర్భంగా పై అంశాలకు సంబంధించి తమ విధానం ఏమిటో తమ ఎన్నికల ప్రణాళికల్లో ప్రకటించాలని కోరుతున్నాం.

రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ చిత్తశుద్ధితో ప్రకటనలు చెయ్యాల్సిన అవసరం వచ్చేసింది. ఫలానా తేదీ అని నిర్ణయించి, అప్పటినుండి తమ కార్యాలయాలతో మొదలుపెట్టి తమ తమ రాష్ట్రాలలో అన్ని స్థాయిలలో పూర్తిగా తెలుగులోనే పాలన చేస్తామని ప్రకటించాలి. ప్రపంచ మహాసభల సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రీ, కొంచెం ముందూవెనుకగా ఆంధ్ర ముఖ్యమంత్రీ ఈ ప్రకటన చేసి, కఠినంగా దీనిని అమలులోకి తేవాలి. ఇది సాధ్యంకాదని వారనుకొంటే అది తమ సమర్థతను తామే అనుమానిస్తున్నట్లవుతుంది. పొరుగురాష్ట్రాలను ఆదర్శంగా తీసుకొంటే, ఇది వారికి చేతనయ్యే పనే. రెండు రాష్ట్రాల్లో పరిపాలన అన్ని స్థాయిల్లో ప్రజల భాషలో జరగడానికి ముఖ్యమంత్రులే చొరవ తీసుకోవాలి. తామే ఆదర్శంగా నిలవాలి.

ఈ ప్రకటనతోపాటే తక్షణం మరొక విధాన ప్రకటనను ఇరువురూ చెయ్యవలసి ఉంది. ప్రభుత్వ ఉద్యోగాలన్నిటినీ తెలుగులో విద్యార్హత, సమర్థత ఉన్నవారికి మాత్రమే ఇస్తామని ప్రకటించి అందుకు విధివిధానాలను రూపొందించాలి. తెలుగుమాధ్యమంలో చదువుకొన్నవారికి తమిళనాడులోవలె 20 శాతం ఉద్యోగాలను కేటాయించాలి. ఈ నిర్ణయాలకు ఎటువంటి న్యాయ సంబంధమైన చిక్కులు రాకుండా తగు జాగ్రతలతో ఉత్తర్వులను రూపొందించాలి.

తెలుగు భాషోద్యమ సమాఖ్య చేసిన ఉద్యమాల ఫలితంగా రెండు రాష్ట్రాలలో మంత్రిత్వశాఖలు ఏర్పడ్డాయి. అయితే మంత్రిత్వశాఖ పనికి కీలకావసరమైన తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ రెండు రాష్ట్రాల్లోనూ ఏర్పడాలి. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక కమిటీని నియమించి, దాని నివేదికను పూర్తిగా ఆమోదిస్తామని ప్రకటించి, దానిని అందుకున్న తర్వాత నిర్ణయాన్ని నిరవధికంగా వాయిదా వేసినట్లు, అందుకు కారణం కూడా ప్రధానంగా విద్యావ్యాపారవర్గాల వత్తిడే అని తెలుస్తోంది. ప్రపంచ మహాసభల సందర్భంగా తెలంగాణలో కూడా తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుగారు నిర్ణయం ప్రకటిస్తే – తెలంగాణ తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి తగిన వ్యవస్థ ఏర్పడుతుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు కూడా బహిరంగంగా ఒకటికి నాలుగుసార్లు మాట ఇచ్చిన ప్రకారం ప్రాధికారసంస్థను వెంటనే పూర్తిస్థాయిలో ఏర్పాటుచెయ్యాలి.

ఇవీ ఇప్పుడు మన ముందున్న అత్యవసర నిక్కచ్చులు (డిమాండ్లు). అత్యంత శక్తిమంతులైన ఇరువురు ముఖ్యమంత్రులు పోటాపోటీగా మన అమ్మనుడి 'తెలుగు' కోసం పట్టుదలతో ముందుకు సాగాలని ప్రజలు కోరుతున్నారు.

తెలుగుభాష, సాహిత్యం, సంస్కృతి – ప్రాంతాల్ని బట్టి, ఇంకా కొన్ని సామాజిక, చారిత్రక కారణాలను బట్టి ఎంతో వైవిధ్యం కలిగి ఉంది. వాటిని కాపాడుకోవడం ఆయా ప్రజల సహజహక్కు. పరస్పరం గౌరవించుకుంటూ సంబంధబాంధవ్యాలను పెంపొందించుకోవడమే సరైన విధానం. ఇందుకు రెండు ప్రభుత్వాలూ ప్రోదిచెయ్యాలి. ఎవరి పరిధుల్లో వారు ప్రజలకోసం పనిచెయ్యాలి. అప్పుడే ఆ నేతల ప్రతిభ దశదిశల విస్తరిస్తుంది. ప్రజల మన్ననలను పొందుతుంది.

పాలనలో పోటాపోటీగా వ్యవహరిస్తున్నట్లే – భాషను పెంపొందించుకోవడం పట్ల రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ పోటీపడాలి. తమ భాషలో పూర్తిగా పాలన సాగాలన్న ప్రజాస్వామిక హక్కునూ, తమ భాషలో అనంతవిజ్ఞానాన్ని పొందడానికి వారికి గల సహజ హక్కును కాపాడేందుకు వారిద్దరూ పోటీపడాలి.

రానున్న ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఈ పరిస్థితి నెలకొనాలని కోరుకొందాం.

తేదీ : 31-10-2017

సామల రమేష్‌బాబు

- డా॥ నలిమెల భాస్కర్
9704374081

తేట తెలుగు ఊటలు- తెలంగాణ మాటలు

ఇట్లాంటి జాతీయాల తీరు తీయాలు చెప్పనలవి కానివి. ఇటువంటి తెలుగు పదాల అర్థతాత్పర్యాలు వర్ణించవీలులేనివి. వేలాది అమ్మనుడులు తెలుగులో అతివేలంగా వుండి తమ తెలుగుతనాన్ని వేనోళ్ళ చాటుతున్నాయి. వివరించి చెప్పే వీలున్నప్పుడల్లా వీటి గురించి విశదం చేసుకోవడమే అసలు సిసలు విషయం.

తెలంగాణ భాషలో దేశిపదాలు దోసిళ్ళకొద్ది దొరుకుతాయి. తెలంగాణా పల్లెవాసుల సంభాషణలోను, సరస సల్లాపాల్లో , కోపతాపాల్లో దేశ్యాల పాళ్ళే ఎక్కువ. ఏమాత్రం విద్యాగంధం లేని గ్రామీణులు గతానుగతికంగా తమకు సంక్రమించిన ఈ తేటతెలుగు మాటల్ని వినియోగిస్తారు. వీరి భాషా వ్యవహారంలోని ఈ పద ప్రయోగాలు గుండెలోతుల్లోంచి వచ్చే నిర్మల ప్రవాహాలు. ఈ అమ్మభాష లోని నుడులు తత్సమ తద్భవాలు కావు. అన్యదేశ్యాలు అసలే కావు. మమతానురాగాలు వెల్లివిరిసే తల్లిపలుకులు.

తెలంగాణ పల్లీయుల మాటల్లో "కంటు" ఒకటి. దీనికి పగ, విరోధం అని అర్థాలు. ఆ అర్థాల్లో ఈ పదం సమర్థంగా వ్యవహారం ఉంది. అందరికీ కంటు అయినంక మనం ఎట్ల బతుకుతం?" వంటి వాక్యాలు నిత్యం జనం నోళ్ళలో వినబడుతుంటాయి. విరోధమూ, శత్రుత్వమూ మొదలైన సంస్కృత పదాలకు బదులు ఈ తెలుగు పదం నిరాఘాటంగా ప్రయుక్తమవుతున్నది. మరొకటి "కంటె". తెలుగులో తత్సమాదుల ప్రభావం ఎక్కువ కనుక మనం క్రమంగా అమ్మనుడుల్ని మరిచిపోతున్నాం. "కంఠాభరణం" అంటే అర్థమయి పోతుంది చప్పున. కంఠమూ, ఆభరణమూ...ఇవి రెండూ తెలుగు మాటలు కావు. "కంటె" అచ్చ తెనుగు మాట. అందుకే శబ్దరత్నాకర కర్త బహుజనపల్లి సీతారామాచార్యులు దీనికి "మెడను ధరించెడి చక్రాకారపు స్వంగాభరణ విశేషము" అని అర్థం చెప్పారు. తెలంగాణ పల్లెల్లో జానపదులు కంటెలు ధరిస్తారు.

తెల్లకాయితాలు మనందరికీ తెలుసు. ఆ కాగితాలు నాణ్యమైనవి కాని సందర్భాల్లోనూ, అవి చాలా పాతబడి పోయిన సమయాల్లోనూ వాటిని "కంది కమ్మలు" అంటారు. అంటే ఆ కాయితాలకు అంతకు ముందున్న తెలుపు పోయి అవి క్రమంగా కందివర్ణం లోకి మారిపోయినవన్నమాట! లేదా "కందు" అనే క్రియకు వున్న "నలుపగు" అన్న అర్థాన్ని ఆపాదించవచ్చు. కంది కమ్మలు అంటే కాస్తనలుపు రంగుకి దగ్గరగానూ, కంది వర్ణానికి సమీపంగానూ వున్న బాపతు.

ఇవాళ అందరం బాల్‌పాయింట్ పెన్నులు వాడుతున్నాం. గానీ మునుపు ఫౌంటేన్ పెన్నులు వుండేవి. వాటిలో సిరా నింపవలసి వచ్చేది. ఆ తర్వాత రాత రాయడానికి పూనుకొనేవాళ్ళం. అయితే అలా రాసేటప్పుడు సాధారణంగా చాలా పెన్నుల్లోంచి పోసిన సిరా కారుతూ చేతివేళ్ళన్నీ సిరామయం అయ్యేవి. తెలంగాణలో ఇటువంటి పెన్నుల్ని చూసి "ఈ పెన్ను గోరంగ కక్కుతుంది" అని అంటారు. "కక్కు" అనేది కడుపులోనిది వెలిపుచ్చడం. కలాల కడుపుల్లోంచి వెడలిరావడం కనుక పెన్ను కక్కడం అన్నమాట! అసలు కలం కక్కడం అన్నది ఎంత కళాత్మకం! మరెంత కవితాత్మకం!!. "ఇంకెంత సృజనాత్మకం!!

తెలుగు భాషలో "కట్టడి" అనేమాట తరచూ వినవస్తుంది. కానీ ఈ మాట శబ్దరత్నాకర నిఘంటువులో లేనే లేదు. అది "కట్టడ" రూపంలో వుంది. అంటే "నియమము" అని అర్థం. అందుకే తెలంగాణలో ఈనుడి అచ్చు అదే రూపంలో "వానికి ఏమన్న కట్టెడ చేస్తే మంచిగుండేది. వాడు తెగిన పతంగి (గాలిపటం)" అనే వాక్యాల్లో వ్యవహృతం.

ఉగాది పండుగనాడు పచ్చడి చేసుకోవడం, పంచాంగం వినడం వంటిది సర్వసాధారణం. అంతే ప్రాయికంగా అరోజు భక్ష్యాలు చేస్తారు. వీటినే పోవెలు అనికూడా అంటారు. సాధారణంగా ఈ పోలెలకు శనగపప్పును వాడుతారు. ఉడకబెట్టగా మిగిలిన రసాన్ని "కట్టు" అంటారు. ఈ "కట్టుచారు" నూతన సంవత్సరాది నాడు దాదాపు ప్రతి కుటుంబంలో వుంటుంది. తెలుగు నిఘంటువులు "ఉడికిన కందిపప్పులోనగువాని రసము" అని అందువల్లే అర్థవివరణ చేసింది. భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలందరూ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఏకత్రాటిపై నడిచారు. ఈ ఏకత్రాడులో "ఏక" సంస్కృతం. "త్రాడు" తెలుగు. ఇది తమాషా సమాసం. మరి తెలంగాణలో దీన్ని ఏమంటున్నారు? "అందరూ ఒక్క కట్టుమీద వున్నరు" అని వ్యవహరిస్తున్నారు. ఇందులో "ఒక్క" తెలుగు. "కట్టు" సైతం తెలుగు. ఇది పూర్తి ద్విగు సమాసం. ఆయా ఉద్యమాల్లో ఆయా నిబంధనలతో ప్రబలి వుండడమే "ఒక్క కట్టుమీద ఉండుడు".

పూర్వం తెలంగాణ పల్లెల్లోకి "గొంగళ్లకూ కడలు ఏస్తం" అంటూ వీధివీధినా కొంతమంది తిరిగేవారు. ఈ కడలు వేయడం ఏమిటి? గొంగళ్ళను గుడ్డలు నేసినట్లే నేసి వదిలితే వాటి చివరల్లోని వున్ని దారాలు కొంతకాలానికి విచ్చుకొని వూడిపోతాయి. అట్లా పోకుండా వుండాలంటే వాటికి "కడలు" వేయాలి. "కడ" అంటే అనేక అర్థాలు. ఇక్కడ కడ అంటే పార్శ్వము, ప్రక్క, చివర, అంతము అని గ్రహించాలి. "కడ" అన్నది ఎంత చక్కని మాట!

"ఏమో మందిలకు రాక కడకడలు పోతున్నవేందిరా?" వంటి ప్రశ్నలోని "కడకడలు" ఏమిటి? కొంతమంది సాంఘికీకరణం చెందక జనాల్లో వుండక ఏకాకులు అవుతుంటారు. వీరు జనానికి కొంత దూరంగా జరిగిపోతుంటారు. బహుశః వీళ్ళు అంతర్ముఖులు కావచ్చు. మరి "కడకడలు"కు అర్థం ఏమిటి? కడ అంటే దూరం అన్న అర్థమూ వుంది. తెలంగాణ మాట ఎంత అర్థవంతమో అర్థమవుతుంది కదా!

"కడమ" పదానికి కొలుత, శేషము అని అర్థాలు. ఈ పదం చాలా చక్కగా జానపదుల మాటల్లో వినవస్తుంది. "కడుమపైసలు ఎన్ని వున్నయో చెప్పు. మిగిలిన డబ్బులు ఎంతో చెప్పమనే భావం వుంది పై వాక్యంలో. మిగిలిన, మిగతా, శేషముగా వున్న పైసలు

ఎన్ని, అని ప్రశ్నలో ఆ అర్థంలో "కడమ" వుంది. ఇది దేశ్యం.

"అక్కడ పెండకడి వుంది. దాన్ని తీస్కరాపో" అని తల్లి, బిడ్డను అడుగుతున్న సందర్భంలోను "కడి" ఏమిటి? "కడి"కి నిఘంటువులు ముఖ్యంగా శబ్దరత్నాకరము కబళము, వాసన అని రెండు అర్థాలను యివ్వడం జరిగింది. ముద్దకు ముద్దగా ఒకచోట పడివున్న పేడను పెండకడి అంటారు తెలంగాణలో.

"కమ్మ" పదం పరిశీలించదగింది. దీనికి "స్త్రీకర్ణభూషణము, పత్రిక మొదలైన అర్థాలున్నాయి. పూర్వం తాటి ఆకులను ఒక విధంగా తయారుచేసి చెవులకు ధరించడం వల్ల అవి కమ్మలు అయ్యాయి. మరి 'పత్రిక" ఏమిటి? తెలంగాణలో కమ్మ అనే మాటకు ఈ అర్థం లేదు. "కాగితము" అనే పదానికి బదులుగా కమ్మలు అని అంటుంటారు. "ఈ వయ్యి (పుస్తకం)ల ఎన్ని కమ్మలు వున్నై?" వంటి వాక్య ప్రయోగాలు బహుళం. దీనికీ చరిత్ర వుంది. మునుపు తాళపత్రాల మీదే ఘంటంతో రాసేవాళ్ళు. కనుక ఆ తాటి కమ్మలే తెలంగాణ తొలి పుస్తకాల్లో కమ్మలూ, కాయితాలూ.

"కర్జకాయలు" అనే భక్ష్యవిశేషాలు తెలంగాణలో "గర్జెలు"గా మారివున్నాయి. గర్జెలు లోని పదాది సరళం ద్రావిడ భాషా లక్షణం వల్ల వచ్చి చేరింది. ఇట్లా పదాది సరళాలు వున్న పదాలు విరళంగానే వున్నాయి. "కోలుకొను" అనే క్రియ "గోలుకొను" రూపంలోనూ, తగ్గట్టు అనే పదం "రగ్గట్టు" గానూ ప్రయోగించబడుతున్నాయి.

"ఫలానా మనిషి కర్రెగా వున్నడు" అనే తెలంగాణ వాక్యంలోని "కర్రె" గమనించదగినది. నల్లగా వున్నాడు అని అర్థం దీనికి. "కఱ్ఱ" అంటే కొయ్య అనే నామవాచకార్థమే కాకుండా నలుపు అనేరంగు కూడా వుంది. దానికి అర్థం మారుమూల పల్లెటూరి జనాల మాటల్లో ఈ "కర్రె" పదం నలుపు అర్థంలో దొర్లుతూ వుంటుంది. ఇది తెలుగు పదమే!

"ఆ ముచ్చట విన్నంక నా కడుపు కలికలి అయింది" వాక్యంలోని "కలి" పదానికి పులియబెట్టిన కడుగునీరు అని అర్థం. కడుపు కలికలి కావడం అంటే గుండె చెరువు అవడం వంటి మాట. ఇంతేగాక, మనసు కలికలి అయింది అనికూడా కొన్ని సందర్భాల్లో అంటుంటారు. హృదయ విదారకమైన మాటల్నీ, దృశ్యాల్నీ వినీ కన్న వేళల్లో తెలంగాణలో కడుపు లేదా మనస్సు కలికలి అవుతుంది. గుండె చెరువు కావడం ఎంత తెలుగో, కడుపు కలికలి కావడం అంత తెలుగు. హృదయ విదారకం మాత్రం సంస్కృతం.

"కెలకు" అనే సకార్మిక క్రియకు కలపెట్టు, పెల్లగించు అని అర్థాలు. ఈ కెలకు తెలంగాణలో "గెలికి కయ్యం పెట్టుకుంటడు"అని వాక్యంలో నిక్షేపంగా వుంది. గెలకడం అనడంలో పదాది సరళం చోటుచేసుకుంది. కొందరు అనవసరంగా కొట్లాటలకు మూలకారకులవుతారు. వాళ్ళు కొందరు అనవసరంగా కొట్లాటలకు మూలకారకులవుతారు. వాళ్ళు కయ్యాలమారులు. కలహ శూరులు. ఈ "గెలికి కయ్యం పెట్టుకోవడం" తెలంగాణేతర ప్రాంతాల్లో "గిల్లి కజ్జాలు పెట్టుకోవడం"గా వుంది. గిల్లడం గెలకడం వంటిదే. కయ్యమన్నా, కజ్జమన్నా, కలహమని ఒకే అర్థం. యమున జమున అయినట్లూ, యాత్ర జాతరగా మారినట్లూ కయ్యం కజ్జమై పోయింది. ఈ య, జ అనే రెండు అక్షరాలకు ఎలాంటి కయ్యం లేదు. అవి పరస్పరం మారుతాయి.

తెలంగాణలో వినబడే "కీక" మూలరూపం "కేక" దీనికి అర్థం పెద్దకూత. "పిల్లలు ఉత్తిగ కీకలు పెడుతుండ్రు" అంటే కేకలేయడమే! అందుకే "కూతవేటు" దూరం తెలంగాణలో "కీకపెట్టు" దూరంగా మారివుంటుంది. కూత, కేక, కీక సమానార్థకాలు. అన్నీ తెలుగుపదాలు. కూత వేటులోని వేటూ, కీకపెట్టులో వున్న పెట్టూ పర్యాయపదాలే! ఏకార్థ బోధకాలే!!

"వాడేమో కైలాట్కం చేస్తున్నడు. ఈ కైలాటం మంచిది కాదు."... ఇవి రెండు తెలంగాణ వాక్యాలు. మొదటి కైలాట్కం పదానికి అర్థం మాయోపాయం. రెండవ కైలాట్కం మాటకు కొట్లాట అని. ఈ పదమేతెలుగు భాషలో "కైలాటము" అని వుంది. "తానును గజాస్యుడు లక్ష్మియు చేసినట్టి కైలాటమునన్ ఘటిల్లె సకలార్థము" అని శ్రీనాథుడు తన కాశీఖండంలో రాశాడు. ఇట్లా రాసులు పోసిన దేశిపద సౌరభం తెలంగాణ భాషా నందనంలో పుష్కలంగా వుంది.

"కొంకుల మీదికెల్లి కొడితే దయ్యం పోతది బిడ్డా!" వాక్యంలో "కొంకుల" గురించి జంకూ గొంకూ లేకుండా నిఘంటువులు అర్థ వివరణ చేశాయి. మోకాలి చిప్పకు లోతట్టు రెండు ప్రక్కలనుండెడి ఎముకలే కొంకులు. "కొంకి" ఏకవచనం. ఈ అర్థంలో ఈనాటికీ ప్రజల వ్యవహారంలో ఈ పదం వుంది. ఇంక "కొంక" గురించి చూద్దాం. త్రవ్వుగోల వంటి పనిముట్టు కొంక. మరి దీనికి అర్థం? కొంకరగా వుండునది కొంక. మళ్ళీ కొంకర అంటే ఏమిటి? వంకరే కదా! ఆ ఉపకరణం వక్రంగా దాదాపు 'వి' అనే ఆంగ్లాక్షర రూపంలో కొయ్యతోనూ, చిన్నపాటి ఇనుపకర్రుతోనూ వుంటుంది. అదే "కొంక", చలికి వేళ్ళు కొంకర్లు పోవడం సహజం. ఇవన్నీ తేటతెలుగు పదాలు.

"కొంపోవు" మొదలైన క్రియలు చక్కగా ప్రాచీన పద్యగ్రంథాల్లో వాడుకలో వున్నాయి. ఇది దేశి సకర్మక క్రియ. దీనికి అర్థం తీసుకొని పోవు. నిజానికి తీసుకొనిపోవులోని "కొనిపోవు" కొంపోవుగా మారింది. ఈ "కొంపోవు" క్రియ తెలంగాణంలో కొంటపోవు, కొండవోవు, కొంచవోవులుగా అనేక అవతారాలు దాల్చింది. మరి కొండవోవు, వంటి క్రియలు ఎక్కడివి? తమిళంలో "కొండుపోగువుదు" ఒక క్రియ. అర్థం తీసికొనిపోవడమే! ఆ కొండుపోగువుదే తెలంగాణ కొండవోవుడు. కొన్ని సందర్భాల్లో అంటే శవాన్ని తీసుకొని వెళ్ళేటప్పుడు "కొండవోవు" క్రియ ప్రయుక్తమవుతున్నది.

పెద్దబాన వంటి "కాగు"ను "కొట్టె" అంటారు కొన్ని ప్రాంతాల్లో. ఇదీ తెలుగుమాటే! మట్టి ఒరలంతగా దళసరిగా వున్న పాత్రనూ, కాగునూ కొట్టె అంటారు.

కొలదికి మారురూపమైన "కొద్ది" చక్కగా తెలంగాణ వ్యవహారంలో వుంది. రవంత, అణువంత, పిసరంత, ఇసుమంత, కించిత్తు, ఈషత్తు వంటి పదాలకు చాల గొప్పగా "కొద్దిగంత" అంటుంటారు. ఇందాకటి మాటల్లో అణువూ, కించిత్తూ, ఈషత్తూలు సంస్కృతాలు. తెలంగాణ మాట కొద్దిగంతలోని కొద్దిగ పూర్తి తెలుగుపదం. ఇంకా కొన్ని సందర్భాల్లో ముత్తెమంత, పగుడమంత అనీ పేర్కొంటారు. కొన్ని ప్రాంతాల్లో తొడెమంత, గోంత అనడం కద్దు. 'గోంత' అంటే 'కొంత' అనే తెలుగుపదం. చిన్నయసూరి సైతం "తోడెంబుతోడనె పొద్దు పుచ్చుకొనియెద" అన్నాడు మరి! కొంచెమంత అనే పదం కూడా వాడుకలో వుంది. ఇతర ప్రాంతాల్లోని కాస్తో కూస్తోలు క్రమంగా కాసు అంత, కూసు అంతలు. కాసు చిన్నది. కూసు అంటే చిన్నబిడ్డ. అభ్యాసం

(తరువాయి 14వ పుటలో)

-పెద్దింటి శారంగపాణి
9959941944

నిరంతర 'అసమగ్ర' మూల్యాంకనం

కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందనే సామెత తెలియని తెలుగు వారుండరు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తుత విద్యా విధానంలో భాగంగా ప్రవేశపెట్టిన నిరంతర సమగ్ర మూల్యాంకన పరిస్థితికి ఈ సామెత అచ్చుగుద్దినట్లు సరిపోతుంది. దీనికి ముందున్న విద్యావిధానంలో ఆయా వాచకాలన్నింటిలోనూ విషయానికే ప్రాధాన్యత ఉండేది. పరీక్షల్లో కూడా విషయ సంబంధ ప్రశ్నలకు పెద్దపీట వేసేవారు. ఇదే విధానంలో కొన్ని తరాలు జ్ఞానాన్ని పొందాయి. దీని స్థానంలో బోధనాభ్యసనంలో నిరంతర సమగ్ర మూల్యాంకనమనే నూతన విధానానికి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. గతంతో పోలిస్తే ఈ విధానంలో తయారైన వాచకాలన్నింటిలో విషయ సమగ్రత లోపించింది. అలా సమగ్రత లోపించిన వాచకాల ద్వారా సమగ్రతను పెంపొందించాలని భావించడమే ఈ విధానంలో కనిపించే వింత.

వింత వాచకాల నిండా ఎక్కడ చూసినా చదవండి- ఆలోచించి చెప్పండి; అవగాహన- ప్రతిస్పందన, సృజనాత్మకత; ప్రశంస వంటి శీర్షికలు విస్తరించి ఉన్నాయి. విద్యార్థిని అడిగే ప్రశ్నలు సూటిగా, స్పష్టంగా వీలైనమేర సంక్షిప్తంగా ఉండాలన్న కనీస నియమాన్ని మరిచి కొండవీటి చాంతాడులా తయారు చేయటం ఈ వాచకాల ప్రత్యేకత. వీటిని అర్థం చేసుకోవడంలోనే ఎక్కువమంది విద్యార్థులు గందరగోళానికి గురి అవుతున్నారు.

నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా తయారయిన వాచకాలలో పాఠాల ఎంపికలో విషయ- భాషా- సాహిత్య స్థాయిలను ఎక్కడా దృష్టిలోకి తీసుకొన్న దాఖలాలు కనిపించవు. ఎక్కడో స్నాతక- స్నాతకోత్తర స్థాయిలో ఉండవలసిన అంశాలకు వాచకాలలో స్థానం కల్పించారు. ఉదా॥కు10వ తరగతిలో 'మా ప్రయత్నం' పేరుతో ఇచ్చిన స్త్రీవాద నేపథ్యం గల పాఠ్యాంశం బోధన మరియు అభ్యసనలో కత్తిమీద సాము లాంటిదే. అలాగే ఉపవాచకంగా "రామాయణాన్ని" ఇచ్చిన అయ్యవార్లు "సముద్ర లంఘనం" పద్య పాఠ్యాంశానికి స్థానం కల్పించారు. ఒక కథాంశానికి చెందిన ఒక ప్రక్రియను మాత్రమే వాచకంలో ఉంచాలి. ఈ కనీస నియమాన్ని మరిచిన రచయితల ప్రతిభను ఏమని కీర్తించాలి. ఇవి మచ్చుకు కొన్నే. ఒక్కో తెలుగు వాచక పరిశీలనలో ఇలాంటి పంటికింద రాళ్ళు ఎన్నో సాక్షాత్కరిస్తాయి. ఇవి విద్యార్థుల పాలిట శాపాలు కావా!

నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా పరీక్షా విధానంలో కొన్ని మార్పులు చోటు చేసుకొన్నాయి. యూనిట్ల స్థానంలో సంగ్రహణాత్మక మూల్యాంకనం ప్రవేశించింది. దీనిలో ప్రాజెక్టు, పుస్తక సమీక్ష, రాత అంశాలు భాగస్వాములయ్యాయి. వీటికి కూడా మార్కులు కేటాయించారు. దీనితో విద్యార్థి స్థితి పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లయింది. "ప్రథమ్" వంటి స్వచ్ఛంద సంస్థల నివేదికలు విద్యార్థుల్లో భాషా, గణిత నైపుణ్యాలు లోపిస్తున్నాయన్న సంగతిని పదే పదే గుర్తుచేస్తున్నాయి. అలాంటప్పుడు కనీస భాషా నైపుణ్యాలు లేనివారు ప్రాజెక్ట్, పుస్తక సమీక్ష వంటి అంశాలను ఎలా పూర్తి చేయగలరు?

మూల్యాంకనంలో భాగంగా ఎవరికి ఇష్టమొచ్చిన రీతిలో వారు ప్రాజెక్ట్ అంశాలను ఇస్తున్నారు. దీనితో ఈ విషయంలో ప్రామాణికత కొరవడిందనే చెప్పాలి. చివరికి ప్రాజెక్టుల పుణ్యమాని నెట్‌సెంటర్లు కళకళలాడుతున్నాయి. వీటి ప్రయోజనం అర్థంగాని తల్లిదండ్రులు వెలవెల పోతున్నారు. పల్లెల్లో నెట్‌సెంటర్లు లేక విద్యార్థులు ప్రాజెక్టు పనులు పూర్తిచేయలేక విలవిలలాడుతున్నారు. నన్నయగారి భారతానికి అన్నయ్య వ్యాఖ్యానం అన్నయ్యదే! కన్నయ్య వ్యాఖ్యానం కన్నయ్యదే" అన్నట్లుగా ప్రాజెక్టుల విషయంలోని పరమార్థాన్ని కొందరు అయ్యవార్లు గాలికొదిలేశారు.

"పుస్తక సమీక్ష" పేరుతో జరిగే తతంగమంతా ఎక్కడో పుస్తకంలో ఉన్న అంశాన్ని ఎత్తి రాయడంగా తయారయింది. విద్యార్థి తనదైన సృజనాత్మకతతో రాయవలసిన రాత అంశాలన్నీ "మార్గదర్శిని" (గైడ్)లో నుంచి దిగుమతి చేసుకోవడం పరిపాటి అయింది. ఇలా లోపభూయిష్టంగా ఉన్న ఈ నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రకృతా? వికృతా? దీనికి సమాధానం దీని రూపకర్తలు, రచయితలు, సంపాదకులు, రాష్ట్ర విద్యా పరిశోధక శిక్షణా సంస్థ నుడువరులు (ఉపన్యాసకులు) చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇదే క్రమంలో ఆలోచనను కొనసాగిస్తే...

శిక్షణ పొందిన ప్రభుత్వ అధ్యాపకులే ఈ విధానంలో ఇంతటి సంక్లిష్టతకు గురౌతున్నారు. మరి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఏమాత్రం శిక్షణ పొందని ఉపాధ్యాయుల పరిస్థితి ఏంటి?

ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివే 50% మంది చిన్నారుల భవితవ్యమేమిటి?

ఆంగ్ల మాధ్యమంలో చదివే విద్యార్థుల్లో 70% మంది కనీసం వాక్య నిర్మాణం ఆంగ్లంలో చేయలేని స్థితిలో ఉన్నారు. వారు ఆంగ్లం, సాంఘిక సామాన్యాది శాస్త్రాల్లో అవగాహనా నైపుణ్యానికి సంబంధించి ఇచ్చే ప్రశ్నలకు ఏవిధంగా సొంతంగా జవాబులు రాయగల్గుతారు?

హిందీలో చక్కగా రాయడం- మాట్లాడడం- వాక్య నిర్మాణం చేయడమనే నైపుణ్యాలలో 80%మంది వెనకబడి ఉన్నారు. ఇలాంటి వారు ఆయా పరీక్షలలో వ్యక్తీకరణ- సృజనాత్మకతకు సంబంధించి ఇచ్చే ప్రశ్నలకు సమాధానాలు ఎలా రాయగల్గుతారు?

తరగతికి 60 మందికి పైగా విద్యార్థులను కలిగిన పాఠశాలలు పల్లెల్లో ఉన్నాయి. ఇలాంటి పాఠశాలల్లో ఉపాధ్యాయుడు 5 తరగతులకు చెందిన విద్యార్థుల పుస్తక సమీక్షలు- ప్రాజెక్టులు- రాత అంశాలు మూల్యాంకనం చేయడానికి సమయం ఎలా సరిపోతుంది?

తరగతిలో ఆయా విద్యా ప్రమాణాలలో వెనుకబాటుతనాన్ని కనబరిచే విద్యార్థి యెడల ఉపాధ్యాయుడు వైయక్తిక శ్రద్ధ చూపడం ఆచరణలో ఎలా సాధ్యం?

ఈ విధానాన్ని ప్రవేశపెట్టే ముందుగా రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థవారు ప్రయోగాత్మకంగా ఎక్కడైనా పరిశీలించారా? లేదా నేరుగా రాష్ట్రంలోని విద్యార్థులందరిపై బలవంతంగా రుద్దారా?

వర్తమాన విద్యావ్యవస్థలోని అయోమయానికి, అర్థ రాహిత్యానికి అసమగ్రతకు బాధ్యత ఎవరు వహిస్తారు?

ఈ అవ్యవస్థ వల్ల చిన్నారులు పొందే మానసిక శ్రమకు, అనర్థాలకు సమాధానం ఎవరు చెబుతారు?

పై ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంలో వాచకాలతో ప్రత్యక్ష పరోక్ష సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ ఆత్మ విమర్శ చేసుకోవలసిందే! అంతేగాదు సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపవలసిన బాధ్యత కూడా వారిదే! అప్పటివరకు ఇది నిరంతర "సమగ్ర" మూల్యాంకనం కానే కాదు. ఇది నిరంతర 'అసమగ్ర' మూల్యాంకనమే.

–సంకేపల్లి నాగేంద్రశర్మ
9441797650.

రామప్ప గుడులకు యునెస్కో సొగసులు?

దక్షిణ భారతదేశంలోనే కాకతీయుల అపూర్వ శిల్పకళాసంపదలైన పూర్వ వరంగల్ జిల్లా వెంకటాపురం మండలం పాలంపేట రామప్ప గుళ్ళ వైభవాన్ని దేశ, విదేశీ యాత్రికులను ఆకర్షించి, తద్వారా మన వారసత్వ సంస్కృతిగల విశ్వ పర్యాటక కేంద్రంగా అభివృద్ధిపరచడానికి యునెస్కో గుర్తింపుతేవడానికై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆశయం ఫలించనున్నట్లు తెలిసింది. ఇందులకై వరంగల్‌లోని కాకతీయ హెరిటేజ్ ట్రస్టు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సహకారాన్ని అందించ డానికి ముందుకు వచ్చాయి. తెలంగాణా ఆవిర్భావం తర్వాత 2014 నుండి ఈ ప్రతిపాదనల్ని కేంద్రం దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొనిరాగా, గత ఫిబ్రవరిలో కేంద్ర టూరిజం శాఖామంత్రి మహేష్‌శర్మ తగిన సమాచారాన్ని పంపించాలని కోరినట్లు తెలిసింది. 804 సంవత్సరాల చరిత్రకల ఈదేవాలయ సముదాయాల్ని కాకతీయ గణపతి చక్రవర్తి సేనాని రేచర్ల రుద్రుడు నిర్మించినట్లు శాసనాధారాలు చెబుతున్నాయి. ఎత్తైన వేదికపై, నక్షత్రాకారంలో ఈదేవాలయాల నిర్మాణం జరిగింది. 2013లో ఈదేవాలయం 800వ వార్షిక ఉత్సవాలను రామప్ప ఆలయం లోనే నిర్వహించారు. ఒక పక్క కాకతీయ శిల్పాలు, గుడులపై అఖిల భారత పురావస్తు సర్వేక్షణా సంస్థచే (ఎఏస్ఐ)సర్వే జరుగుతుండగా, మరోపక్క యునెస్కో ప్రతిపాదనలు రామప్పకు రావడం గర్వించదగిన విషయమే. రామప్పకు గుర్తింపువిషయంలో కేంద్రం ప్రదర్శిస్తున్న చొరవను రాష్ట్ర పురాతత్వ పర్యాటకశాఖల మంత్రి అజ్మీరా చందూలాల్ ఆహ్వానించారు.

కేంద్రం సూచనల మేరకు పాలంపేటలోని రామప్ప దేవాలయా లను పరిశీలించడానికి గత నెల ఆగస్టు 14,15,16 తేదీలలో మూడు రోజులపాటు యునెస్కోతో సంబంధమున్న ఒక సాంకేతిక బృందం పర్యటించి వెళ్ళింది. ఈ బృందం వారిచ్చే నివేదికపై యునెస్కో గుర్తింపు లభిస్తుందా? లేదా అన్నది వేచిచూడాల్సివుంది. ఈమేరకు రామప్పకు సంబంధించిన తగిన సాంకేతిక నివేదికల తయారీలో కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖలు జమిలిగా నిమగ్నమై సహకారం అందిస్తున్నాయి. తెలంగాణా ఆవిర్భవించిన తర్వాత, హైదరాబాద్‌లోవున్న ఉమ్మడి ఆర్కియాలోజికల్ సర్వే ఆఫ్ ఇండియా రెండుగా ఇటీవల విభజనైంది. ఆంధ్రప్రదేశ్ కార్యాలయం అమరావతిలో ఏర్పాటు కాగా, తెలంగాణా విభాగం కార్యాలయం హైదరాబాద్‌లో కొనసాగుతోంది. ఆంధ్ర ప్రదేశ్‌లో 130 మాన్యుమెంట్స్ గుర్తింపుపొంది వుండగా, తెలంగాణాలో కేవలం 8 మాత్రమే గుర్తింపుకు నోచుకున్నవి. ఈరెండు విభాగాలకు విడివిడిగా కేంద్రబడ్జెట్‌లో కేటాయింపులు జరిగే అవకాశాలున్నాయి. తెలంగాణాలో రామప్ప సముదాయ దేవాలయాలు భారతీయ సర్వేక్షణా పురాతత్వ సంస్థ విభాగంలోవుండగా, గుర్తింపుపొందియున్న ఎనిమి దింటిని సమగ్రంగా అభివృద్ధి పరచడమే కాకుండా, వీటి సంఖ్యను కనీసంగానైనా 60వరకు పెంచాలన్న డిమాండ్ గట్టిగా తెలంగాణా చరిత్రకారుల నుండి వినవస్తున్నది. ఉమ్మడి రాష్ట్ర పాలనలో తెలంగాణా లోని పురాతన కట్టడాలెన్నో నిర్లక్ష్యానికి గురికావడమే కాకుండా, కనీస



పురావస్తు శాఖ విశ్రాంత అధికారి రంగాచార్యులు, ఏఎస్ఐ మల్లేశంతో కలసి బుధవారం రామప్ప ఆలయంలో శిల్పాలు పరిశీలిస్తున్న ప్రఖ్యాత నర్తకి, నృత్య పరిశోధకురాలు, యునెస్కో కన్సల్టెంట్ చూడామణి నందగోపాల్

ఆదరణకు నోచుకోలేక శిథిలదశకు చేరుకొని, నేలమట్టమైపోయాయి. ఇందులకు రామప్ప ఉప ఆలయాలు 18వరకు వుండగా ఇందులో చాలావరకు నేలమట్టమైపోవడమో, శిథిలదశకు చేరడమో జరిగాయి. గ్రహణం వీడని మరి కొన్ని ప్రాచీన కట్టడాలు శిథిలదశకు చేరుకుంటున్నాయి. హన్మకొండ లోని వేయిస్తంభాలగుడి వివాహ మండప పునర్నిర్మాణం పనులు పుష్కర కాలం దాటినా పూర్తి కాలేదు.

తెలంగాణాలో కాని, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో కాని యునెస్కో గుర్తింపుపొందిన కట్టడాలు ఇంతవరకు ఒక్కటైనా నమోదుకాకపోవడం విచారకరం. మహారాష్ట్రలో 4, కర్నాటకలో2, తమిళనాడులో2, గోవాలో ఒకటి నమోదయ్యాయి. గత 60ఏళ్ళ నుండి ఉమ్మడి రాష్ట్రంలో ఈశాఖ ప్రగతి పట్ల పాలకులు చూపిస్తున్న ఉదాసీనతల్ని ఖండించాల్సిందే. ఇప్పటికైనా కళ్ళుతెరిచి, తేరుకొని తగిన శ్రద్ధాసక్తులు చూపిస్తే ప్రాచీన కట్టడాలను రక్షించుకొనే అవకాశాలున్నాయి. యునెస్కో 1972నుండి ప్రపంచ ప్రసిద్ధ కట్టడాలకు, పాకృతిక అంశాలకు అంటే ఉద్యాన వనాలకు, జలపాతాలకు, వన్యమృగ అడవులకు గుర్తింపునిస్తోంది. 1983లో దేశంలో తొలిసారిగా మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లాలోని అజంతా, ఎల్లోరా గుహలకు గుర్తింపునిచ్చింది. 1983 నుండి 2017 వరకు దేశంలో యునెస్కోవారు 36 అంశాలకు గుర్తింపు నివ్వగా, ఇందులో 28 సాంస్కృతిక కట్టడాలు కాగా, మిగతావి ప్రాకృతిక అంశాలు. నడుస్తున్న ఈ 2017 సంవత్సరంలో గుజరాత్ రాజధాని అహమ్మదా బాద్ సిటీకి వారసత్వపు హోదాని కట్టబెట్టింది. గాంధీజీ నర్మదా తీరంలోని సబర్మతీ ఆశ్రమం ఇందులో చేరి వున్నాయి. అంతకు ముందు బీహార్‌లోని ప్రాచీన నలందా బౌద్ధవిశ్వవిద్యాలయానికి దక్కింది. పొరుగున వున్న మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, గోవా తదితర రాష్ట్రాలు యునెస్కో గుర్తింపుకొరకు తహతహలాడుతుండగా, రెండు తెలుగు రాష్ట్రాలు ఈగుర్తింపుతెచ్చుకోవడంలో పూర్తిగా వెనకబడి వున్నాయని చెప్పవచ్చును.

మిగతా రాష్ట్రాలతో పోల్చుతూ, ఒక విహంగవీక్షణంగా చూస్తే,

మన రెండు తెలుగు రాష్ట్రాలలో మన పురాతత్వ పర్యాటక విభాగాల ప్రగతి పరిస్థితి మరీ దారుణంగా, బలహీనంగా వుందన్న సత్యం స్పష్టమవుతోంది. హైదరాబాద్ తొలిరాజధాని నగరమైన గోలకొండ కోటను యునెస్కో పరిధిలోకి తేవడానికి విఫలయత్నం జరిగిన విషయం తెలిసిందే. కోట దురాక్రమణలే యునెస్కో గుర్తింపుకు అడ్డం పడ్డాయి. అలాగే చార్మినార్, కుతుబ్‌షాహీ సమాధులు వంటివి యునెస్కో పరిధిలోకి రావడానికి ఎదురుచూస్తున్నవి. అదే విధంగా హైదరాబాద్‌లోని మక్కామజీద్, వనపర్తి, కొల్లాపూర్, గద్వాల జిల్లా రాజసంస్థానాల కట్టడాలు, అలం పురం జోగులాంబ బ్రహ్మగుడులు, వరంగల్ కాకతీయ గుళ్ళు, జగిత్యాల జిల్లా కోటిలింగాల శాతవాహన స్థావరం, సూర్యాపేట ఛాయా సోమేశ్వరాలయం వంటివి అభివృద్ధి పరిస్తే తెలంగాణాలో పర్యాటక వైభవం బంగారుదశకు చేరుకోగలదు. కేంద్ర పురావస్తుశాఖ పరిధిలోకి ఈరెండు తెలుగు రాష్ట్రాలలోని పలు కట్టడాలు యునెస్కో గుర్తింపునకై వెళ్ళే అవకాశాలు పుష్కలంగా వున్నవి. ఆంధ్రప్రదేశ్‌లో శేషాచలం సప్తగిరులలో వున్న తిరుమల–తిరుపతి దేవస్థానాలు, మదనపల్లి హార్సిలీ హిల్స్, అనంతపురం జిల్లా లేపాక్షి, కదిరి, గోరంట్ల, పెనుగొండ దుర్గం, తాడిపత్రి దేవాలయాల శిల్పసంపదలు, కాళహస్తీశ్వరాలయం, ఒంటిమిట్ట కోదండరామాలయం, నాగార్జునకొండ, శ్రీశైల క్షేత్రం, దీన్ని అంటి పెట్టుకొని వున్న నల్లమల అడవులు వంటివి యునెస్కో గుర్తింపుకోలేదా, జాతీయ స్థాయిలోనైనా తగిన గుర్తింపునకు నోచుకునే అర్హతలు కలిగియున్నవి.

పూర్వ వరంగల్ జిల్లాలోని కాకతీయుల కట్టడాలైన వరంగల్ కోట, హన్మకొండ వేయిస్తంభాల దేవాలయం, పాలంపేట రామప్ప దేవాలయం వంటివి యునెస్కో గుర్తింపునకై తొలుత ప్రతిపాదించినట్లు తెలిసింది. మిగతావి రెండిటిని పక్కనబెట్టి, యునెస్కో వారు కనీసంగానైనా రామప్ప దేవాలయాన్ని గుర్తించడానికై తగిన విధంగా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్న తలంపుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోని పురావస్తు విభాగాల్లో కాస్త కదలికలు వచ్చినట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం తెలంగాణాలో జిల్లాల పునర్విభజనలో భాగంగా, రామప్ప దేవాలయం జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోకి వెళ్ళింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రాచీన చారిత్రిక, సాంస్కృతిక సంపదకు ఎంతగానో ప్రసిద్ధి చెందింది. ఇటీవల దట్టమైన అడవిలో పొదవుగావున్న ఒక శాతవాహన చారిత్రిక కోటగోడల స్థావరం, ములుగు దగ్గర గల కొత్తూర్‌లో కంబోడియన్ అంగర్‌వాట్ నమూనాగల ఒక బౌద్ధ శిల్పాల మయంగల చిన్న శిథిల దేవాలయం బయటపడటం, లక్నవరం చెరువు అందాలు, ఘనపురం కోటగుళ్ళు, జాతీయ గుర్తింపు కలిగిన ఏటూరు నాగారం అభయారణ్యం, సమ్మక్క–సారలమ్మ జాతరా ప్రదేశం ఈ జిల్లాలోనే వుండటంతో ఈజిల్లాకు ఘనమైన తెలంగాణా ప్రాచీన పురావస్తు వారసత్వ ప్రాధాన్యంతోపాటు, గిరిజన కోయ జాతరా సంస్కృతులు పుష్కలంగా వుండటాన్ని ఈ సందర్భంగా గమనించాల్సి వుంటుంది.

రామప్ప గుడిలోని వివిధ శిల్పాలను ఆగస్టు 14,15,16 తేదీలలో మూడు రోజులపాటు యునెస్కో కన్సల్టెంట్ బెంగుళూర్‌కు చెందిన సుప్రసిద్ధ నాట్యకారిణి చూడామణి నందగోపాల్, శాస్త్రీయ నృత్య పరిశోధకురాళ్ళు సౌమ్యా మంజునాథ్, డా.విద్యా సిమ్లడక బృందం, రాష్ట్ర పురావస్తు విభాగం విశ్రాంత అధికారి రంగాచార్యులతో కలిసి పరిశీలించి వెళ్ళారు. యునెస్కో గుర్తింపుపొందిన కర్ణాటకలోని హంపి, బాదామీ, పట్టదకల్ శివాలయం, తమిళనాడులోని మహాబలిపురం వంటి కట్టడాల ప్రత్యేకతలు, శిల్పాలు–నృత్యరీతులపై అధ్యయనం చేసిన గ్రంథకర్త శ్రీమతి చూడామణి నందగోపాల్‌ను ఈ సందర్భంగా ప్రత్యేకంగా పిలిపించారు. రామప్ప ఆలయంలో ఎక్కువగా నృత్య భంగిమలు ఉండటంతో ప్రసిద్ధ నృత్యకళాకారిణితో పరిశీలింప చేయటానికి అవకాశం ఏర్పడింది. కుడ్యాలు, పై కప్పులపై చెక్కిన మురళీధర కృష్ణుడు, గోపికా వస్త్రాపహరణం, సాగర మథనం, అష్ట దిక్పాలకులు, రామాయణ, భాగవతం, మహాభారతంలోని పురాణ ఘట్టాలు, కైలాసం పార్వతీశివుల తాండవ నృత్యాలు, కోలాటాలు, వాయిద్యాలతో కూడిన శిల్పాలు, నాగిని, యక్షిణిల వంటి నగ్న శృంగార భంగిమలు వంటి వాటన్నింటిని ఆమె నిశితంగా పరిశీలించారు. యువతి చీరెను కోతి లాగుతున్నప్పటి, యువతి హైహీల్స్, యువతి కాలుకు ముల్ల గుచ్చుకున్న వంటి శిల్పాలు ఆకాలం నాటి చంచల స్వభావాన్ని తెలియజేస్తున్నాయని ఆమె ఒక విలేఖరికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. కాకతీయ చక్రవర్తి గణపతిదేవుని సేనాని, బావమరిది, గజదళాధిపతి జాయపసేనాని క్రీ.శ. 1250లో రచించిన నృత్తరత్నాకరం అనే గ్రంథంలోని వర్ణనలకు, రామప్ప ఆలయ శిల్పాకృతులే ప్రేరణ అని ఆమె తేల్చారు. ప్రసిద్ధ నృత్యకారుడు కీ.శే. నటరాజ రామక్రిష్ణ రూపొందించిన పేరిణీ శివతాండం, లాస్యనర్తనం వంటి నృత్యరూపాలకు ఇక్కడి శిల్పాలే స్ఫూర్తినిచ్చాయి. డా. నటరాజ రామక్రిష్ణ ఇక్కడే కొంతకాలం వుండి ఇక్కడి నృత్యభంగిమలను పరిశీలించి, అద్భుతమైన ఈ నృత్యప్రక్రియను రూపొందించారు. క్రీ.శ. 7,8 శతాబ్దాలకు చెందిన మహాబలిపురం, క్రీ.శ.8,9 శతాబ్దాలకు చెందిన బాదామీ పట్టదకల్ శివాలయం, తదితర నిర్మాణాలు, క్రీ.శ. 11వ శతాబ్దానికి చెందిన తమిళనాడు తంజావూర్ బృహదీశ్వరాలయం, క్రీ.శ. 16వ శతాబ్దానికి చెందిన కర్నాటక విజయనగర హంపీ కట్టడాలు యునెస్కో వారి గుర్తింపుకు నోచుకున్నాయి. వాటికంటే ఈ రామప్ప శిల్పాలు ఏ విధంగా చూసినా తీసిపోవని చూడామణి నందగోపాల్ వ్యాఖ్యానించారు. రామప్ప దేవాలయంలోని గర్భగుడి, ముందటి మండపం, రంగమండపం, నంది మండపం, ప్రాంగణ శిల్పాలు, నాగిని, యక్షిణిల శిల్పాలు, కాటమ, కామేశ్వరాలయాలు చూపరులకు కనువిందుచేస్తాయి. ఈమేరకు ఈ అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను తయారు చేయడంలో ఆమె నిమగ్నమై వున్నారు. రామప్పలోని ప్రధాన దేవాలయమే కాకుండా, కామేశ్వరాలయం మాత్రమే కేంద్ర పురావస్తుశాఖ పరిధిలో వున్నాయి. కామేశ్వరాలయం పునర్ నిర్మాణ పనులు గత ఏడు ఏళ్ళ కిందట ప్రారంభించినా, వాటి నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. రామప్ప గుడి వాయువ్యంలోని ప్రహరీ ఆగస్టులో కురిసిన వర్షాలకు నాని, గోడ దశలవారీగా నలభై మీటర్ల వరకు కూలినా పట్టించుకునే నాథుడేలేడన్న విమర్శలు వస్తున్నాయి. అంతేకాక గర్భగుడిలోని రామప్ప లింగంపై, ఉపరితల ప్రాకారాల నుండి ఉరుపులుండి వర్షం కురుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్న ఆరోపణలున్నాయి. ఆగస్టు 20న కురిసిన జడివానలకు రామప్ప పరివారంలోని ఒక శిథిల దేవాలయం కూలిపోయింది. ఉపాలయాల మరమ్మత్తుల మాటే లేదు. 2010–11సంవత్సరాలలో రామప్ప దేవాలయాలను దేవాదుల సొరంగాల నిర్మాణాదుల నుండి పరిరక్షించడానికి, అలైన్‌మెంట్ మార్చడానికి,



కాంట్రాక్ట్ తీసుకున్న కోస్టల్ కంపనీ దురాగతాల్ని ఎండగడుతూ అప్పటి తెలంగాణావాదులు, రచయితలు పెద్ద ఎత్తున తరలివచ్చి రెండేళ్ళు ఉద్యమించారు. పలు సదస్సులు, ధర్నాలు నిర్వహించారు. జూన్ 17,2012న రామప్పకోవెలలో పదివేల దివ్వెల జాతరను ఘనంగా నిర్వహించి, అప్పటి ఉమ్మడి రాష్ట్ర విధానాలపై ప్రజాసంఘాలన్నీ ఏకమై ధ్వజమెత్తాయి.

తెలంగాణా ఉద్యమానికి ఊపిరి పోసిన రామప్ప దేవాలయ పరిరక్షణ ఉద్యమం, తెలంగాణా సాధన తర్వాత అడిగేవారు లేకుండా పోయారు. ఆనాటి నుండి నేటి వరకు తెలంగాణా వచ్చి మూడేండ్లు గడిచినా రామప్ప వంటి దేవాలయాల మరమ్మత్తులపై పాలకులు పైసా కూడా ఖర్చు చేయకపోవడాన్ని తెలంగాణా చరిత్రకారులు విమర్శిస్తున్నారు. యాత్రీకులకు ఒక సమగ్ర కాకతీయ టూరిజం కారిడార్ సర్క్యూట్‌ను అభివృద్ధిపరచాల్సివుంది. యునెస్కో నిబంధనలమేరకు కొంతమేరకైనా అభివృద్ధి పరిస్తే, రామప్ప దేవాలయానికి, శిల్పాలకు యునెస్కో గుర్తింపురావడంలో ఏ మాత్రం సందేహం లేదన్న వాదనలు వినవస్తున్నాయి. కర్నాటకలోని విజయనగరం-హంపీలో నిర్వహించేలా, రామప్ప కళోత్సవాలను ప్రతి ఏటా నిర్వహించాలని, ప్రచారంతోపాటు, చరిత్ర ప్రాశస్త్యాన్ని పెంచాలని చరిత్రకారులు కోరుతున్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ప్రతినిధి, వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బి.వి.పాపారావును కలుసుకొని చూడామణి నందగోపాల్ బృందం బెంగుళూరు వెళ్ళినట్లు రాష్ట్ర పురావస్తు అధికారులు తెలిపారు. శ్రీమతి చూడామణి వెంట ప్రసిద్ధ నృత్యకారిణులు డా.విద్యాసిమ్లుడక, డా.సౌమ్యా చవాన్‌లున్నారు. వీరు రామప్ప శిల్పరీతులు, నృత్యభంగిమలపై లోతుగా అధ్యయనం చేస్తున్నారు. ప్రపంచ వారసత్వ సంపదలో చోటు దక్కడం అంటే, ఈశిల్పాల వల్ల వివిధ నృత్యరీతులతోపాటుగా, ఆ నాటి సాంఘిక జీవనం తెలిసివస్తుందన్నమాటే. భావితరానికి ఈనాటి అపురూప శిల్పాల వారసత్వ సంపదల్ని అందించడానికి పాలకులు అవసరమైన తగిన చర్యలు తీసుకోవాల్సివుందని ఆమె సూచించారు. తెలంగాణాకే కాక యావత్తుదేశానికి గుండెకాయైన రామప్ప శిధిల వైభవాన్ని పునరుద్దరించి, కాపాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని కోరుతూ, అక్టోబర్ 15న రామప్ప పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. తెలంగాణా ఆవిర్భావం తర్వాత కూడా తగిన చర్యలు తీసుకోకపోవడాన్ని వీరు తప్పుపట్టారు. రామప్ప దేవాలయాల అభివృద్ధికి 5వందల కోట్ల రూపాయల్ని కేటాయించి జీర్ణోద్ధరణను చేబట్టాలని వీరు కోరారు.

(10వ పుట తరువాయి)

తేట తెలుగు ఊటలు తెలంగాణ మాటలు

కూసువిద్యలో వున్నది ఈ కూసే! అమ్మకూచిలో వున్నదీ ఈ కూసే!! కాసు అంత, కూస అంతలు వరుసగా కాస్తా కూస్తా అయ్యి కాస్తో కూస్తోలుగా పరిణమించాయి. ఈ ఉదంతాన్ని ఇక్కడికి కాస్త ఆపుదాం మరి!

తెలంగాణలో "కొర్కాసు" అనే మాట వుంది. దీనికి మూలం కొఱకక. అంటే కొఱవి. పొయ్యిలోనికి వంట చెరుకుగా వాడుకునే కఱ్ఱ కాస్త కాలితే అది కొర్కాసు అవుతుంది. "బిడ్డా! ఊకుండకపోతే కొర్కాసుతో కాలుస్తా" అని బెదిరిస్తుంటారు తల్లులు తమ పిల్లల్ని. "ఎండ పొడుగాను! కొర్రోయి వోలె కొడుతుంది" అనే వాక్యాలు వినబడుతుంటాయి. ఈ కొర్రాయికి మాతృక తెలుగుభాషలోని కొఱవి. ఇదే కాస్త మారి కొఱవి. కొఱవిదయ్యంలోని కొఱవి సైతం యిదే!

ఇక "కొరిచీమలు" అనే మాటవుంది. ఇవి నిజానికి కొఱవి చీమలే! కొఱవిని పొరపాటున తాకితే ఎంత మంటగా వుంటుందో అంతే మంటనీ, నొప్పినీ ఈ కొఱవి చీమలు కలిగిస్తాయి. ఇవి పెద్దగా వుండే ఎఱ్రని చీమలు. తెలంగాణ ప్రాంతంలో కొఱవి చీమలు కొరిచీమలుగా కొంతమారినా మంట మాత్రం అంతే వుంటుంది.

"కొంప కొల్లారం అయింది" అనేది ఒక జాతీయం. కొలారం అనేది కొల్లారంలోనుండి వచ్చింది. కొల్లారం అంటే నడుమ బయలూ, నాలుగు వేపులా కట్టడం దగ్గర యిల్లు. అంటే సువిశాలమైనది అని అర్థం. కానీ పై జాతీయానికి భావం మాత్రం కొంప నాశనం కావడం. ఇట్లాంటి విరుద్ధార్థాలూ, ఇతర భావాలూ భాషలో రావడం సహజమే. కంపు అంటే ఒకప్పుడు సువాసన. ఇవాళ దుర్గంధం. వీటన్నింటినీ అర్థ విపరిణామంలో భాగంగా పరిశీలిస్తాం.

ఇట్లాంటి జాతీయాల తీరు తీయాలు చెప్పనలవి కానివి. ఇటువంటి తెలుగు పదాల అర్థతాత్పర్యాలు వర్ణించవీలులేనివి. వేలాది అమ్మనుడులు తెలుగులో అతివేలంగా వుండి తమ తెలుగుతనాన్ని వేనోళ్ళ చాటుతున్నాయి. వివరించి చెప్పే వీలున్నప్పుడల్లా వీటి గురించి విశదం చేసుకోవడమే అసలు సిసలు విషయం.

జనరంజక కవి ప్రతిభా పురస్కారాలు

మూడు సంవత్సరాలుగా జనరంజక కవి ప్రతిభా పురస్కారాలందిస్తున్న 'రావి రంగారావు సాహిత్య పీఠం' 2017లో కూడా ఈ పురస్కారాలకోసం కవిత్వగ్రంథాలను ఆహ్వానిస్తున్నది.

స్పష్టంగా సూటిగా సమాజ కేంద్రంగా భావయుక్తంగా ఉండే జనరంజక కవిత్వ గ్రంథాలు ఒక్క ప్రతి పంపితే చాలు. ఎంపికైన పుస్తకం కవికి ఒక్కొక్కరికి రు.2000రూ. నగదు, శాలువా, జ్ఞాపికతో గుంటూరు, బృందావన్ గార్డెన్స్, శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికమీద ఫిబ్రవరిలో ప్రముఖుల సమక్షంలో జరిగే సభలో సత్కారం జరుగుతుంది.

2013 నుండి 2017 వరకు ప్రచురింపబడిన పద్య, గేయ, వచన కవిత్వ గ్రంథాలను డిసెంబర్ 31లోగా పంపించాల్సిన చిరునామా: నర్రా ప్రభావతి, కన్వీనర్. రావి రంగారావు సాహిత్య పీఠం, 101, అన్నపూర్ణ నగర్, 5వ లైను తూర్పు, గోరంట్ల, గుంటూరు-522 034. ఫోను: 9247581825.

భాషోద్యమ
కథానిక

–సింగమనేని నారాయణ
94934 23442

ద్రోహఫలం

"**పది** రూపాయలంటే ఎంత తాతా?" తన మనవరాలు 'వర్ష' వేసి ప్రశ్నకు దిమ్మ తిరిగింది చలపతికి.


అసలు ఆ ప్రశ్న ఎందుకొచ్చిందంటే–

చలపతి తన జేబులో ఉన్న కొత్తపెన్నును తీసి మనవరాలికి ఇచ్చాడు ప్రేమగా–

"హౌమచ్ దిస్ పెన్" అని అడిగింది ఆ మనుమరాలు.

చలపతి "పదిరూపాయ లమ్మా" అన్నాడు.

అప్పుడడిగింది "పది రూపాయలంటేఎంత తాతా?" అని ఆ మనవరాలు.



ఏం సమాధానం చెప్పాలి?అసలు ప్రశ్నే అర్థంకాలేదు అతడికి.

ఈలోగా వంటింట్లోంచి వచ్చిన 'సృజన', "పది రూపాయలంటే 'టెన్ రుపీస్ బుజ్జీ" అంది. 'ఓహో' అంటూ తల పంకించింది వర్ష.

ఈ జవాబుకు ఏదో కొత్త తెలివి పుట్టుకొచ్చినట్టయింది చలపతికి.

చలపతి కూతురు సృజన – సృజన కూతురు వర్ష! తిరుపతిలో ఉన్న కూతురింటికి అనంతపురం నుండి నిన్ననే వచ్చినాడు చలపతి– తరచూ కూతురింటికి వచ్చి వెళుతుంటాడతడు.

"పది రూపాయలంటే తెలియదేమమ్మా నీ కూతురుకు. చాలా ఆశ్యర్యంగా ఉందే" అన్నాడు నిజమైన ఆశ్చర్యంతో చలపతి.

"నా కూతురుకే కాదు నాన్నా! ఈ యీడు పిల్లలెవ్వరికీ తెలియదు" అంది నవ్వుతూ సృజన.

"ఇప్పుడంతా ఇంగ్లీషు మీడియం కదా నాన్నా! ప్రతీదీ అనువదించి చెప్పాలిప్పుడు! మొన్న కింది పోర్షన్‌లో వున్న అమ్మాయి వచ్చింది మనింటికి. లావణ్య ఆ పిల్ల పేరు. మన వర్ష కంటే రెండేళ్లు పెద్దది. ఎనిమిదో తరగతి చదువుతూంది. వచ్చీ రాగానే, "మేనత్త అంటే ఎవరు ఆంటీ" అని నన్ను అడిగింది. ఇంగ్లీషులో మేనత్త నేమంటారో నాకు కూడా తెలీదు. "మీ నాన్న చెల్లెలమ్మా" అన్నాను. "మా నాన్నకు చెల్లెళ్లు లేరే" అంది. "చెల్లెలు లేకపోతే అక్క" అన్నాను.

"ఓహో నాన్నగారి అక్కా చెల్లెళ్లనిద్దరినీ మేనత్త అంటారన్న మాట. నేనింత కాలమూ 'ఆంటీ' అనే పిలుస్తు న్నాను. ఈ సంగతి మా

పిల్లలను వారి మాతృభాష నుండీ దూరం చెయ్యటం సాంస్కృతిక ద్రోహం అయితే, పేదల రక్తమాంసాలను భాష పేరుతో దోచుకోవటం ఆర్థిక ద్రోహం అనిపించింది చలపతికి!

క్లాస్‌మేట్స్‌కు చెప్పాలి" అనుకుంటూ వెళ్లింది ఏదో సత్యాన్ని కనుక్కొన్న దానిలా.

ఏదో సాంస్కృతిక ద్రోహం జరిగి పోతున్నట్టు తీవ్రమైన అశాంతికి గురైనాడు చలపతి.

ఇంగ్లీషు మీడియం తెచ్చిపెట్టే అనర్థం అతనికి తెలియంది కాదు. పది రూపాయలంటే తెలియని స్థితిలో ఈ కాలం పిల్లల తరం వుందంటే మాత్రం ఆశ్చర్యమే.

చలపతికిప్పుడు 75 ఏళ్లు. 35 ఏళ్లపాటు హైస్కూల్లో తెలుగు పండిట్‌గా పనిచేసిన వాడతడు. చూస్తూ చూస్తూ వుండగానే కళ్ల ఎదుటే జరిగిపోయిన పరిణామాలూ, విపర్యయాలూ అతనికి దిగ్భ్రమ కలిగి స్తుంటాయి.

చలపతికి తన విద్యాభ్యాసమూ గుర్తుకొచ్చింది ఒక్కసారిగా! 1959లో ఎస్.ఎస్.ఎల్.సి. పాసయినాడతడు. అప్పుడంతా తెలుగు మీడియమే. ఇంగ్లీషు మీడియమ్ అనేది ఒకటి వుంటుందనీ, భవిష్యత్తులో రాబోతుందని కూడా ఊహించటానికి వీల్లేని కాలం అది. ఎక్కడో పెద్ద పెద్ద పట్టణాల్లో, నగరాల్లో, సంపన్నుల పిల్లలు చదువుకొనే కొద్ది పాటి స్కూళ్లలో మాత్రమే ఇంగ్లీషు మీడియం వుండేది. అతడు చదివిన అనంతపురం పట్టణంలో, హైస్కూల్ స్థాయి వరకూ, ఒక్క ఇంగ్లీషు మీడియం స్కూల్‌కూడా వుండేది కాదు– స్కూల్ ఫైనల్ పాస్ కాగానే అతడు "పి.యు.సి"లో చేరినాడు. పి.యు.సి. నుండీ ఉన్నతవిద్య అంతాకూడా ఇంగ్లీషు మీడియమే. కాలేజీలో అడుగుపెట్టగానే తల తిరిగింది అతడికి. లెక్చరర్లు చెప్పేది ఒక్కముక్క కూడా అర్థమయ్యేది కాదు. కొన్ని కొన్ని ప్రశ్నలకు గుడ్డిగా కంఠస్థం కొట్టి కొట్టీ, అలసి పోయినాడతడు. సహజమైన తెలివితేటలూ, గ్రహణశక్తీ నాశనమై పోయినాయి. అతడు చదివిన కాలేజీలో, పి.యు.సి లోని 7 గ్రూపులలో, మొత్తం 560 మంది విద్యార్థులుండేవారు. అందరూ హైస్కూల్ స్థాయి వరకూ తెలుగు మీడియంలో చదువుకున్న వాళ్లే! ఇంగ్లీషు మీడియం దెబ్బకు, ఆ సంవత్సరం 560 మంది విద్యార్థులలో 8 శాతం మంది మాత్రమే పాసయినారు. చలపతి కూడా భయంకరంగా ఫెయిలయి నాడు. కేవలం ఇంగ్లీషు మీడియం వల్లనే చాలామంది విద్యార్థులు పైచదువులు చదవలేక, ఇంటిదారి పట్టినారు. ఇదంతా గుర్తుకొచ్చి నిట్టూర్చినాడు చలపతి.

అదే పరిస్థితి, పరాయి భాషా మాధ్యమ పరిస్థితి, మళ్లీ ఇప్పుడు విలయ తాండవం చేస్తున్నందుకు తీవ్రమైన వేదన కలిగింది అతడికి. గుడ్డిగా నేర్చుకున్న ఇంగ్లీషూ రాక, సహజమైన మాతృభాషకూ దూరమై, ఈ తరం ఏం నేర్చుకుంటుంది? ఏ సామాజికతను అనుభవిస్తుంది? కుటుంబ సంబంధ వాచికాలూ తెలియక, సంఖ్యా వాచికలూ తెలియక, ఇప్పటి పిల్లల తరం ఏ సంబంధాలలో జీవిస్తుంది? ఏదో ఒక అశాంతి లాంటిది అనుభవించింది అతడి మనసు.

కూతురింట్లో నాలుగు రోజులుండి, తమ వూరికి తిరిగి వచ్చిం తర్వాత కూడా, మనవరాలి ప్రశ్నే అతనికి పదేపదే ఎదురౌతోంది. తెలుగు మాతృభాషగల ఇంట్లో పుట్టి, తెలుగు కుటుంబాల మధ్య జీవిస్తూకూడా, పది రూపాయలంటే ఎంత అని మనవరాలు అడుగు తున్నదంటే, భాషకు ఎంత ద్రోహం జరిగి పోతున్నదో గుర్తుకొచ్చి, వేదనామయమైన ఆలోచనల సుడిగుండంలో మునిగిపోయినాడు చలపతి. ఈ ద్రోహానికి బాధ్యులెవరు? ఈ ద్రోహం మరింత భయంకరంగా పరిణమిస్తే భవిష్యత్తు ఎలా మారుతుంది?

ఆరోజు సాయంత్రం మామూలుగా కలిసే మిత్రుల మధ్య, తన మనవరాలు అడిగిన ప్రశ్న గురించి ప్రస్తావిస్తే, ఆ మిత్రులేమీ స్పందించ లేదు. సరిగదా, సహజమే అన్నట్టుగా వుండిపోవడం మరీ విచిత్ర మనిపించింది చలపతికి! "మీ మనవరాలే కాదు నాయనా! అందరిళ్ల లోని పిల్లలూ ఇప్పుడింతే" అన్నారు. నర్సరీ నుండి ఇంగ్లీషు మీడియంలో చదివేందుకు పిల్లల్ని వేసినాక, ఆ తల్లిదండ్రులు కోరుకున్నదీ ఇదేగదా అన్నారు. తెలుగుభాష మా పిల్లలకు రాదు అని చెప్పుకోవటమే ఘనతగా భావించే తల్లిదండ్రులున్నప్పుడు ఇది సహజమే గదా అన్నారు. ఒక మిత్రుడైతే "అయ్యా చలపతీ! బాగా ప్రాచుర్యంలో వున్న ఒక జోక్ నీకు చెబుతాను. విను! ఒక ఇంట్లో ఫోన్ రింగయిందట! పదేళ్లమ్మాయి ఫోనెత్తి "హలో" అన్నదట. ఆవలి వైపు నుండీ, "ఇంట్లో నాన్న వున్నాడేమమ్మా" అని అడిగినాడట. అప్పుడా అమ్మాయి, దగ్గరే కూచున్న తన తండ్రితో "డాడీ! మనింట్లో నాన్న ఎవరైనా వున్నారా? ఫోన్లో అడుగుతున్నారు" అందట! ఇదీ సంగతి. విషయం ఎంతవరకూ వచ్చిందో చూడు. అందువల్ల నువ్వేమీ దిగులు పడవద్దు. పరిణామాలను పసిగడితే చాలు" అని ఓదార్చినాడు.

మరో నాలుగు రోజుల తర్వాత, మరో నలుగురితో మాట్లాడిం తర్వాత, అతడు తెలుసుకున్న సత్యం ఏమిటంటే, "టెన్ రుపీస్" అన్నదే సహజమైనదనీ, పది రూపాయలన్నది కృతకమైనదనీ! అంతేకాదు తను అనుభవిస్తున్న వేదనను ఎవడూ పట్టించుకోలేదనీ, ఎవరూ అనుభవించ లేదని కూడా అతనికి అర్థమై నిర్లిప్తుడైపోయినాడు.

ఆ రోజు సాయంత్రం ఇంటికి చేరుకొనేసరికి పనిమనిషి అతని కోసమే కాచుకొని వుంది. పనిమనిషి వయసు చిన్న వయసే! 30 ఏళ్లుంటాయి. పదిళ్లలో పాచిపనులు చేస్తూ వుంటుంది. తమ ఇంట్లో నాలుగేళ్లుగా పనిచేస్తూ వుంది. ఆమెకు పదేళ్ల కూతురూ, ఎనిమిదేళ్ల కొడుకూ. ఆమె పేరు లక్ష్మమ్మ. ఆమె భర్త కూడా కూలీనాలీ చేస్తూ అంతో యింతో సంపాదిస్తుంటాడు.

"ఐదువేలు కావలయ్యా జీతంలో నెలకింత అని యిరగేసు కోండయ్యా" అందామె. "ఏమవసరమొచ్చింది" అని చలపతి అడిగితే, స్కూల్లో పిల్లల ఫీజుల కోసమయ్యా అందామె. పిల్లలిద్దరూ ప్రైవేటు ఇంగ్లీషు మీడియం స్కూల్లో చదువుతున్నారు. కూతురుకు 15 వేలూ, కొడుక్కు 10 వేలూ ఫీజు. రెండు విడతలుగా కట్టల్ల. కూతురు నాలుగో తరగతి. కొడుకు రెండో తరగతీ చదువుతున్నారు.

"అంతంత ఫీజులు కట్టి ప్రైవేటు స్కూల్లో ఎందుకు చదివిస్తున్నా వమ్మా! గవర్నమెంట్ స్కూల్లో చదివించగూడదా" అన్నాడు. "ఏమో నయ్యా! మా సందులో అందరూ పిల్లల్ని ప్రైవేట్ స్కూల్లోనే వేసినారయ్యా, ప్రైవేట్ స్కూల్లో ఇంగ్లీషు బాగా వస్తుందటయ్యా. ఇంగ్లీషు రాకపోతే రేపు ఎవరికీ ఉద్యోగాలు రావంటగదయ్యా, గవర్నమెంట్ స్కూల్లో చదువు సరిగ్గా చెప్పరంటయ్యా" అని వివరణ యిచ్చింది ఆమె.

విషాదమైన నవ్వు చలపతి పెదవుల మీద వెలిసింది. భాష వ్యాపారమైన తర్వాత జరుగుతున్న అనర్థమిది అని అతడికి తెలియంది కాదు. కార్పొరేట్ విద్యాసంస్థలు, ఇంగ్లీషు భాషపట్ల ప్రజల్లో వ్యామోహం పెంచి పెంచి, కూలీనాలీ చేసుకొనే అమాయకులైన పేద ప్రజలను కూడా, పిండి పిండి దోచుకుంటున్న వైనం కళ్లకు ప్రత్యక్షంగా కనిపించిం దతనికి! ఈ భాషా వ్యాపారానికి మొదట బలి అయ్యేది పేద ప్రజలే!

పేదలు ఎంతకాలం డబ్బులు కట్టి పిల్లల్ని చదివించగలరు? నాలుగైదేళ్ల తర్వాత పెరుగుతున్న ఫీజుల్ని కట్టలేని స్థితికి వాళ్లు చేరుకుంటారు. మధ్యంతరంగా వాళ్ల చదువులు ఆగిపోతాయి. అటు ఇంగ్లీషూ రాక, ఇటు తెలుగు స్కూళ్లకూ పనికిరాక, రెండిటికీ చెడ్డ రేవడై పోతారు పేదల పిల్లలంతా! ప్రజల మేలు పట్టించుకోని దుర్మార్గమైన ప్రభుత్వ భాషా విధానం ఇందుకు కారణం గదా! తాను నచ్చచెప్పి, లక్ష్మమ్మ పిల్లల చదువు మాన్పించి, గవర్నమెంట్ స్కూల్‌లో చేర్పించవచ్చుననుకో! లక్షలాదిమంది పేదపిల్లల మాటేమిటి?

"ఇప్పటికైనా మించి పోయింది లేదమ్మా! మీ యింటి దగ్గర్లో వుండే గవర్నమెంట్ స్కూల్లో చేర్పించు! బాగుపడతారు" అని నచ్చచెప్ప పోయినాడు చలపతి.

"మర్యాదుండదయ్యా మాకింక! అందరిలో శానా అలుసై పోతా మయ్యా" అని తన వాస్తవికమైన గోడును వెళ్లబోసుకుందామె.

"సరే నీ యిష్టం. రేపు ప్రొద్దున రామ్మా డబ్బు ఇస్తానని" చెప్పి పంపించాడు చలపతి.

పిల్లలను వారి మాతృభాష నుండీ దూరం చెయ్యటం సాంస్కృతికద్రోహం అయితే, పేదల రక్తమాంసాలను భాష పేరుతో దోచుకోవటం ఆర్థికద్రోహం అనిపించింది చలపతికి! అ

ఆంగ్ల మాధ్యమంతో విద్యాబోధన–
అక్షరాస్యతకు అడ్డుగోడ

చంద్రశేఖరరావుగారికి ఎందుకు జేజేలు?


తెలంగాణా ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుగారికి అమ్మనుడి సంపాదకులు జేజేలు పలకటం ఆశ్చర్యం కలిగించింది. అదే సమయంలో బాధగాను అనిపించింది. గతం సంగతి ఏవిధంగా ఉన్నా, దాదాపు నాలుగు సంవత్సరాలుగా తెలంగాణా ముఖ్యమంత్రిగా తెలుగు భాషకు చంద్రశేఖరరావుగారు చేసింది ఏమిటి? ప్రభుత్వ కార్యాలయాలలో ఎక్కడైనా తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయా. ఆ దిశగా చంద్రశేఖరరావుగారు చేసింది ఏమైనా ఉన్నదా? న్యాయస్థానాలలో తెలుగు ఎక్కడైనా వాడుకలో ఉన్నదా. సాక్షులు తెలుగులో చెప్పిన విషయాలను ఆంగ్లంలో రికార్డుచేసే దౌర్భాగ్య సంప్రదాయాన్ని అయినా ఆయన నిలువరించగలిగారా? ఏ ఒక్క చట్టాన్ని అయినా తెలుగులో తీసుకురాగలిగారా? కనీసం సభాపతిచేత 'ది హౌస్ ఈజ్ అడ్‌జోర్న్డ్' బదులుగా 'సభ వాయిదా పడింది' అని అచ్చ తెలుగులో చెప్పించగలిగారా? తెలంగాణా గెజిట్ ఇంకా ఎందుకు ఆంగ్లంలోనే ఉంటున్నది? తెలంగాణా ప్రభుత్వ నోటిఫికేషన్లు (జీవోలు) ఇంకా ఆంగ్లంలోనే ఉంటున్నాయికదా. ఇలా ఎన్ని ఉదాహరణలైనా ఇచ్చుకోవచ్చు. మరి తెలుగు భాషాభివృద్ధికి ఏమీ చెయ్యని చంద్రశేఖరరావుగారికి జేజేలు ఎందుకు?

కేవలం డిసెంబరు నెలలో ప్రపంచ తెలుగు మహాసభలు హైదరాబాద్‌లో జరపాలని చంద్రశేఖరరావుగారు నిర్ణయం తీసుకున్నందుకే ఆయనకు జేజేలు పలికితే మాత్రం నిజంగా విచారకరమే. ఎందుకంటే ఇప్పటికి చాలాసార్లు ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. ఆ సభల వలన వచ్చిన లాభం ఏమీ లేదనేది అమ్మనుడి సంపాదకులకు తెలియని విషయమేమీ కాదు. ఆ సభలన్నీ ప్రచార ఆర్భాటంతో, రాజకీయ ప్రేరణతో జరిగినవేనన్నది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. ప్రవాసాంధ్రుల నుండి పెట్టుబడులనో, మరేదో లాభం ఆశించి నిర్వహించబడేవే ప్రపంచ తెలుగు మహాసభలని గతం నేర్పిన గుణపాఠం. చంద్రశేఖరరావుగారు తలపెట్టిన ప్రపంచ తెలుగు మహాసభలు అందుకు భిన్నంగా ఉంటాయని ఆశించగలమా, ఊహించగలమా? ఊహిస్తే అత్యాసే అవుతుంది.

అసలు ప్రపంచ తెలుగు మహాసభలు అన్న ఆలోచనే సరైనది కాదన్నది నా వ్యక్తిగత అభిప్రాయం. ఏనాడో తెలుగునేలను విడిచిపెట్టి, ప్రపంచంలో ఎక్కడెక్కడో స్థిరపడిపోయి, ఆయాదేశాల భాష, సంస్కృతి, సాంప్రదాయాలతో మమేకమైపోయి, తెలుగు వ్రాయటం కాదుకదా, కనీసం మాట్లాడటం కూడా మర్చిపోయిన ప్రవాసాంధ్రులతో కలసి మొక్కుబడిగా ప్రపంచ తెలుగు మహాసభలు జరిపితే ఒరిగేది ఏమిటి? అందుకే ఇప్పటిదాకా జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు సాధించింది శూన్యం. డిసెంబరులో జరగబోయే ప్రపంచ తెలుగు మహాసభలు సాధించేది కూడా శూన్యమే. మరి చంద్రశేఖరరావుగారికి జేజేలు ఎందుకు?

పెండ్యాల సత్యనారాయణ, అడ్వొకేట్, గుంటూరు, 9866442034.





–కోడం పవన్‌కుమార్
9848992825

కదులుతున్న జానపద విజ్ఞానం

నాలుగు దశాబ్దాలపాటు జనం గుండెల్లోంచి ఏరుకున్న దగాపడ్డ జన సంస్కృతిని ఒడిసిపట్టాడు. జానపద కళల పరిశోధకుడిగా, అధ్యాపకుడిగా, ప్రొఫెసర్‌గా జయధీర్ తిరుమలరావు తెలుగు సాహిత్యానికి అపార సంపదను అందించాడు. ఆసియా ఖండంలోని తొలి జానపద పరిశోధన చేసిన ఆచార్య బిరుదరాజు రామరాజుకు కొనసాగింపుగా గిరిజన సంప్రదాయ పరిశోధనా వారసత్వాన్ని అందిపుచ్చుకున్నాడు. ఆయనొక కదులుతున్న జానపద విజ్ఞానం.

'అరణ్యనేత్రం' తెరిచింది మొదలు... అడవి బిడ్డల సంస్కృతి, సంప్రదాయాలు, కళలపై చూపు నిలిపాడు. 'ఆర్ట్ లవర్స్'తో సాహిత్యంపై ఇష్టం పెంచుకుని, ప్రజాకళలతో జీవనం సాగించడం మొదలుపెట్టాడు. ఆదిలాబాద్ అడవులు మోసుకొచ్చిన ఇంద్రవెల్లి పోరాటం, శ్రీకాకుళ వనాల మీంచి వీచిన గిరిజనోద్యమం, నల్లమల దండకారణ్యం మోసుకొచ్చిన నక్సల్బరీ పోరాటం, సిరిసిల్లా – జగిత్యాల కల్లోలిత ప్రాంతాలలో కదిలిన పల్లెల స్ఫూర్తి. ..ఆయనను కవిగా, పరిశోధకుడిగా, కాలమిస్టుగా, మౌఖిక సాహిత్య కళారూపాల అధ్యయనకర్తగా మలిచింది. సాంఘిక, రాజకీయ, ఆర్థిక, చారిత్రక, మానవ పరిణామాది సామాజిక శాస్త్రాల వివేచనని సమన్వయపరుస్తూ సాహిత్య కళామర్మాలను ఈ ప్రక్రియలన్నింటిలో విప్పి చెప్పే ప్రయత్నం చేశాడు. ప్రజా ఉద్యమాలతో పెనవేసుకున్న జీవన నేపథ్యం నుంచీ, జానపద సాహిత్య కళారూపాల అన్వేషణలో మారుమూల పల్లె ప్రజలతో మమేకమైన అనుభవాల నుంచీ, సమాంతర సాహిత్య చరిత్ర పరిశోధనపై చేసిన లోతైన అధ్యయనం నుంచీ జానపద కళాశక్తిగా మారాడు. తోలుబొమ్మల నుంచి సమాంతర సినిమా వరకూ మంచి చెడులను విశ్లేషించాడు. గ్రంథాలయాలు, ప్రాచ్య లిఖిత గ్రంథాలయాల్లో చారిత్రక పత్రాల దుమ్ము దులిపి బయటి ప్రపంచానికి పరిచయం చేశాడు. అరుదైన తాళపత్ర గ్రంథాలు, కనుమరుగైన సాహిత్య కళారూపాల చరిత్రతో ప్రదర్శన జరిపి విలువైన సంపదను ప్రజల ముందు ఉంచాడు. అట్టడుగు జనం గుండెల్లో నిక్షిప్తమైన పదాల ఆనవాళ్ళ కోసం శోధన చేస్తూనే ఉన్నాడు. అతడే జయధీర్ తిరుమలరావు. సమాజాన్ని భిన్న కోణాల్లో విశ్లేషిస్తూ మోదుగుపూల వనాల మీంచి మోసుకొచ్చే ఇప్పపూల పరిమళపు గాలిలో జానపద సాహిత్యానికి ఉన్న విశిష్టతను గుర్తించాడు. గురి చూసి వదిలే గిరిజనుడి బాణానికున్న చూపుతో జానపద సాహిత్యపు ఆనవాళ్లు వెదికాడు. వెదురు వనంలో వినిపించే సంగీతానికి తోడైన గిరిజన గుస్సాడి నృత్యంలో ఆర్తిని వెతికి పట్టుకున్నాడు.

వరంగల్ జిల్లా హన్మకొండలో 1950లో జన్మించిన తిరుమలరావు, రాజరాజ నరేంద్ర గ్రంథాలయం ద్వారా పుస్తకాలు చదివే అభిరుచి పెంచుకున్నాడు. శరత్ నవలలు చదివి సాహిత్యంపై అనుబంధాన్ని ఏర్పరచుకున్నాడు. చంద్రజోషి నవల 'ప్రేతము–ఛాయ'తో ప్రభావితమై మనుషుల అంతరంగాల మర్మాన్ని తెలుసుకోగలిగాడు. జాతర్లలో తిరగడం, ఆలయాలను సందర్శించి నిర్మాణాలను పరిశీలించడం, శాసనాలను సేకరించడం చిన్ననాటి నుంచే అభిరుచిగా మలుచు కున్నాడు. ఈ క్రమంలో కవిత్వం ప్రేమగా మారడం, పరిశోధన తప్పనిసరి అవడం, సాహిత్య కళారంగాలకు చెందిన మౌఖిక అంశాలను సేకరించడం, భద్రపరచడం, విశ్లేషించడం అనివార్యమైన అంశాలుగా ఎంచుకున్నాడు. తన నలభైఏళ్ల సాహిత్యయాత్రలో అరణ్య నేత్రం, ప్రతిధ్వనులు పేరిట కవితాసంపుటాలు, 'తెలంగాణ రైతాంగ పోరాటం –ప్రజాసాహిత్యం'పై పరిశోధనా గ్రంథం, డాక్యుమెంటరీ ఫిలిం, జాంబపురాణం, పొది, తొవ్వముచ్చట్లు తదితర పుస్తకాలను వెలువరించాడు. ప్రజా కళారూపాలు, సుద్దాల హనుమంతు పాటలు, తెలంగాణ పోరాట పాటలు, రౌండ్ టేబుల్ రాయబారం, జమీన్‌రైతు నాటకం, దళితగీతాలు తదితరమైన పుస్తకాలు తన సంపాదకత్వంలో వెలువడ్డాయి. కె.శ్రీనివాస్, యాకుబ్, లక్ష్మి తదితర ప్రముఖుల పరిశోధనలకు గైడ్‌గా ఉన్నాడు. జాతీయ, అంతర్జాతీయ సెమినార్లు, వర్క్‌షాప్‌లలో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించాడు. జానపద గేయాలు, కరపత్రాలు మొదలైన అంశాలతో ప్రాజెక్టులు చేపట్టాడు. కథ, కవిత్వం, వ్యాసం, పాటలు తదితరమైన వందలాది పుస్తకాలకు ముందుమాటలు రాశాడు. ఆదివాసీ లిపి, సంస్కృతి, రూపాల ప్రదర్శన, జ్ఞాపకాల సేకరణ తనకిష్టమైన పనిగా ఎంచుకుని ముందుకు సాగుతున్నాడు.

'అరణ్యవృక్షం నీడన / అలనాటి సిద్ధార్థుని జ్ఞానోదయం
జీవితాల్లో జీవించిన / నేటి అర్థుడికి అరణ్యజ్ఞానోదయం
నేను సిద్ధార్థుణ్ణి కాను – అర్థుణ్ణీకాను
నేను చార్వాకుణ్ణి కాను – *గాంధీనీకాను*
నేను మార్క్సునీకాను – మావోనీకాను
నేను – *అందరినీ జీర్ణం చేసుకుని కొత్త పిడికిలి బిగిస్తున్నవాణ్ణి!'*

అని రెప్పలు విప్పుకున్న 'అరణ్య నేత్రం' నుంచి ప్రకటించాడు.

1970 తర్వాత తెలుగు కవిత్వానికి విప్లవపదం ప్రాణం పోసింది. నక్సల్బరీ, శ్రీకాకుళం, సిరిసిల్ల, జగిత్యాల, గోదావరిలోయలో ఎక్కడబడితే అక్కడ అన్నార్తులు, అశాంతులు, అసంతృప్తి సాయుధ పోరాటం వైపు మళ్ళింది. ఆ సమయంలోనే కవులు, కళాకారులు, రచయితలు, గాయకులు తమ సాంస్కృతిక వ్యాసంగాన్ని విప్లవ పోరాటాల ఉపరితల కార్యక్రమంగా ఎంచుకుని ప్రస్థానం సాగించారు. అప్పుడే జయధీర్ తిరుమలరావు 'ఆర్యణనేత్రం' రెప్పలు విప్పుకుంది. కొత్త పిడికిలి బిగించి ముందుకు సాగాడు. సామాజిక ప్రయోజనం

గల కవిత్వమే శాశ్వతంగా నిలువగలదన్న ధీమాతో ఈ కవితా సంపుటిని వెలువరించాడు. చైతన్యానికి, పోరాటానికి సంకేతంగా ఉన్న అరణ్యం, తన నేత్రాన్ని విప్పినప్పుడే కాలంమీద, జాతిమీద విశ్వాసం కలిగి 'సామాజిక ప్రగతివాది'గా అక్షరరూపంలో సాక్షాత్కరించాడు. కాలుతున్న కళ్లు, కాలడం ఆగిన కడుపులు, దారాల నరాల్లో దావాలనంతో ఆకలి అన్వేషణ, తుపాకి బాయినెట్ల మడతల పోట్లకు చితికిన గర్భాలు, దోచుకొని విసిరివేయబడ్డ ఎదలు, ఒక్కో చెమట చుక్క ఒక్కో ఉక్కు ముక్కగా మారుస్తూ పస్తులుంటున్నవాళ్ళు... అసమస్థితిని తొలగించడానికి, అన్యాయాలను అరికట్టడానికి, అక్రమాలను నిలువరించడానికి ఒక్కొక్కరూ అగ్నిశిఖగా జ్వలించాలని కవిత్వమై సుతిమెత్తగా హెచ్చరించాడు. ఇందులోని కవిత లన్నీ కూడా అసమ వ్యవస్థను తొలగించి, మహోన్నత మానవతా వ్యవస్థను నిర్మించాలని కోరుకుంటాయి. ఇదేతరహాలో తన రెండవ కవితా సంపుటి 'ప్రతిధ్వనులు' వెలువడింది. ఆతర్వాత 'ఆగ్రహ గీతాలు' రాసినా, 2011లో వచ్చిన 'ఉరితాడులోంచి మరాండి' దీర్ఘకవితలో ఉరితాడును పాట ప్రశ్నిస్తున్న తీరు కనిపిస్తుంది.

ఉరితీస్తారని కాదు / ఇక ఉద్యమ గీతం పాడలేనని బాధ
ఉరితీయబడే వాళ్ళపై సానుభూతి వద్దు
ఉరికంబాలను ఉరి తీయాలని కోపపడు
ఉరిశిక్షల యంత్రాంగాన్ని నిషేధించాలని కోరు

ఉత్తర తెలంగాణ ఉద్యమ ప్రభావం నుంచి విస్తరించిన పాట జార్ఖండ్‌లో జీతన్ మరాండి జీవిక పాటగా మారింది. అటవీ ప్రాంతంలో వారి భాషలోకి పోరాట పాటలను అనువదించి పాడారు. జార్ఖండ్ ఆది వాసీల బతుకు చిత్రాన్ని మరాండి తన పాటల్లో చిత్రించి, ఆ పాటల ద్వారా వారిలో చైతన్యం కలిగించాడు. అలాంటి మరాండిని తప్పుడు కేసులో ఇరికించి, మరణ శిక్ష విధించారు. మరాండిపై తిరుమలరావు ఉద్వేగపూరితమైన కవిత్వాన్ని అందించాడు. ఆ శక్తి జీవనిర్మాణమని, ఆ శక్తి ఆదివాసీ స్వేచ్ఛాగీతమని చెబుతూ వీటికి మరణం లేదంటాడు. ప్రాకృతిక పురాపోరాటం పునాదిపై నిర్మాణమైన ప్రజా పోరాటంగా చాటాడు.

సాహిత్యం నుంచి ప్రజా సాహిత్యానికి దారి వేసుకుంటున్న క్రమంలో తిరుమలరావుకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'తెలంగాణ రైతాంగ పోరాటం – ప్రజా సాహిత్యం'పై పరిశోధనకు అవకాశం కలిగింది. పరిశోధనలో భాగంగా పాటలతో పాటు సాహిత్య చరిత్ర పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, ప్రజా సాహిత్యానికి చారిత్రక జీవిత దృక్పథానికి నిర్దిష్టంగా అర్థ వివరణ ఇచ్చాడు. దీని వెనుక క్షేత్ర పర్యటన చేసి సేకరించిన పాటలున్నాయి. సుమారు మూడు వందలకుపైగా గ్రామాలు తిరిగి పాటలు, కళారూపాలను సేకరించాడు. తెలంగాణ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి శ్రమజీవులైన పోరాట వీరులను, కవులను కలుసుకున్నాడు. పాటల చరిత్రకన్నా పోరాట పాటల్లో ప్రజల చరిత్ర ఉన్నట్లు గుర్తించాడు. అందుకే ఈ సిద్ధాంత గ్రంథంలో శ్రమజీవుల పాటలనుంచి చరిత్రను తవ్వితీశాడు. పని పాటలు – శ్రమ సంబంధం, జమీ–ఫాసిస్టు వ్యతిరేకోద్యమ సాహిత్యం, ఉద్యమ సాహిత్యం, పోరాట సాహిత్యం, నైజాం భూస్వామ్య వ్యతిరేక పోరాట సాహిత్యం, సాయుధ పోరాట సాహిత్యం, సాహిత్య ప్రక్రియలు–పాట.. ఏడు అధ్యాయాలుగా విభజించి వస్తువుకు రూపానికి ఉండే అవినాభావ సంబంధం యొక్క భౌతిక పునాదిపై దృష్టిని కేంద్రీకరించాడు. ప్రజా సాహిత్య అధ్యయన విధానానికి ఓ మార్గాన్ని చూపించాడు. తెలంగాణ పోరాట సాహిత్యం తెలుగు సాహిత్యాన్ని ఏమేరకు ప్రభావం చేసిందీ, ఏ విధంగా మార్చిందీ, ఏ రకంగా రూపొందిందన్న విషయాలను ఈ పరిశోధన గ్రంథంలో స్పష్టం చేశాడు.

కవిత్వం, పరిశోధనే కాదు, సమాంతర సినిమా రంగంలో కూడా జయధీర్ తిరుమలరావు తన అనుభవాన్ని పండించుకున్నాడు. ఫిలిం సొసైటీల ద్వారా జాతీయ, అంతర్జాతీయ సినిమాల తీరుతెన్నులను నిశితంగా గ్రహిస్తూ అనేకానేక వ్యాసాలు రాశాడు. ప్రపంచవ్యాప్త ప్రజా పోరాటాల్లో డాక్యుమెంటరీ సినిమా పోషించిన పాత్ర గుర్తించి తెలుగులో పూర్తి స్థాయి పరిశోధనా గ్రంధాన్ని అందించిన ఘనత ఆయనది. ప్రపంచ వ్యాప్త ప్రజా పోరాటాల్లో డాక్యుమెంటరీ సినిమా పేరుతో అందించిన పుస్తకంలో ప్రజా పోరాట సినిమా, ప్రపంచ యుద్ధంలో డాక్యుమెంటరీ సినిమా పాత్ర, లాటిన్ అమెరికాలో సినిమా ఓ ఆయుధంగా ఉపయోగించిన తీరు, మన దేశంలో డాక్యుమెంటరీ సినిమా పరిస్థితులు, సాంస్కృతిక సమర రంగంలో రాజకీయ పాఠంగా ప్రజా సినిమా వంటి ఎన్నో విషయాలను ఈ పుస్తకంలో వ్యాసాలుగా ప్రచురించాడు. ఆర్థిక రాజకీయ సామాజిక మానవ సంబంధాలకు సంబంధించిన సమస్యలను నిజాయితీతో చిత్రించి, ఆ సమస్యలకు జవాబు ఇవ్వడానికి డాక్యుమెంటరీ సినిమా దోహదపడాలని అభిప్రాయ పడ్డాడు. బూర్జువా కళ్లలో కొత్తదనం లోపించిన ప్రతిసారి ప్రజా జీవితాలలోనికి, ప్రజా కళా రూపాలలోకి దృష్టి సారించినట్లే కథా చిత్రాల భావవ్యక్తీకరణరీతి పాతపడ్డప్పుడల్లా డాక్యుమెంటరీ చిత్రీకరణ విధానాన్ని ఆశ్రయించవచ్చనది ఆయన ప్రగాఢ విశ్వాసం. ఎన్ని సమస్యలపైన ఎటువంటి కథాచిత్రాలు వచ్చినా, డాక్యుమెంటరీ చిత్రాలు వాస్తవికతను కళ్ళకు కట్టినట్లు ప్రతిబింబిస్తాయనేది ఈ వ్యాసాలు స్పష్టం చేస్తాయి.

తెలంగాణ చరిత్రకు పునాదిగా నిలిచిన జానపద సాహిత్య శోధనను 21వ శతాబ్దం మొదలులో మరింత విస్తృతం చేశాడు జయధీర్ తిరుమలరావు. తన చూపు, శ్వాస, ఆలోచన, నడకను పూర్తిగా జానపద సాంస్కృతిక మూలాలను వెతికి తీయడమే పనిగా పెట్టు కున్నాడు. అప్పుడే ప్రారంభమైన తెలంగాణ మలి ఉద్యమానికి ఈ శోధన మరింత ఆలంబనగా నిలిచింది. 2003లో వచ్చిన 'పొది' వ్యాస సంకలనంలో జయధీర్ తిరుమలరావుకు చెందిన సంభాషణలు, అక్షరచిత్రాలు ఆయన శోధనకు సంబంధించిన వివరాలను స్పష్టం చేస్తాయి. ఆయన అంతరంగాన్ని ఆవిష్కరిస్తుంది. వివిధ పత్రికలలో నామాడి శ్రీధర్, ఒమ్మి రమేష్, అఫ్సర్, శ్రీధర్‌రావు దేశ్ పాండే, కల్లూరి భాస్కరం, కాసుల ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ ఎ.కె.ప్రభాకర్ తదితరులు చేసిన ఇంటర్వ్యూలతో వచ్చిన 'పొది' తిరుమలరావు యొక్క సుదీర్ఘ ఆలోచనను పాఠకుల ముందు ఉంచింది. సంఘర్షణతో కూడిన జీవితాన్ని ఆవిష్కరించింది. చరిత్రను మళ్ళీ సవరించాలంటూ, అట్టడుగు బతుకుల ఆత్మకథే చరిత్రగా పేర్కొన్నాడు. సామ్రాజ్యవాద సంస్కృతితో పోరాడ గలిగేవి ప్రజాకళలేనని చెబుతూ ఈ కళలు అట్టడుగు వర్గాల ప్రజలు సృష్టించినవేనని చెబుతాడు. సమాంతర సాంస్కృతిక వాహికలే ఉపకులాలని స్పష్టం చేస్తాడు. క్రాంతదర్శి కావలసిన కవి యాంత్రికంగా మారిపోతున్న ఈరోజుల్లో సాహిత్య సాంస్కృతిక రంగాల్లో చాలా కాలంగా ఉండిపోయిన ఖాళీలను పూరించడానికే తన శోధనగా వివరించాడు.

జన చరిత్రను చాటిచెప్పే చారిత్రక ఆధారాలను తన అన్వేషణలో వెతికి తీశాడు తిరుమలరావు. రాగి రేకులు, తాళపత్ర గ్రంధాలు, కాగితపు చుట్టల్లో దాగిన చరిత్ర, నేత పటాల్లో చిత్రించిన కుల పురాణాలు, ఉపకులాల చరిత్రను విప్పి చెప్పే ఇత్తడి పలకలపైని

రాత ప్రతులు, నకాశీ చిత్రకారుల కళాకృతులు, గుజిలీ ప్రతులు, నిషిద్ధ సాహిత్యం, గోండులిపిప్రతులు, మందహెచ్చుల బొమ్మలు, కోయ ఆదివాసీల ఎడిగెలు తదితరమైనవాటిని వెలికితీసి వాటికి తిరిగి జీవం పోశాడు. ప్రదర్శనలు పెట్టి తెలంగాణ సమాజానికి ఎరుక చేశాడు. చరిత్రలో నమోదు కాకుండా సంచార జాతులుగా ఉన్న వేలాది సమూహాలు, కులాలు, తెగలను బయటికి తీసుకువచ్చాడు. చిత్ర రూపంలో ఉన్న 300 ఏళ్ల నాటి కోయల పడిగెలను వెలికితీశాడు. ఈ పటంలో సమ్మక్క సారక్కలతో పాటు చెక్కుచెడాలమ్మ గుజ్జుటి ముసలమ్మ, బాపనమ్మ వంటి మహిళల పోరాట చరిత్ర ఉండటం విశేషం. దీన్ని ఈతరం ముందు ఆవిష్కరించాడు.

గోండు భాషపై విస్తృత పరిశోధనలు జరిపి వాటికి ప్రాచుర్యతను కల్పించే నిమిత్తం 'గుంజాల గోండీ లిపి' అధ్యయన వేదికను ఏర్పాటు చేయడంలో తిరుమలరావు పాత్ర కీలకమైనది. గోండి భాషపై ఒకప్పుడు ప్రాకృతం, తర్వాత సంస్కృతం,అరబ్బీ,పారసీ, ఉర్దూ, హిందీ, మరాఠీ, తెలుగు భాషలు పెత్తనం చేశాయి. యాభై ఏళ్లుగా ఇంగ్లీష్ స్వారీ చేస్తోంది. వీటన్నింటిని తట్టుకుని నిలిచింది. తిరుమలరావు అన్వేషణలో గుంజాలలో పది రాత ప్రతులు లభించాయి. గోండిలిపిలో చేతితో రాసిన ప్రతులు లభ్యం కావడంతో దీనికి 'గుంజాల గోండీ లిపి' అని పేరు పెట్టాడు. ఇక్కడితో ఆగిపోకుండా, ఈ లిపిని గోండు పిల్లలకు నేర్పించాలని పట్టుదలతో ముందుకు సాగుతున్నాడు. ఈమేరకు హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని 'సెంటర్ ఫర్ దళిత్, ఆదివాసీ స్టడీస్ అండ్ ట్రాన్స్‌లేషన్ (సిడాస్ట్), ఉట్నూరు ఐటిడిఏ సహకారంతో మొదటి తెలుగు వాచకంను అచ్చువేశారు. అంతేకాకుండా, గోండీ లిపిలోని రాత ప్రతులను హిందీ, తెలుగు భాషలలోకి అనువాదం చేసే గురుతరమైన బాధ్యతను కూడా ఆయన తీసుకున్నాడు.

కోయ జాతి చరిత్రను అంతర్జాతీయ స్థాయికి తీసుకుపోవాలన్నది జయధీర్ తపన. ఈమేరకు కోయ జాతి వీరగాధల డాక్యుమెంటేషన్ ప్రక్రియను ప్రారంభించాడు. సమ్మక్క వీరగాధపై కోయపురాణం వీడియో చిత్రీకరణ చేశాడు. తెలుగుకు ఉపభాషగా ఉన్న కోయభాషను కూడా ద్రవిడ భాషగా భావించి, లిపిని కనుగొనే దిశలో పరిశోధనలను ప్రోత్సహిస్తున్నాడు. కోయ పురాణాలను ఆ భాషలోనే గ్రంథస్థం చేయాలన్నది ఆయన తాపత్రయం.

అంతరించిపోతున్న కళలు, నిరాదరణకు గురవుతున్న దేశీయ సంస్కృతి, విజ్ఞానం గురించిన వెంపర్లాట, మనిషిపట్ల, మానవీయ విలువల పట్ల పడుతున్న ఆవేదన, సమస్త దుఃఖాలకు కారణమైన వ్యవస్థపట్ల ఆగ్రహం, మూలాల్ని పరిరక్షించుకోవాలనే ఆరాటం, ఇందుకు అవసరమైన పనిముట్ల కోసం చేసిన అన్వేషణలో ఎదురైన అనుభవాలు, సంఘటనలు, వ్యక్తులకు ప్రతిరూపం 'తొవ్వ ముచ్చట్లు'. రెండు భాగాలుగా వచ్చిన ఈ పుస్తకాలలో జాంబపురాణం, చిందు భాగవతం, తెరచీరలవారు, ఆశ్రిత కులాల గురించీ, పరస్పర బాంధవ్యంతో ముడిపడి ఉన్నవారి సంస్కృతులు, జీవన విధానం గురించిన అనేక విషయాలు ఇందులో దొరుకుతాయి. సనాతన ఆచార వ్యవహారాలను, సాంస్కృతిక కళా వికాసాలను, కనుమరుగు కాకుండా అక్షరాలలో సజీవంగా నిలిపిన అలనాటి సాహితీమూర్తులు తొవ్వ ముచ్చట్లలో దర్శనమిస్తారు. హేతువు, సంకేతానికి, జీవధారకు ఈ ముచ్చట్లు ప్రతీక. నిమ్నజాతి ప్రజల చరిత్ర ఆధారాలు, వస్తు సామాగ్రి, తామర, తాటాకు గ్రంథాలు అమోఘమైన జానపద సంపదను మోసుకొచ్చిన ముచ్చట్ల వినడం, చదవడంతో అనేకానేక విషయాలు తెలుస్తాయి. సామాజిక సత్యాలను తొవ్వ పొడుగునా ముచ్చట్లుగా మార్చి అచ్చులోకిఎక్కించి అరుదైన జానపద విజ్ఞాన సంపదగా 'తొవ్వ ముచ్చట్లు'ను మలిచాడు.

మనువాదానికి వ్యతిరేకంగా మాదిగ సంస్కృతిని పురాణం చేసే సమాంతర పురాణం జాంబపురాణం. ఇది ప్రధానంగా మాదిగ కుల పురాణం అయినా భూమి మీద ప్రాణికోటి పుట్టుక దగ్గర్నుంచీ భిన్న కులాల, ఉప కులాల ఉత్పత్తి, అస్తిత్వాల గురించి తెలియజేస్తుంది. ఇందులో ఆది పురాణం, పార్వతీ కళ్యాణం, మాలచెన్నయ్య పురాణం, ఆరంజ్యోతి కళ్యాణం, బలభద్ర విజయం అనే ఐదు ప్రధాన కథ లున్నాయి. పటం చూపించి కథ చెప్పే మౌఖిక సంప్రదాయంలో డక్కలి కళాకారులు తరతరాలుగా కాపాడుకుంటున్న ఈ పురాణాన్ని ఎంతో కష్టపడి జయధీర్ తిరుమలరావు బృందం గ్రంథస్థం చేసింది. ఇది దళిత తాత్విక చింతనకు పునాదిగా నిలుస్తుంది.

ప్రపంచీకరణ మాయలో వాస్తవికతను వీడి, ఊహల్లో పయనిస్తున్న నేటి తరానికి దళిత, ఆదివాసీల ప్రత్యామ్నాయ సాంస్కృతిక చరిత్రను అందించేందుకు అనుక్షణం తిరుమలరావు తన ఆలోచనలకు పదును పెట్టుకుంటూనే ఉంటున్నాడు. తన నలభై ఏళ్ల కృషిని ఆవిష్కరించేందుకు ఇటీవల హైదరాబాద్ నగరంలో 'సాహిత్య కళా అభిలేఖనాల ప్రదర్శన'ను ఏర్పాటు చేశాడు. సమాజంలో ఎనభై శాతం మేరకు ఉన్న దళిత, ఆదివాసీ, బహుజన సమూహాల విలువైన వారసత్వ సంపదను, సమాచారాన్ని ఇందులో ప్రదర్శించాడు. క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి శ్రమకోర్చి సేకరించిన రాగి రేకులు, తాళపత్ర గ్రంథాలు, కాగితం చుట్టలు, వివిధ రాత పరికరాలు, పడిగెలు, జంతు చిహ్నాలు, దానం హక్కు పత్రాలు, నిషిద్ధ గ్రంథాలు, కళారూపాలు, గుజిలీ ప్రతులు, కరపత్రాలు, పట చిత్రాలు తదితరమైనవి ఈనాటి తరానికి పరిచయం చేశాడు. దళిత, గిరిజన, ఆదివాసీల సాంస్కృతిక పరివ్యాప్తికి ఇవి తోడ్పడుతాయి. చరిత్రను భవిష్యత్తు తరాలకు అందిం చడంలో కొత్త ఆధారాల అన్వేషణ కీలకంగా మారుతుంది. సేకరించిన ప్రతి చిన్న చిత్రం, అక్షరం, ఆదివాసీల సంస్కృతి అధ్యయనానికి ఎంతో తోడ్పడుతుంది. అరుదైన తాళపత్ర గ్రంథాలు, కనుమరుగైన సాహిత్య, కళారూపాల చరిత్ర, కడ్డీవాద్యం, తెలంగాణ తోలుబొమ్మలు, గౌడ పురాణం, కొమ్ముల వారి చరిత్ర, మాదిగ ముద్రతో విశ్వపురాణం, కుల పురాణాలు, ఒగ్గువారి రాజశాసనం, నకాషీ కళ, మంద హెచ్చు బొమ్మలు, సామాజిక, రాజకీయ పత్రాలు ప్రదర్శనలో ఉంచాడు.

మారుమూల గ్రామాలు, తండాల్లో పర్యటించిన తిరుమలరావు అక్కడి ప్రజల చెమట చుక్కల్లో శ్రమ సౌందర్యాన్ని చూశాడు. శ్రామిక జన జీవనంలో కళ, సాహిత్యం, సంస్కృతిని వెతికి వెతికి పట్టుకున్నా డు. చితికిన సిబ్బి రేకుల్లోంచి, నలిగిన కాగితపు చుట్టల్లోంచి, నేతగాళ్ల గుడ్డ పటాల్లోంచి, గుర్రపువారి మూలాల చరిత్రలోంచి, సుద్దాల హనుమంతు పాటల్లోంచి, స్వాతంత్ర్య సమరగీతాల్లోంచి, నిషిద్ధ సాహిత్యం వరకు నాలుగు దశాబ్దాలపాటు జనం గుండెల్లోంచి ఏరుకున్న దగాపడ్డ జన సంస్కృతిని ఒడిసిపట్టాడు. జానపద కళల పరిశోధకుడిగా, అధ్యాపకుడిగా, ప్రొఫెసర్‌గా జయధీర్ తిరుమలరావు తెలుగు సాహిత్యానికి అపార సంపదను అందించాడు. ఆసియా ఖండంలోని తొలి జానపద పరిశోధన చేసిన ఆచార్య బిరుదరాజు రామరాజుకు కొనసాగింపుగా గిరిజన సంప్రదాయ పరిశోధనా వారసత్వాన్ని అందిపుచ్చుకున్నాడు. ఆయనొక కదులుతున్న జానపద విజ్ఞానం.

(ఆకాశవాణి, హైదరాబాదు కేంద్రం సౌజన్యంతో)

–ఆచార్య వెలమల సిమ్మన్న
9440641617

ఉత్తరాంధ్ర ఆదివాసి భాషా సాహిత్యాలు – అధ్యయనం

ఆదివాసులు ప్రధానంగా కొండ ప్రాంతాల్లో దట్టమైన అడవుల్లో చిన్న చిన్న సమూహాలుగా ఏర్పడి స్థిర నివాసులుగా జీవిస్తుంటారు. అంచేత వీరిని అనాథులనీ, కొండవారనీ, అడవి మనుష్యులనీ, ఆటవికులనీ, గిరిజనులనీ, దేశీయ ప్రజలనీ, ఆదివాసులనీ పిలుస్తున్నారు. వీరు శారీరక, భౌతిక లక్షణాల్లో భాష, మత విధానాల్లో, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాల్లో ఎన్నో వ్యత్యాసాల్ని కలిగి వున్నారు. ఒకప్పుడు వీరు నాగరికత ప్రపంచానికి దూరంగా, అజ్ఞానం, అనాగరికతల మధ్య, మూఢాచార సంప్రదాయాల సాలిగూటిలో, పరిధులులేని పేదరిక ఊబిలో అణగారిపోయి జీవించేవారు.

మన దేశానికి స్వాతంత్ర్యం రావడంతో వీరి జీవితాల్లో నూతన కాంతి కిరణాలు ప్రసరించాయి అని చెప్పక తప్పదు. దానితో దేశం ప్రజాస్వామ్య శ్రేయోరాజ్యం స్థాపన అనే సిద్ధాంతానికి అంకితం కావడం వల్ల సమాజంలోని నిమ్న వర్గాల్ని గుర్తించి, వారిని జాతీయ జీవన స్రవంతిలో సమైక్యం చేయాలని భారత రాజ్యాంగం భావించింది. అటువంటి బడుగు, బలహీనవర్గాల్లో ఆదివాసులు ఒకరు. వీరి అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రాధాన్యాన్నిచ్చి, అనేక పథకాలతో వారికి చేయూతనిచ్చి వారి జీవిత కోణాల్ని మెరుగు పరిచే ప్రయత్నం చేస్తున్నది. ప్రపంచ జనాభా లెక్కల ప్రకారం అనేక ప్రాంతాల్లో 9,600 ఆదివాసీ సమూహాలు వున్నాయి. అయితే ఆఫ్రికా, ఆసియా, ఆస్ట్రేలియా, అమెరికా, మలేషియా, పోలినేషియా, మైక్రోనేషియాల్లో ఆదివాసీ సమూహాలు ఎక్కువగా వున్నాయి. మన దేశంలో మధ్యప్రదేశ్, ఒరిస్సా, బీహార్, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అస్సాం, మేఘాలయాల్లో ఎక్కువశాతం ఆదివాసీలు నివసిస్తున్నారు. దేశం మొత్తం మీద భిల్లులు, గోండులు, సంతాల్‌లు ఎక్కువ సంఖ్యలో వున్నారు.

ఆదివాసీ శబ్ద విచారణ:

“ఆదివాసీ” అనే శబ్దం సంస్కృతం. హిందీ, నేపాలీ భాషల నుంచి పుట్టింది. భారతదేశపు వాస్తవ్యులైనటువంటి వివిధ జాతి మరియు తెగల జనాభాకు ఒక గొడుగు లాంటి శబ్దం ఈ ఆదివాసీ శబ్దం. వీరు భారతదేశపు జనాభాలో ఒక బలమైన సామాజిక వర్గానికి చెందినవారు. ఆదివాసీ అనే శబ్దాన్ని నేపాలీలో ‘జనజాతి’ అని పిలుస్తారు.

ఆదివాసీ శబ్ద వ్యుత్పత్తి:

కొండల్లో కోనల్లో అనాగరికంగా జీవిస్తున్న తెగల్ని ఆదివాసీలు (ట్రైబల్స్) అని అంటారు. ఇలాంటి ఆదివాసీలు భారతదేశం మొత్తం మీదా దాదాపు 360 పైగా తెగలు వున్నాయి. వీటిలో 73 తెగలవారు మహారాష్ట్రలోనూ 35 తెగలవారు ఆంధ్రప్రదేశ్‌లోనూ నివసిస్తున్నారు.

ఆదివాసుల లక్షణాలు:

1. ఆదివాసులు సాధారణంగా నాగరికులకు దూరంగా జీవిస్తారు.
2. ఒక నిర్ణీత ప్రాంతంలో మాత్రమే జీవిస్తారు.
3. మూఢ విశ్వాసాలు కలిగి వుంటారు.
4. లిపి లేని మాండలికాల్ని మాట్లాడుతారు.
5. నృత్య గాన ప్రియులై వుంటారు.
6. ప్రత్యేక రాజకీయ ఆర్థిక వ్యవస్థను కలిగి వుంటారు.
7. ముఖ్యంగా వీరు వారసత్వం కలిగి వుంటారు.

భారతీయ ఆదివాసులు – భౌగోళిక విభజన:

ప్రఖ్యాత మానవ శాస్త్రవేత్త, బి.ఎస్. గుహ భారతీయ తెగల్ని భౌగోళికంగా మూడు మండలాలుగా గుర్తించారు.

1. ఉత్తర ఈశాన్య మండలం
2. మధ్య మండలం
3. దక్షిణ మండలం

1. ఉత్తర ఈశాన్య మండలం:

ఉప హిమాలయ ప్రాంతాలు, కొండలు, లోయలతో కూడిన తూర్పు సరిహద్దు ప్రాంతాలు ఈ మండలంలోకి వస్తాయి.

2. మధ్య మండలం:

పీఠభూములు కొండలతో ఉత్తరాన సింధూ గంగా మైదానాల మధ్య దక్షిణాన కృష్ణానది వరకు విస్తరించిన ప్రాంతాన్ని మధ్య మండలంగా పరిగణిస్తారు.

3. దక్షిణ మండలం:

కృష్ణానదికి దక్షిణాన మైనాడ్ నుంచి కన్యాకుమారి వరకు వున్న దక్షిణ భారతదేశంలో ఈ మండలం వుంది.

భాషాపరమైన వర్గీకరణ:

భారతదేశంలో వివిధ భాషలు మాట్లాడే తెగల్ని వారి భాషమూలాల ఆధారంగా మూడు రకాలుగా వర్గీకరించారు. 1) ద్రవిడ భాషా కుటుంబం 2) ఆస్ట్రిక్ భాషా కుటుంబం 3) టిబెట్, చైనీస్ భాషా కుటుంబంగా విభజించారు. ద్రావిడ భాషా కుటుంబంలో గోండ్, ఓరాన్, మాల్టో, తోడా, పలియా, చెంచు, ఇరుల, కాదర్‌లాంటి గిరిజన తెగల భాషలు చేరుతాయి. ఆస్ట్రిక్ భాషా కుటుంబంలో ముండా, సంతాలీ, సవర, హూ, ఖారియా, భూంజీ, హిమాలయ పర్వత ప్రాంతాల్లోని కొన్ని గిరిజనజాతుల భాషలు చేరుతాయి. ఇందులోని “సవర” భాషపై విశేషమైన కృషి చేశారు సుప్రసిద్ధ భాషావేత్త గిడుగు రామమూర్తి గారు. టిబెట్, చైనీస్ భాషా కుటుంబంలో అస్సాం, మేఘాలయా, త్రిపుర ప్రాంతాల్లో నివసించే తెగలు, అరుణాచల్ ప్రదేశ్‌లోని తెగల భాష చేరుతుంది.

మన్నెం చరిత్ర:

నాగరికుల విహార కేంద్రంగా, వారికి ఆహ్లాదాన్ని పంచే ఏజన్సీ ప్రాంతానికి ఒక అద్భుత చరిత్ర వుంది. దాని గూర్చి ఏ కొద్ది మందో తప్ప మిగతావారెవ్వరూ అంతగా పట్టించుకోలేదు. కొండ కోనల్లో ఆదివాసీ జీవన ప్రస్థానం, నాగరిక ప్రపంచ దృష్టికి తీసుకురావాలనే ఉద్దేశంతో చాలా మంది పరిశోధనలు చేశారు, చేస్తున్నారు. ఈ పరిణామం హర్షించదగ్గది.

ఉత్తరాంధ్ర ఏజెన్సీ:

ఉత్తరాంధ్ర ఏజన్సీ ప్రాంతం క్రీ.శ. 497లో గంగ వంశ రాజుల

ఏలుబడిలోకి వచ్చింది. గంజాం కేంద్రంగా వారు ఈ ప్రాంతాన్ని పాలించారు. గంగరాజుల కుటుంబీకుల పేరిట అనంత వర్ధన్ చోడ గంగా క్రీ.శ. 1078 నుంచి 72 ఏళ్ళ పాటు పాలించాడు. తర్వాత వడ్డాది మాడుగులని కేంద్రంగా చేసుకొని ఒరియా రాజులు ఈ ప్రాంతాన్ని పాలించారు. తర్వాత విజయనగర రాజులు హఠాత్తుగా దండెత్తి ఈ కోటను వశపరుచుకోవటంతో మాడుగుల రాజు అడవుల్లోకి పారిపోయాడు. తిరిగి అక్కడి ఆదివాసుల సహాయంతో విజయనగరం రాజుపై దండెత్తి, తిరిగి ఈ కోటను ఒరియా రాజులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కోటను ఇప్పటికీ యుద్ధకోట అనే పిలుస్తారు. క్రీ.శ. 11వ శతాబ్ది వరకూ మత్స్య వంశరాజులు ఈ ప్రాంతాన్ని పాలించారు. వీరు వడ్డాదిని రాజధానిగా చేసుకొని ఈ ప్రాంతాన్ని పాలించారు. తర్వాత ఈ ప్రాంతం తూర్పు గంగా వంశం రాజుల ఏలుబడిలోకి వచ్చింది. క్రీ.శ. 16,17 శతాబ్దాల నాటికి ఇప్పటి ఉత్తరాంధ్ర ప్రాంతం మొత్తం ఒరిస్సాలోని జయపురం (ప్రస్తుతం జయపూర్) కేంద్రంగా పాలిస్తున్న నందపురం శిలావంశ రాజుల ఏలుబడిలోకి వచ్చింది. ఆ కాలంలోనే ఉత్తరాంధ్రలో పలు సంస్థానాలు ఏర్పడ్డాయి. 1936లో ఒరిస్సా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసారు. దీనితో విశాఖ జిల్లా నుంచి గంజాం, కోరాపుట్ ప్రాంతాలు విడిపోయి ఒరిస్సాలో ప్రత్యేక ప్రాంతాలుగా, జిల్లాలుగా ఏర్పడ్డాయి.

ఉత్తరాంధ్ర, బ్రిటీష్ వారి ఆధీనంలోకి వెళ్ళిన తర్వాత గూడెం, గోలుకొండ తాలూకాలు బ్రిటీష్ వారి సామ్రాజ్య వ్యతిరేక పోరాటాలకు కేంద్రాలయ్యాయి. ఏజన్సీ అధికారుల అక్రమాలకు, ముఠాదారుల, కాంట్రాక్టర్ల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు తీవ్రమైన తిరుగుబాటు చేశారు. 1845 ప్రాంతంలో ప్రభుత్వ విధానాలకు నిరసనగా గొలుగొండ ఏజన్సీ ప్రజలు తిరుగుబాటు చేశారు. శిస్తులు చెల్లించడానికి నిరాకరించారు. దీన్ని తిప్పికొట్టడానికి ప్రభుత్వం సైన్యాన్ని, పోలీసుల్ని పంపింది. వీరిని ప్రతిఘటించేందుకు ప్రజలు బారకేట్లు నిర్మించి మూడేళ్ళపాటు గెరిల్లా పోరాటం నడిపి బ్రిటీష్ ప్రభుత్వాన్ని స్తంభింప చేశారు. ఆ తర్వాత 1857-58, 1886-91లో గోలుగొండ ప్రాంతంలో పితూరీలు ఉధృతమయ్యాయి. 1879లో ఏజన్సీ అధికారులు దోపిడీకి వ్యతిరేకంగా "రంప" తిరుగుబాటు జరిగింది. అదే సమయంలో జయపూర్ మహారాజు పరిధిలోని "సవరులు" కూడా తిరుగుబాటు చేశారు. ఇది ఈ ప్రాంత పోరాటాలకు మరింత ఊపు నిచ్చింది. 1922-24 కాలంలో విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జరిపిన మన్నెం పోరాటం బ్రిటీష్ వారిని గడగడ లాడించింది. ఉత్తరాంధ్ర ఏజెన్సీ చరిత్ర, సంస్కృతి చాలా ప్రాచీనమైంది. ఆదర్శ వంతమైంది.

స్వాతంత్ర్యానంతరం:

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1975లో ఆదివాసీ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) ఏర్పడింది. 1979లో రెవెన్యూ డివిజన్లు ఏర్పడ్డాయి. ప్రస్తుత ఉత్తరాంధ్ర ఏజన్సీలో 27 మండలాలు వున్నాయి. అవి 1. సీతంపేట 2. భామిని 3. కొత్తూరు 4. హిరమండం 5. పాత పట్నం 6. మెలియాపుట్టి 7. మందస 8. సారవకోట 9. గుమ్మలక్ష్మీపురం 10. కురుపాం 11. జియ్యమ్మవలస 12. కొమరాడ 13. పార్వతీపురం 14. మక్కువ 15. సాలూరు 16. పాచిపెంట 17. అనంతగిరి 18. అరకు 19. దుంబ్రిగూడ 20. హుకుంపేట 21. పెదబయలు 22. ముంచంగిపుట్టు 23. పాడేరు 24. జి.మాడుగుల 25. చింతపల్లి 26. గూడెం కొత్తవీధి 27. కొయ్యూరు అనే మండలాలు వున్నాయి.

భౌగోళిక స్వరూపం:

ఉత్తరాంధ్ర ఏజన్సీ ప్రాంతం విస్తీర్ణం 8,934,81 చదరపు కిలోమీటర్లు. అటవీ ప్రాంతం 3,78,828 హెక్టార్లు. వ్యవసాయ పరంగా వినియోగిస్తున్నది 8,541 హెక్టార్లు. వ్యవసాయ యోగ్యం కాని భూ విస్తీర్ణం 36,921 హెక్టార్లు. మొత్తం సాగు విస్తీర్ణం 1,24,825 హెక్టార్లు. రెండు పంటలు పండే భూమి విస్తీర్ణం 36,921 హెక్టార్లు.

వాతావరణ పరిస్థితి:

మైదానంతో పోలిస్తే ఎక్కువగా ఉత్తరాంధ్ర ఏజన్సీ ప్రాంతం చాలా చల్లగా వుంటుంది. ఈ ప్రాంతంలో ఏప్రిల్, మే, జూన్ నెలలో ఎండలు అధికంగా వుంటాయి. జూన్ నెల నుంచి ఇంచుమించు అక్టోబర్ వరకూ వర్షాలు కురుస్తూ వుంటాయి. నైరుతి ఋతుపవనాల వల్ల ఉత్తరాంధ్ర ఏజన్సీలో వర్షం ఎక్కువగా కురుస్తుంది. సంవత్సరానికి సుమారు 10486 మిల్లీ లీటర్లు వర్షం కురుస్తుంది. ఇంచుమించు నవంబర్ నుంచి మంచు మొదలవుతుంది. బాగా చలిగా వుండే కాలంలో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీ సెల్సియస్ కంటే తక్కువకు పడిపోతాయి. గూడెం ఏజన్సీ అడవులు దట్టంగా వుంటాయి. దీనితో పోలిస్తే పాడేరు ప్రాంతంలో అటవీ సాంద్రత తక్కువ.

ఉత్తరాంధ్ర ఆదివాసీ తెగలు వారి జనాభా:

2001లో ఆదివాసీ జనాభా 9,23,660. దీనిలో పురుషులు 4,59,762. స్త్రీలు 4,63,898.

జనాభా వివరాలు:

1. సవరలు	- 1,21,510	11. బాగత	-1,32,062
2. జాతాపులు	- 1,18,373	12. చెంచులు	- 585
3. గదబలు	- 35,687	13. గౌడులు	- 7,741
4. కొండదొర	- 1,91,024	14. కొండకమ్మర	- 22,284
5. మన్నెదొర	- 8,872	15. కొండ కాపు	- 2,098
6. నూకదొర	- 35,504	16. కొండ రెడ్లు	- 647
7. ఎరుకలు	- 16,732	17. కులియా	- 227
8. కోందు	- 84,606	18. మాలీలు	- 2,498
9. కొటియ	- 47,962	19. నాయక్‌లు	- 207
10. పోర్జ	- 30,602	20. వాల్మీకి	- 53,315

మౌఖిక సాహిత్యం:

అరణ్యంలో సంచరించే ఆదివాసీ మౌఖిక సాహిత్యానికి ప్రేరణ కల్గించేవి ప్రకృతి ప్రసాదించిన పక్షుల కిలకిల రావాలు, గలగల పారే సెలయేర్ల ధ్వనులే. గాలి, దట్టమైన వెదురు బొంగుల మధ్య చెట్ల ఆకుల మధ్య కొమ్మల మధ్య, ప్రయాణం సాగిస్తున్నప్పుడు వాటి నుండి ఒక విధమైన రాగంతో కూడిన ధ్వనులు విన్పిస్తాయి. ఆ ధ్వనుల్ని విన్న ఆదివాసీలు తమకు వచ్చిన గాత్రంతో కూనిరాగాలు తీసేవారు. కొంతకాలానికి ఆ కూనిరాగాలే పాట రూపాన్ని సంతరించుకున్నాయి. వీరి భాషలో మౌఖిక సాహిత్యం మాత్రం కోకొల్లలుగా వుంది. ఈ మౌఖిక సాహిత్యంలో అనేక కథలు, సామెతలు, పాటలు, పుక్కిటి పురాణాలు, గాథలు, హాస్తోక్తులు, కవిత్వం, సంగీతం తదితర అంశాలు పొందుపరచబడి వుంటాయి. ఆదివాసీ తెగల్లో ప్రచారంలో వుండే

గాథల్లో వీరి కట్టుబాట్లు, ఆచారాలు, మానవుల ప్రవర్తన, దేవుళ్ళు, వృక్షాలు, జంతుజాలం, జంతువులకు, మనుష్యులకు మధ్య వుండే అవినాభావ సంబంధాలు మానవుడు జంతువులపై ఎలా ఆధారపడి వుండేవాడో తదితర అంశాలన్నీ నిక్షిప్తమై వుంటాయి. ఇంకా నిత్య జీవితంలో ఎదుర్కొనే పరిస్థితులు కూడా ఈ కథల్లో చిత్రించబడ్డాయి.

ఆదివాసీల జీవితంలో కవిత్వం నాటకం, కథలు, సంగీతం లాంటి ప్రక్రియలు కలిసే వుంటాయి. వీరి కవిత్వ రూపాల్లో సరదా పాటలు, జోల పాటలు, భక్తి గీతాలు, శృంగార గేయాలు, పెళ్ళి పాటలు, వేటాడుతున్నప్పుడు పాడే పాటలు, నృత్యగీతాలు, మంత్రాల్లా వుండే పాటలు, వ్యంగ్య కవిత్వం, పురాణ గాథల కవిత్వం, సూక్తులు, పొడుపుకథలు, నీతి కథలు, వైరాగ్య కథలు, వీర గాథలు, హాస్య కథలు ఇలా అనేక కథలు, పాటలు, కవిత్వాలు మొదలైనవి వీరి జీవితాల్లో కన్పిస్తాయి. వీరు పండుగ సమయాల్లో మౌఖిక సాహిత్యానికి అధిక ప్రాధాన్యతనిస్తారు. పాటరాని ఆదివాసీ స్త్రీ పురుషులు వుండరంటే అతిశయోక్తికాదు. వీరికి ఆనందాన్ని, సుఖాన్ని, ఉల్లాసాన్ని కలిగించేవి పాటలు. ఈ పాటలన్నీ మౌఖిక సాహిత్యంలో భాగమే. ప్రకృతి ఎంత అందంగా వుంటుందో ఆదివాసీ సంస్కృతి కూడా అంతే అందంగా వుంటుంది.

ఆదివాసీ సాహిత్యం–పరిశీలన:

తెలంగాణ సాయుధ పోరాటం నేపథ్యంలో దాశరధి రంగాచార్యులు రాసిన “చిల్లర దేవుళ్ళు” నవల ఆదివాసీల పోరాటాన్ని మొదటగా ప్రస్థావించింది. ఈ నవలలో కేవలం మైదాన ప్రాంతం లంబాడీ తెగ ఆదివాసుల జీవితాల్నే చిత్రీకరించారు.

ఆదివాసుల మీద వచ్చిన మరో మంచి నవల ‘మోదుగు పూలు’. ఈ నవలను గూర్చి “సృజన” పత్రిక ఇలా వ్యాఖ్యానించింది.. “మోదుగు పూలు ఆదివాసీలకు చిహ్నం. చెట్టు నిండా మోదుగు పూలు విరబూసినప్పుడు చూస్తే ఆ చెట్టుకి ఒక్క ఆకు కూడా వుండదు. ఆ చెట్టు నిండా పూచిన పూలు కీలల్లాగా జ్వాలల్లాగా కనబడతాయి. అందుకే అవి పూలు కామకీలలు, మంటలు, జ్వాలలు. మోదుగు పూలు ఘాటెక్కిన గంధకధూపం, ఆ కీలలూ ధూమము జగమంతా వ్యాపించాలి, వ్యాపిస్తుంది”. ఈ నవలలో ఆదివాసీల జీవన చిత్రణ వుంది.

శ్రీకాకుళం నక్సల్బరీ పోరాటం నేపథ్యంలో “అడవి” అనే నవలను “చతుర” మాసపత్రికలో ప్రచురించారు. కొమరంభీం నుంచి శ్రీకాకుళం పోరాటం వరకూ ఆదివాసుల జీవితంపై దోపిడీ దార్ల పెత్తనాన్ని, రాజ్యహింసని, ఆదివాసుల ప్రతిఘటనని ఈ నవలలో పొందుపరిచారు. ఈ నవల ప్రముఖ విమర్శకుల ప్రశంసల్ని అందుకుంది.

భూషణం అట్టడుగు జీవుల కథలు రాస్తానని కంకణం కట్టుకొని ‘అడివంటుకొంది, కొండగాలి, ఇదే దారి, తీర్పు’ మొదలైన రచనలు చేశారు. ఊరి మీద కథ అనే రచన కూడా రాశారు. ఈ ఊరి మీద కథ అనే రచనలో ఆదివాసీల్ని దోచుకుని, వూళ్ళోని పెద్దలంతా ఎలా ధనికులయ్యారో అద్భుతంగా వర్ణించడమే కాకుండా ఆదివాసీల పోరాట పటిమను కూడా వర్ణించారు. ఆదివాసీల జీవన విధానం భూషణం గారి కథల్లో కన్పిస్తుంది.

ఆదివాసీల భాషలో పాటలు రాయడం శ్రీకాకుళం గిరిజన పోరాటానికి ముందే జరిగింది, అంటే విప్లవ గేయాలు రాయడం ఈ పోరాటంతోనే ప్రారంభమయ్యింది. అడవిలో ఆదివాసీల్ని సాయుధుల్ని చేయడానికి వారి భాషలోనే పాటల్ని పాడాల్సి వచ్చింది. సాహు, గోండు భాష నేర్చుకొని ఆ భాషలోనే పాటల్ని రాశారు. ప్రజా నాట్యమండలి ప్రచురించిన పుస్తకాల్లో చాలా ఎక్కువగా ఆదివాసీ గీతాలే కన్పిస్తాయి.

“తెలుగు గిరిజన గీతాలు” అనే గ్రంథాన్ని 1991లో డాక్టర్ పిరాట్ల శివరామకృష్ణ ‘శక్తి’ రాశారు. దీనిలో ప్రాచీన సాహిత్యంలోని ఆదివాసుల ప్రస్తావన, ఆదివాసుల గీతాల్ని ఆయన పొందుపరిచారు. ఆచార్య జగ్రా అప్పారావు గారు ఉత్తరాంధ్ర ఆదివాసీ భాషా సాహిత్యాలపై పరిశోధన చేశారు. పరిశోధనలు చేయిస్తున్నారు కూడా. ప్రస్తుతం ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లో అన్ని విశ్వవిద్యాలయాల్లో ఆదివాసీ భాషా సాహిత్యాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ పరిణామం ఆహ్వానించదగ్గది. అభినందించదగ్గది.

ఆదివాసీ భాష – పరిశీలన:

భారతదేశంలో 11వ శతాబ్ది ప్రాంతంలో వుపయోగించిన పదాలు ఈనాటికీ ఆదివాసీ వ్యవహార భాషలో చిరస్థాయిగా నిలిచి వున్నాయి. దీన్నిబట్టి ఆదివాసీ ప్రాచీనత ముఖ్యంగా తెలుగువారి ప్రాచీనత, సంస్కృతి చాలా స్పష్టంగా కన్పిస్తాయి. ఆదివాసీలు మాట్లాడే ఈనాటి వ్యవహార భాష, కొంత భిన్నంగా కన్పిస్తుంది. ఊనిక స్వరాల భేదంతో సహజంగా వుంది. సమాజంలో అన్ని అంశాల్లోనూ అన్ని వస్తువుల్లోనూ నకిలీ, కల్తీ చోటు చేసుకుంది. అదే విధంగా భాషలో కూడా. అయితే ఆదివాసీ వ్యవహారిక భాష నాటికీ నేటికీ ఒకేలాగ వుంది. అందులో మార్పు లేదు. అదే ఆదివాసీ వ్యవహారిక భాష ప్రత్యేకత. వారి భాష ఇప్పటికీ సజీవంగానే వుంది. పెద్ద పర్వత శ్రేణులు, నదులు, అడవులు, వుండడం వల్ల, రాకపోకలకు ప్రతిబంధకాలు ఏర్పడడం వల్ల, అన్యదేశాలు ఇతర ప్రాంతాల వారి మాండలికాలు ఆదివాసీ వ్యవహారిక భాషలోకి చేరలేకపోయాయి. అందుకే ఆదివాసీ భాష చెక్కు చెదరక కలుషితం కాలేదు. అదే ఆదివాసీ భాష గొప్పతనం, విశిష్టత కూడా.

తెలుగులో లభించిన మొట్టమొదటి గ్రంథమైన నన్నయ భారతంలో వుపయో గించిన పదాలు అనేకం ఆదివాసీ వ్యవహారికంలో వుండడం చెప్పుకోతగ్గ విషయం. అంతేకాక బేపి, నేస్తం, దుమ్ములు, నడిపి, పాతెడు (పరిగెత్తు) తాపులు (తన్నులు), సొమ్ము, సిక, అమ్ము, దోసము, ఒక్కతే, గొంతి, తమ్ము, తోలి, తోడ్కొని మొదలైన పదాలు, ఉత్తరాంధ్రలోని ఆదివాసీ భాషల్లో చాలా స్పష్టంగా కన్పిస్తున్నాయి.

ఉత్తరాంధ్ర తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా కవిత్వం, కథలు, నవలలు, నాటకాలు, నాటికలు, పాటలు, మొదలైన అనేక క్రియల్లో ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, గూర్చి ఎంతో విస్తృతంగా వుంది. అందువల్ల ఆదివాసీ భాషా సాహిత్యాల గూర్చి మరింతగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

“అన్ని విద్యాదశల్లోనూ మాతృభాష బోధనాభాషగా ఉండాలి”

– కొఠారి కమిషన్

–ద్విభాష్యం రాజేశ్వరరావు
9440318415

తెలుగు పట్ల నిర్లక్ష్యం :
నాడు ఆంగ్ల పాలకులు! నేడు తెలుగు పాలకులు!!

మన దేశంలో 1910 నుండీ ఇంటర్మీడియేట్, బియ్యే విద్యార్థులకు దేశభాషలను ఇష్టం మేరకు చదువుకోవచ్చుననీ, నిర్బంధం కాదనీ ఒక రూలు ప్రవేశపెట్టారు ఆంగ్లేయ ప్రొఫెసర్లు. అప్పట్లో విద్యా విధాయక మండలి అంతా వారి చేతుల్లోనే వుండేది. వారు 'ఆడింది ఆట, పాడింది పాట' అప్పట్లో ఇంగ్లీషు చదువులు చదివితే కలెక్టర్ అయిపోవచ్చనే అపప్రథ అందరిలోనూ వుండేది. అందుకు సాక్ష్యం గురజాడ వారి కన్యాశుల్కం నాటకమే! అలా దేశ భాషల్ని వదలి ఆంగ్లం వైపుకు మరలిపోవటం ఆరంభమయింది. అందువలన దేశభాషల్ని నిర్బంధంగా, విద్యావ్యవస్థలో ప్రవేశపెట్టాలని, ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో, లేదా భాషను బట్టి అదే ప్రాంతంలో కొంత ఆందోళనలు చెలరేగేయి.

దేశభాషాభిరుచి వుంటే ఆ భాషలో చదవండి, లేదా ఆంగ్లంలో చదువుకోండి అనటం వలన– కేవలం మన మద్రాసు ప్రెసిడెన్సీ విషయం తీసుకుంటే, 1912లో ఇంటర్మీడియేట్‌కు 5823 మంది, బియ్యేలో 1012 మంది విద్యార్థులు (మొత్తం సంఖ్య) వుంటే, ఇందులో ఇంటర్మీడియేట్‌లో అరవం చదువువాడు ఒకడు ఫస్టియర్‌లో మిగిలితే సెకెండ్ ఇయర్‌లో కేవలం ఆరుగురు మిగిలేరు. ఇంక బియ్యే తరగతి వ్యవహారం తీసుకుంటే తెలుగులో 71 మంది, కన్నడంలో 15 మంది, మలయాళంలో 28 మంది, ఉర్దూలో 27 మంది చేరారు. సంస్కృతంలో 282 మంది చేరారు. అంటే మొత్తం దేశీయ భాషల నుంచి 423 మంది ఐచ్ఛికంగా ఎంచుకుంటే, 589 మాత్రం ఆంగ్లాన్ని ఎంచుకున్నారు. "ఐచ్ఛికంగా ఎంచుకోమంటే మన దేశీయ భాషలు ఇలాగే దిగజారిపోతాయి. అందువలన ఈ నూతన పద్ధతి ఎంత మాత్రమూ దేశీయ భాషల అభివృద్ధికి తోడ్పడదు" అంటూ ఆనాడే మహారాజశ్రీ హానరబుల్ శ్రీనివాస శాస్త్రిగారు నొక్కి వక్కాణించారు.

అటువంటి దశలో మన పానుగంటి లక్ష్మీ నరసింహారావుగారు రంగంలోకి దిగేరు. ఆయన రాసిన వ్యాసాలు 'తెలుగువారి బృహత్ సంహితలు' అంటూ జేజేలు పలికారు శ్రీ మధునాపంతుల సత్య నారాయణ శాస్త్రిగారు.

పానుగంటివారు సాక్షి వ్యాసాలు కొంత గ్రాంధికంలోనే రాసినా, అది మామూలువారికీ అర్థమయ్యే గ్రాంధికం తప్ప, నారికేళ గ్రాంధికం కాదు! ఒక్కోసారి చాలా గాఢమయిన గ్రాంధికం వాడినప్పుడు వెనువెంటనే ఆ భావం అర్థమయ్యేలా సులభమయిన తెలుగులో ఒక మామూలు వాక్యం తగిలించేవారు.

పానుగంటివారు గొప్ప నాటక రచయిత, వ్యాసకర్త, ఆయన వ్యాసాలు ఆవు కాంపోజిషన్‌లా వుండవు. వాటిలో వాస్తవికత వుంటుంది, సంఘటనలు వుంటాయి. నాటకీయత వుంటుంది. తాను చెప్పదల్చుకున్న విషయాన్ని పఠితల హృదయాల్లోకి ఎక్కించటానికి వందలకొద్దీ దృష్టాంతాలు వాడతారు. ఉపమాలంకారం ప్రయోగించటంలో వారికి వారే సాటి. వ్యాసాలలో సందర్భశుద్ధి, సంస్కరణాభిలాష

'నా నోటివద్ద అన్నమును ఎవడయినా ఎగమాటు కొనిపోవ నేను కంటతడి పెట్టువాడనుకాను. నేను దున్నుకొని జీవించు పొలమును ఎవడయిన ఆక్రమించిననూ నేను ఏడ్వను. నా ఇంటిలోని సర్వస్వమూ సకాంతా పుత్రకముగ చోరులు హరించిననూ నేనంత దుఃఖించువాడను గాను. కానీ, చేటలో పడి 'క్యావు' మనునది మొదలుకొని, కాటిలో పడువరకూ ఉపయోగించుకొను నా మాతృభాషకు ఆదరణము లేనిచో...' అంటూ ఇంక మాట్లాడలేక గొంతు పూడుకుపోగా జంఘాలశాస్త్రి కళ్ళు తుడుచుకున్నాడు.

పుష్కలంగా వుంటాయి. అన్నిటికీ మించి అస్పృశ్యత, సతీ సహగమనం, వితంతువుల కడగండ్లు, ఇంకా అనేక రకాల సాంఘిక దురాచారాల మీద, దుర్నీతులమీద ఏమాత్రం భయపడకుండా చురకలు వేయడంలో వీరికి వీరే సాటి.

ప్రస్తుత విషయం మాతృభాషా బోధనల ఆవశ్యకతను గురించి కాబట్టి నేరుగా ఆ విషయానికి వస్తాను. పానుగంటివారు సాక్షి సంఘం పేరుతో ఓ సంఘం స్థాపించారు. అందులో ఆరుగురు సభ్యులు. అందులో ఒకరయిన జంఘాల శాస్త్రి కేవలం ఉపన్యాసకుడు. ఇదంతా కేవలం ఊహే అయినా, ఆ రోజుల్లో ఆ వ్యాసాలు ఎంత రక్తి కట్టాయంటే సాక్షి సంఘ సభ్యులందరూ సజీవులే అని పఠితలు నమ్మేవారు. పానుగంటివారి అల్లుడు శ్రీ ద్రోణంరాజు వేంకట రమణారావు నడిపే సువర్ణ మేఖలలో ఈ సాక్షి పరంపర ఆరంభ మయింది. సాక్షి సంఘస్థాపన గురించిన మొదటి వ్యాసం అయిన తరువాత వారు "గ్రామ్యభాషా గ్రంథ పఠనము" అనే పేరుతో ప్రచురించిన రెండో వ్యాసంలో, నేరుగా వారి మొట్టమొదటి అస్త్రం **'మాతృభాషను అభ్యసించవలసిన అవసరం'** అనే విషయం మీదనే ఎక్కుపెట్టటం గమనార్హం. అసలు భాషా సంరక్షణ ఉద్యమం కోసమే వారీ వ్యాసాలు ఆరంభించారేమోనని కూడా అనిపిస్తుంది. ఎందుకంటే వారు రాసిన సుమారు 140 వ్యాసాలలోనూ తెలుగు భాష ఔన్నత్యాన్ని అనేకచోట్ల కొనియాడుతూ, దానిని పరిరక్షించుకోవలసిన ఆవశ్యకత గురించి బల్లగుద్ది మరీ వాదించారు.

ఇంతకుముందు నేను వివరించినట్లు– 1912 నాటికి ఆంగ్లానికి ప్రాముఖ్యత నిచ్చి దేశభాషల ప్రాముఖ్యతను తగ్గించే దిశలో వ్యవహారాలు సాగుతున్నాయి. దేశభాషలు చాలా వున్నా, మనకు సంబంధించినంతవరకూ మన మాతృభాష తెలుగు కాబట్టి తెలుగును రక్షించుకోవలసిన అవసరం అనే విషయంతో ఈ వ్యాసం ఆరంభం అవుతుంది. అదికూడా ఎంతో నాటకీయతతో!!

❖ ❖ ❖

"అయ్యయ్యో! ఇంక ఏమున్నది? ఇంకనూ ఇట్లు కూరుచుండి నారా?" అని బిగ్గరగా అరుస్తూ జంఘాల శాస్త్రి, మిగిలిన

సభ్యులున్న సాక్షి సంఘం కార్యాలయంలోకి వస్తారు. ఆ రావటంలో గుమ్మం తగిలి నుదుటిమీద గాయమవుతుంది. అయినా లెక్క చేయకుండా లోనికి వస్తాడు.

"కొంపలు కాలుచున్నవా ఏమి?" అంటూ సాక్షి అడుగుతాడు.

"కొంపలు కాలుచున్నవా అని అడుగుచున్నారా? ఈ వూరి కొంపలా? ఈ తాలూకా కొంపలా? ఇట్టి అనేక జిల్లాల కొంపలు కాలుచున్నవా?' అని అడుగుడు!... దేశభాషల బ్రతుకేమయినదో తెలిసినదా? ఇంటర్మీడియేటు, బియ్యే క్లాసులలో అనివార్యములగు పఠనీయములుగా మన దేశభాషలను చేయుటకు విద్యా సంఘమువారు అంగీకరించలేదు. అయ్యో! మనము మాట్లాడుకొనుభాష కదా! ఏ భాషలో పుట్టి, ఏ భాషలో పెరిగి, ఏ భాషలో చత్తుమో, ఆ భాష కదా! మన పుత్రులేమి, పౌత్రులేమి, మన సంతతి వారందరూ, ఈ ప్రపంచము నిలిచి యున్నంతవరకూ అభ్యసించి, అభివృద్ధి పరచుకొనవలసిన భాష కదా! వారికి (అంటే ఆంగ్లేయులకు- ఇంగ్లీషు ప్రొఫెసర్లకు- విద్యామండలి వారికి (ఈ పట్టుదల ఏల? వారికిట్టి దేశభాషా నిరాదరణ మేల? హిందూ దేశములో స్థాపించిన హైందవ సర్వకళానిలయము (*Indian university*)లో దేశభాషలే పఠనార్హములు కాకుండా చేయునంతటి గొప్ప పూచీని వారేల వహింపవలయును?..." అని జంఘాల శాస్త్రి అంటూ వుంటే, వాదం కొనసాగటానికి (అప్పటి ప్రభుత్వం కొమ్ము కాస్తూ) సాక్షి అంటాడు "కొంతకాలము కిందటి వరకూ దేశీయభాషలు నిర్బంధ పఠనీయములుగా వుండెను గానీ, ఆ పద్ధతి సంతుష్టి కరమయిన అభివృద్ధి కానీయలేదు. అందువలన దేశభాషలు (ఈ విషయంలో తెలుగు)పై పరీక్షలకు నిర్బంధముగా కాకుండా; స్వేచ్ఛా పఠన యోగ్యములుగా చేయబడినవి."

"అంటే.. దాదాపు 12 సం॥ వయసున్న నాలుగో ఫారం పిల్లవాడు దేశభాషల్ని వదులుకోవాలా? ఏ దేశంలో అయినా ఇలా జరుగుతోందా? మీకు ఆంగ్లము దేశభాష కదా, దానిని ఇట్లే పరిత్యజించితిరా? మీరు లాటిను, గ్రీకు మున్నగుభాషలు అభ్యసించినపుడు ఆంగ్లభాషా మాధ్యమముననే నేర్చుకొనలేదా? మీరు ఇంగ్లీషును వదిలి వేయలేదు కదా! మీ అభివృద్ధికి దేశభాష ఆవశ్యకమయినదా? మా అభివృద్ధికి అది ఆటంకము అయినదా? పోనీ స్కూలు ఫైనలు వరకూ నయినా నిర్బంధ భాషగా వుంచితిరా? అదియునూ లేదే!" అంటూ జంఘాల శాస్త్రి వాదిస్తూ, ఇంకా ఇలా అంటాడు. "మన భాషామాతను అంటే మన తెలుగును మనము వదల దలుచుకున్నప్పుడు మనకు ఇక విద్యతో పనియే లేదు. మాతృభాషా నిరసనము కంటే మౌఢ్యమే మంచిది! మన భాషామాత యొక్క అభివృద్ధికి, ఉపయోగమునకు, ఉజ్జీవమునకు, సదుపాయమునకు; ఇతర భాషలు సాయపడాలి తప్ప మన భాషను వదులుకోటానికి కాదు! నీవు సంపాదించిన పరభాషా జ్ఞానమంతయూ నీ భాషను అభివృద్ధి చేసుకొనుట కొరకే! వన్నె పెట్టుట కొరకే! అంతేకానీ నీ భాషను చంపుకొనుటకు కాదు. బంధువులకు పరమాన్నముతో భోజనము పెట్టవలయునని, ముందుగా మా తల్లిని పస్తు పెట్టెదరా? తల్లిని గౌరవింపని జ్ఞాన శూన్యుడు, బంధుమర్యాద కేడ్చినందువలన విశేష గౌరవమున్నదా? అట్టివాడు తాను పస్తుండుట మంచిది కాదా?... అయ్యయ్యో... మన భాషయే- మహానంద కందళ సందోహ సంధాన తుందిలమగు మాతృభాషయే- నమ్రతకు నమ్రత, కఠినతకు కఠినత- వదలునకు వదులు, బిగిని బిగి- జోరుకు జోరు, ఎదురెక్కునకు ఎదురెక్కు- మందతకు మందత, ధాటికి ధాటి- ఎన్ని వన్నెలు, ఎన్ని చిన్నెలు, ఎన్ని వగలు, ఎన్ని వయ్యారములు- కలిగిన మన మాతృభాషయే! వ్యాసమునకు ఉపన్యాసమునకు- కవిత్వమునకు గానమునకు సంపూర్ణార్హత గల భాషయే!- పైవారే మన తెలుగుభాషను పట్టుదలతో ప్రయత్నమున అభ్యసింపవలసి యుండగా- మనవారే మనభాషను అధమాధమముగా చూచుట తగునా?... స్వభాషను నేర్చుకొనుటకు ఏమంత శ్రమ యున్నది? అక్షరాభ్యాసము దినమునుండీ మీరు మీ స్వభాషను అభ్యసించు చున్నారని మీరు అనుకొనవలదు. మీ తల్లి కడుపులో వున్నపుడే నేర్చుకొనుట మొదలుపెట్టినారు. ఆమె భుజించిన పదార్థముల రసమును నాభీనాళ ద్వారమున మాత ప్రవేశపెట్టుచున్నప్పుడే ఆంధ్రభాషా జ్ఞానము గూడా దానికి జోడించినది. తరతరముల నుండి మీ రక్తములో జీర్ణమై, మీ మాంసమునకు మాంసమై, శల్యమునకు శల్యమై, మెదటికి మెదడై, మీ తత్వములో ఐక్యమందిన తెలుగుభాషను; మీరిప్పుడు కొత్తగా నేర్చుకొనుట ఏమి?... 'నీవు ఆంగ్లేయభాష ఏల చదువుకొందువు?' అని నేను నిన్ను అధిక్షేపించను. కానీ నీ ఆంగ్ల భాషాజ్ఞానము ఎందుకో ఎరుగుదువా? నీవు సంపాదించిన పరభాషాజ్ఞాన మంతయూ నీ స్వభాషను అభివృద్ధి పరచుకొనుట కొరకే! నీ భాషను భాగ్యవత్తరమును చేయుట కొరకే అని తెలుసుకొనుము"... కాబట్టి మన కోరికను అంటే మన తెలుగును నిర్బంధ పఠనీయముగా చేయువరకూ, మన విద్యాసంఘము వారు మన కోరిక తీర్చువరకూ మనము ఊరుకొందువారము కాదు. నిరంతరము ప్రార్థించు వారము! ఎందుకంటే, నా నోటివద్ద అన్నమును ఎవడయినా ఎగమాటు కొనిపోవ నేను కంటతడి పెట్టువాడను కాను. నేను దున్నుకొని జీవించు పొలమును ఎవడయిన ఆక్రమించిననూ నేను ఏడ్వను. నా ఇంటిలోని సర్వస్వమూ సకాంతా పుత్రకముగ చోరులు హరించిననూ నేనంత దుఃఖించువాడను గాను, కానీ, చేటలో పడి 'క్యావు' మనునది మొదలుకొని, కాటిలో పడువరకూ ఉపయోగించుకొను నా మాతృభాషకు ఆదరణము లేనిచో... అంటూ ఇంక మాట్లాడలేక గొంతు పూడుకుపోగా జంఘాలశాస్త్రి కళ్ళు తుడుచుకున్నాడు.

❖ ❖ ❖

అయ్యా! వందేళ్ళక్రితంనాటి పరిస్థితి ఇది. అప్పుడు మన దేశ భాషల్ని నిర్లక్ష్యం చేసినవారు ఆంగ్లేయులు! ఇప్పుడు మన తెలుగు భాషను నిర్లక్ష్యం చేస్తున్నవారు మన తెలుగువారే! ఆలోచించండి!

"మీరు ఎవరికైనా వారికి అర్థమయ్యే భాషలో చెప్పితే,
అది వారి గుండెలకు ఎక్కుతుంది!
నిజమే కానీ, మీరు వారి భాషలో చెప్పితే మాత్రం అది
వారి గుండెలకు హత్తుకుంటుంది.
-నెల్సన్ మండేలా, దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు


మౌనంలో

(సంచారి రావోళ్ల

తెలుగుజాతి చాలా పెద్దది. చాలా పలుతనం (వైవిధ్యం) కలిగినది. ఇంకా దట్టమైన అడవుల్లోనే ఉంటూ ఆహారాన్ని వెతుక్కొని తినే తెగలూ; కాడును నరికి పోడు సేద్యం చేసి అంతో ఇంతో పండించుకొని తినే తెగలూ; చెరువో దొరువో వాగో వంకో నుయ్యో బాయో దేన్నో ఒకదాన్ని నమ్ముకొని నిలకడ సేద్యం చేసి కనుబడిని (ఉత్పత్తిని) పెంచే కులాలూ; ఆ సేద్దెం చుట్టూ ఎదిగిన కుమ్మరి, కమ్మరి, మేదరి, కమసరి, నేతరి, వడ్డర్లి, ఒడ్డరి, పొల్లరి వంటి పలు చేతి పనుల కుదురులూ; అందరికీ చెమటోడిచి ఊడిగం చేసే చాకలి, మంగలి, కైకలి (కూలీపని) వంటి ఊడియరులూ; కనుబడి పెరిగినాక దానిని అమ్మడానికి దూరతీరాలకు సాగే కవర(గవర), సాతు(సాధు) గుంపులూ; ఉన్నచోటనే అంగడిపెట్టి అమ్మే కోమరులూ(కోమట్లు), మతాన్ని చాటడానికే పుట్టిన దాసరి, జంగమ చీలికలూ; చాటడంతో పాటు పోరుకైనా తెగబడే దొమ్మరి, మల్ల ఇదుపులు; వేడుకను చూపుతూ వేగిరం (గూఢచర్యం) చేసిన అలమరులూ(సంచారులూ), పల్లెలు నగరాలుగా రూపెత్తినాక ఆ నగరాలను కడిగిపోస్తున్న తోమరి గుంపులూ(పారిశుధ్య కార్మికులు) ఇంత పలుతనం మనదేశంలో మరే నుడి జాతిలోనూ లేదు, లేదు, లేదు.

అయితే ఈ గొప్పదనాన్ని చెప్పుకోవడంలో మట్టుకు తెలుగు తెలివిపరులు వెనకడుగులు వేస్తూనే ఉన్నారు. మన పొరుగునుడుల వారు ఆ పనిని ఎప్పుడో మొదలు పెట్టినారు. వారు వెలికి తెస్తున్న బడుగు బతుకులలో ముప్పావు మువ్వీసం తెలుగుబతుకులే. ఇప్పటి కర్నాటకలో అలమరి తెగలపైన చాలా అరయిక (పరిశోధన)జరుగుతున్నది. అందులో వంతుగా ఆ తెగలవారి చేతనే వాళ్ల బతుకుల్ని రాయిస్తున్నారు కొందరు.

ఇదివరకు దొమ్మిదాసరుల బతుకుల్ని విప్పిచెప్పిన 'అలెమారియ అంతరంగ' మన అమ్మనుడిలో 'ఓ సంచారి అంతరంగం' గా వచ్చి, తరువాత పొత్తంగా వెలువడింది. అటువంటిదే మరొకటి 'మౌనదొళగిన మాతు'. ఇప్పటి కర్నాటక తావులో 'సిందోళు' అనే అలమరి (సంచారి) తెగకు చెందిన బతుకుకత ఇది. సిందోళ్లు తెలుగువాళ్లు. ఉత్తరాన బీదరు నుండి దక్షిణాన మైసూరు వరకూ తావుతావుకు ఒక్కొక్కపేరు ఈ కులానికి. దురగమురగి, బుర్రుబుర్రచా, బుర్రమారియరు, బుర్రబుర్ర పోచమ్మ, బుర్రబుర్ర సుంకలమ్మ, ఉరిమియోరు, బుట్టి కూగమ్మ, ఉరువూరెమ్మరు... ఇట్లా ఎన్నో పేర్లు. ఇప్పటి తమిళనాడులో ఉరుమారెమ్మలు, నాయనోళ్ళు, నాయనార్లు, సాట్టయ్ అడికారర్, సాటివారు అనే పేర్లున్నాయి. కేరళలో సాట్టడి, నాయన్మార్ అంటారు. మహారాష్ట్రలో వార్‌వార్ అని పేరు. ఒరిస్సాలో నాథ్‌జోగి, తెలంగాణాంధ్రల్లో కూడా ఎన్నోపేర్లు. వీరగోలుతో ఒంటిని బద్దలుకొట్టుకుంటూ తిరిపెం ఎత్తుకొనే కులం ఇది. దేశంలో ఎక్కడ తిరిగినా ఎక్కడ బతుకుతున్నా అమ్మపలుకైన తెలుగును ఇంకా వదలలేదు వీళ్లు. ఈ కులంలో పుట్టిన రావోళ్ల నాగప్పగారి సొంతకత ఇది. ఇందులో నాగప్పగారు సిందోళ్ల బతుకునంతా రూపుకట్టి మన ముందు ఉంచినారు. కన్నడంలో అచ్చయిన నాగప్పగారి కతను, తెలుగులోకి రంగనాథ రామచంద్రరావు గారు తెచ్చినారు. నెలనెలా తన కతను తన తల్లిపలుకులో పలకడానికి అమ్మనుడి అరుగుమీదకు వస్తున్నారు రావోళ్ల నాగప్పగారు. వారిని చేయిపట్టి పిలుచుకొని వస్తున్నారు రామచంద్రరావు గారు. మన తోడబుట్టుల బతుకుల్ని విందాం. చవిగొందాం. - సంపాదకుడు.



...ళ్ళ నాగప్ప ఆత్మకథ)



నా పేరు నాగప్ప. పేరు ముందు రావోళ్లు చేరుకుంది. రావోళ్ళు అన్నది మా బుడకట్టు పేరు. మా నాన్న పేరు కాటప్ప. అమ్మ పేరు జంబమ్మ. మా అమ్మ మొత్తం పదమూడు మంది పిల్లల తల్లి. అందులో ఆరుమంది పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే చనిపోయారట. ఒక తమ్ముడు మెదడులో కణితి ఏర్పడి చనిపోయాడు. మేము ముగ్గురు అన్నదమ్ములం, ముగ్గురు అక్కలు ఇప్పుడు ఉన్నాం. ఇంటి దేవుడు ఈరనాగమ్మ. జాతి సింధోళ్ళు. సింధోళ్ళు అన్నది ఈ మధ్యన తెలిసి వచ్చింది. అంతకు ముందు దురగి మురగి, ఈర్‌గోల్‌తో (కొరడాతో) కొట్టుకునేవాళ్ళు, దుర్గమ్మను ఆడించేవారు ఇలా మొదలైన పేర్లతో పిలిచేవారు. మాకు ఒక నేల అంటూ లేదు. కులం వల్ల తక్కువ అని ఎవరినైతే చూస్తారో అలాంటివాళ్ళ ఇళ్ళల్లోనూ తిరుపమెత్తుతాం. ఊరి బయట ఏదో ఒక బయలుప్రదేశంలో గుడారం వేసుకుని ఉంటాం. భిక్ష అడగటం అయిందని అనిపిస్తే ముందరి ఊరికి అదే కాయకానికి వెళతాం. మా ఆస్తి అంటే అడుక్కునే బోగాణి ఒకటి, దేవుడి బుట్ట, గంట, ఈర్‌గోల్ (కొరడా), ఒకటిరెండు జోలెలు, గుడారం, వేట కుక్కలు, ఆవులు, ఎద్దులు మేకలు, వలలు ఇంతే. మాతోపాటు మా కుటుంబమూ సంచారంలో ఉంటుంది. ఇది మా కులస్త బతుకుల చిరుపరిచయం.

ఇక నా జీవితంలోని కొన్ని సంగతులనైనా మీకు చెప్పాలని అనిపిస్తోంది. నాకు తెలిసినంత చెబుతాను. చదవటం, రాయటం నాకు రాదు. నేను చెప్పిన విషయాలు ఇప్పుడు ఎక్కువ తక్కువలు అయియుండొచ్చు. నేను చెప్పిన విషయాలకు నా ఆత్మీయులు కుమార్ సార్‌గారు అక్షర రూపం ఇచ్చారు. ఇక నా ముందరి కతను వినండి.

పుట్టుక గురించి

నేను పుట్టింది ఎనుమలదొడ్డిలో ! అది ఆంధ్రప్రదేశ్‌లోని ఆలూరు పక్కనున్న గుడేకల్లు ఎమ్మిగనూరు దగ్గర. పుట్టిన సంవత్సరం తెలియదు. మాలాంటి సంచారులకు సంవత్సరాలు, కాలాలు ఎలా తెలుస్తాయి? నేను పుట్టిన కొన్నేళ్ళకే సిరుగుప్ప గుండా బళ్ళారి తావుకు వచ్చామట. మొదట తెక్కలకోట, కురుగోడు తరువాత కంప్లి వైపు వచ్చామట. నేను కంప్లికి వచ్చినపుడు ఇంకా చిన్నవాడినే. నేను చిన్నవాడిగా ఉన్నప్పుడే అక్కల పెండ్లిండ్లు జరిగిపోయాయి. కంప్లిలో ఇప్పుడు చంద్రకళా టాకీస్ ఉంది కదా. దాని ముందు పెద్ద గుంట ఉండేది. అక్కడంతా ముళ్ల చెట్లే. ఒక చెట్టు కింద మా గుడారం వేశాం. మాలాంటి వాళ్ళవే ఏడెమిది గుడారాలు అక్కడ తలెత్తాయి.

మా ఇంటి ఆస్తి అంటే ఒక దేవుడి బుట్ట, గంట, ఒక కొరడా, అదే అమ్మ పాతబట్టలతో కుట్టిన దేరా (గుడారం), కావడి, కొన్ని వెదురు కర్రలు. అందరికీ బిచ్చ అడుక్కోవటానికి ఒక్కొక్క పాత తట్ట, గిన్నెలు, ఒకటి రెండు జోలెలు.

అందరూ బిచ్చానికి వెళ్ళాలి. కడుపు నింపుకోవాలి. ఒక్కొక్క రోజు కూలీ దొరికినపుడు అక్క, అమ్మ ఇద్దరూ కూలీపనులకు వెళ్ళేవారు. భిక్షాటనకు గుడారాలతోపాటు కుటుంబంతోపాటు ఒక ఊరు నుంచి మరో ఊరుకు వెళ్ళేవాళ్ళం. ఇది మా జీవితం.

ఇలా బిచ్చానికి వెళ్ళడం మొదలుపెట్టిన తరువాత నెమ్మదిగా నేను పెద్దవాడిని కాసాగాను.

అమ్మ వెళ్ళిపోయిన కథ :

నేను ఆరేళ్ళ వయసు వాడిని. అప్పుడు మా ఏడెనిమిది కుటుంబాల వాళ్ళం బళ్ళారికి వచ్చి నెల వున్నాం. బళ్ళారి ఎస్.ఇ. సర్కిల్ దగ్గర కుమారస్వామి గుడి ఉంది కదా ! దానిదగ్గర ఒక పెద్ద రావిచెట్టు ఉంది. ఆ రావిచెట్టు కింద మా వాళ్ళు గుడారాలు వేసుకున్నారు. అందులో మా గుడారమూ ఒకటి.

ఒక రోజు ఉదయం అమ్మ బిచ్చం అడుక్కోవడానికి సిద్ధం అవుతోంది. అమ్మా, నాన్నల మధ్యన మాటకు మాట పెరిగి గొడవ జరిగింది. అమ్మ తాను ఎక్కడైనా వెళ్ళిపోతాను అని చెప్పి వెళ్ళిపోయింది. నా తరువాత అమ్మ మరో ఇద్దరు తమ్ములను కన్నది. వారిలో చిన్న తమ్ముడిని చంకలో ఎత్తుకుని తన జోలెతోపాటు వెళ్ళడానికి తయారైంది. నాకు అమ్మ దగ్గరే చనువు ఎక్కువ. అమ్మను నేను ఎన్నడూ వదిలి వుండేవాడిని కాను. అమ్మ కొంగు పట్టుకుని నేనూ అమ్మ వెనుకే వెళ్ళడానికి నిలబడ్డాను. అప్పుడే మాకు దూరపు బంధువైన వ్యక్తి వచ్చాడు. అతను నాకు మామ అవుతాడు. మా అమ్మకు తమ్ముడవుతాడు.

అ వ్యక్తి అమ్మతో, “అక్కా, యాడికి పోతావు? యాడికి పోతావో చెప్పు” అంటూ పదేపదే అడగటం మొదలుపెట్టాడు.

అమ్మ కురుగోడు వైపు వెళతానని చెప్పింది.

అటు తరువాత ఊళ్ళో బిచ్చం ఎత్తుకుని కురుగోడు బస్సెక్కి క్రాసురోడ్డుకు వెళ్ళాం. కురుగోడంతటా బిచ్చం అడుక్కుని రాత్రి బస్టాండు పక్కన ఉన్న స్కూలు కట్ట మీద పడుకున్నాం. నేనింకా నిద్రపోలేదు. రాత్రి ఏడున్నర అయింటుంది. ఉదయం ఎటువైపు వెళతావు అని అడిగిన వ్యక్తి , అంటే



కన్నడ మూలం :
డా. ఆర్. బి. కుమార్



తెలుగు అనువాదం:
రంగనాథ రామచంద్రరావు

నాకు మామ వరుస అయ్యేటటువంటి వాడు మేము బస చేసిన స్థలానికి వచ్చాడు.

బడి అరుగు మీద అమ్మ నన్ను, నా తమ్ముడిని ఒక పక్కన వేసుకుని పడుకుంది. అమ్మకు మరో పక్కన ఆ వ్యక్తి పడుకున్నాడు. ఇప్పుడు అనిపిస్తుంది. మా అమ్మ అప్పటికే పదమూడు మంది పిల్లల్ని కన్నది. అమ్మకు సగం వయస్సు అయిపోయింది. అలాంటి ఆడదానిలో ఆ వ్యక్తి ఎలాంటి సుఖాన్ని చూశాడో ఏం కథో?

రాత్రి కరిగి తెల్లవారింది. అమ్మ అడుక్కుని రావడానికి తమ్ముడిని చంకలో ఎత్తుకుని నన్ను పిలుచుకునిపోయింది. అడుక్కుని వచ్చిన తరువాత మేము నలుగురం కురుగోడు నుంచి కోళూరు క్రాస్ వైపు వెళ్ళాం. కోళూరు క్రాస్‌లో నిలబడి బళ్ళారి వైపు వెళ్ళే ఓ లారీని మామ చేయి చాపి నిలిపాడు. లారీ డ్రైవర్‌తో నన్ను ఎస్.పి. సర్కిల్ దగ్గర దింపమని, ఇంటికి వెళతాడని చెప్పి డ్రైవర్‌కు డబ్బిచ్చాడు. అమ్మ, "ఏమ్ర కొడక, నువ్వు పోయి మీ అబ్బని, అక్కని పిలిస్కోని గాలెమ్మగుడికి పిలుచుకుని రాండి, మనం మక్కుకున్నామ్ అందుకని ఆడికి రండి, ద్యావరని చేతమ్. మామూ గాలెమ్మ గుడికి వచ్చేస్తాం. నువ్వు పోగకుంటే ఇంక యవరు మీ అబ్బని పిలిచికొస్తారు? నువ్వే పోవాల" అని ఏడుస్తూ నన్ను బుజ్జగించి లారీ ఎక్కమంటోంది. అంతలోనే మామ నన్ను లారీ క్యాబిన్‌లోకి ఎత్తివేశాడు. నాకు లారీ క్యాబిన్ నుంచి దిగటానికి సాధ్యం కాలేదు. లారీ బయలుదేరింది. నాకు ఏడవటం తప్ప మరో దారి కనిపించలేదు.

లారీ డ్రైవర్ బళ్ళారిలోని ఎస్.పి. సర్కిల్ దగ్గర దింపి ఇంటికి పొమ్మని చెప్పి లారీ నడుపుకుని ముందుకు వెళ్ళాడు. నేను నేరుగా గుడారం దగ్గరికి వచ్చాను.

"మీ యమ్మ యాడికి పోయింద్రా?" అని నాన్న అడిగాడు.

"జంబయ్య మామ జతికి అమ్మ పాయ. గాలెమ్మ గుడికి మిమ్మల్ని పిలికోని రావాలంట" అని చెప్పాను.

నాన్నకు అప్పటికే అమ్మ పారిపోయిందని తెలిసిపోయింది. అమ్మను వెదకడానికి మావాళ్ళంతా బయలుదేరారు.

ఇది జరిగిన మూడునాలుగు రోజుల తరువాత అమ్మను వెదికి బళ్ళారికి పట్టుకుని వచ్చారు.

అమ్మను పిల్చుకుని వచ్చిన తరువాత అదే చెట్టు కింద మా వాళ్ళంతా పంచాయితీకి చేశారు. అమ్మను లేవదీసుకుని పోయిన వ్యక్తి ముఖం తప్పించాడు. అమ్మ రెండు చేతులు వీపు వెనక్కి విరిచి కట్టి వేశారు.

మా గుంపులో రాజప్ప, సింగారయ్య అనే ఇద్దరు యజమానులు ఉన్నారు. వాళ్ళు కులపెద్దలు. అమ్మ విచారణ మొదలుపెట్టారు. విచారణ అంటే అమ్మను పట్టుకుని కొట్టడమే. అమ్మను కర్ర తీసుకుని ఇష్టం వచ్చినట్టు కొడుతూ ఉంటే అమ్మ దెబ్బలు భరించలేక ఏడుస్తూ ఉంది. నేను అమ్మ వెనుక నిలబడి, "అమ్మా, అమ్మా" అంటూ ఏడుస్తూ ఉన్నాను. నా తమ్ముళ్ళు మౌనంగా కళ్ళు వెడల్పు చేసుకుని కూర్చున్నారు. అక్కలు, అన్నలు దూరంగా నిలబడ్డారు. వాళ్ళకు చేతులు నొప్పి పుట్టేంత వరకు అమ్మను కొట్టి , అమ్మకు తప్పుదండన వేసి అమ్మా నాన్నలను ఒక్కటి చేశారు. అమ్మకు వేసిన తప్పుదండనను నాన్ననే కట్టాడు. అటు తరువాత పెద్దలకంతా సారాయి తాగించాడు.

మా కులంలో ఇది సాధారణం !

ఈ సంఘటన జరిగిన తరువాత మేము బళ్ళారి వదిలివేశాం.

అక్కయ్యల కథ :

మా పెద్దక్క పెళ్ళి జరిగినపుడు నేనింకా చిన్నపిల్లవాడిని. అయితే అంతా అర్థమయ్యేది. అక్క అప్పటికే పెద్దమనిషి అయింది. సామాన్యంగా మా కులంలో కుర్రవాళ్ళు పెద్దమనిషి అయినవారిని వదిలేవారు కాదు. అయితే అక్కకు పెళ్ళికొడుకును చూడనందుకో ఏమో ఇంకా పెళ్ళి కాలేదు. అక్క బిచ్చానికి వెళ్ళేది. లేదా కూలీ పనులకు వెళ్ళేది. ఇండ్ల నిర్మాణాల దగ్గర సిమెంటు మాలు మోయటం మొదలైన పనులు చేసేది. అలాగే వడ్డెరల దగ్గర కూలీ పనులకు వెళితే సామాన్యంగా సాయంకాలం చీకటిపడేవరకు పనులు చేయించేవారు. అక్క కూలీ పనులకు వెళ్ళి ఆలస్యంగా వస్తే నాన్న ఇంతసేపు ఎక్కడికి పోయావని కొట్టేవాడు. అక్కకు పెళ్ళి నిశ్చయమైంది. అక్కను బళ్ళారిలో గుడారం వేసుకుని వున్న వ్యక్తికి ఇవ్వాలని సంప్రదింపులు జరిగాయి. అక్కకు ఆ వ్యక్తిని పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేనట్టు కనిపిస్తోంది. ఈ సంబంధం వెదికిన వాళ్ళు అదే సింగారప్ప, రాజప్పలు. నాన్న వాళ్ళ మాటను తోసిపుచ్చేవాడు కాదు. అయితే అక్కకు ఈ పెళ్ళి ఇష్టం లేదని చెప్పే ధైర్యం లేదు. అక్క పెళ్ళి జరిగిపోయింది. పెళ్ళయిన రెండు రోజులకు రాజప్ప భార్య అక్కకు సున్నం డబ్బాలోంచి పది రూపాయలు తీసి ఇచ్చి వెళ్ళిపో అని చెబుతోంది. నేను అక్కడే దగ్గరలోనే నిలబడివున్నాను. అక్కకు ఆమె ఎందుకు పది రూపాయలు ఇచ్చింది? ఎందుకు వెళ్ళిపొమ్మని చెబుతోంది అనే అనుమానం నన్ను వేధించింది. ఇది జరిగి, అక్క పారిపోయిందనే వార్త తరువాత తెలిసింది. రాజప్ప భార్య ఎందుకు అక్కకు పదిరూపాయలు ఇచ్చిందో అర్థమైంది. అయితే అప్పటికి అదంతా విప్పి చెప్పగలిగేటంత పెద్దవాణ్ణి కాను నేను.

అక్క కరికల్లు ఈరప్ప అనే వ్యక్తి వెంబడి వెళ్ళిపోయి గాలెమ్మ గుడి దగ్గర ఉంది. నాన్న, అన్నలు వెళ్ళి ఆమెను పిల్చుకుని వచ్చారు. యధావిధిగా పంచాయితీ చేసి దైవానికి తప్పు దండన కట్టి ఆమెను భర్త వెంబడి పంపారు. ఇప్పుడు పిల్లలు, మనుమరాళ్ళతో ఆమె సుఖంగా ఉంది. మిగిలిన ఇద్దరు అక్కల పరిస్థితి కూడా ఇదే. వాళ్ళ మొగుళ్ళు తాగి వచ్చి గొడవ చేసేటప్పుడంతా అక్కలను, 'మీరు ఇలా పారిపోయారు, అలా పారిపోయారు' అని తిడుతూ ఉంటారు.

చిన్నక్క కథ :

మా చిన్నక్కకు పెళ్ళి చేసి పంపాం. అక్క మొగుడు హొసపేటలో అంచన గుడి (అనంతశయన గుడి), ఆంజనేయస్వామి గుడి వెనుక

భాగంలో ఉన్న బయలు తావులో గుడారం వేసుకున్నాము. మా కులస్థులు వేసుకున్న గుడారాలతోపాటు అక్కడ సుడుగాడు సిద్దులు, కిన్నెరజోగులు, డుంగ్రిరాసివాళ్ళు-ఇలా రకరకాల సంచారుల గుడారాలు అక్కడ ఉన్నాయి. అక్కయ్యకు పెళ్ళయినపుడు నాకింకా 14-15 ఏళ్ళు ఉంటాయి. కొత్తగా పెళ్ళి చేశాం. ఆమె వెంట మావాళ్ళు ఎవరూ పోలేదు. ఆమె సంసారంలో సర్దుకునేంత వరకు నాలుగు రోజులు ఉండి రమ్మని నన్ను అక్క వెంట అమ్మ పంపింది. ఇలా అక్క దగ్గర చేరిన నేను అక్క వెంబడి బిచ్చానికి వెళ్ళేవాడిని. అక్క మొగుడు మామ మరో వైపు బిచ్చానికి వెళ్ళేవాడు. గంట వాయిస్తూ, కొరడాతో కొట్టుకుంటూ నేను బిచ్చం అడగాల్సి వస్తే అక్క ఉరుమ వాయించేది. ఇలా అనంతశయనుడి గుడి చుటుపక్కల ఊళ్ళకు బిచ్చానికి వెళ్ళేవాళ్ళం. ఈ విధంగా బిచ్చం అడుక్కుని సాయంకాలానికి ఊరి బయట ఉన్న ఆంజనేయస్వామి గుడి బయలు ప్రదేశానికి వెళ్ళాం.

ఆ రోజు అనంతశయనుడి గుడి నుంచి మా కులం వ్యక్తి ఒకడు మేము దిగిన చోటికి వచ్చాడు. మా అక్కకు అతను మరిది అవుతాడు. ఇక చీకటి పడుతుండగా అక్క నన్ను ఊళ్ళో అడుక్కుని రమ్మని పంపింది. నేను ఒక గిన్నె పట్టుకుని ఊళ్ళోకి వెళ్ళాను. నాకు అప్పటికే కొంచెం కొంచెం విషయాలు అర్థమయ్యేవి. ఊళ్ళోకి అడుక్కోవటానికి వచ్చిన వాడిని మేము బస చేసిన చోటికి తొందరగానే వెళ్ళాను.

అక్కడ అక్కతో ఆ వ్యక్తి ఉండటం చూశాను. అది చూసి నాకు ఎలాగెలాగో అయింది. మా అక్కను విడిపించటానికి ఏం చేయాలో నాకు అర్థం కాలేదు. ఒక్కసారిగా దెయ్యం పట్టినవాడిలా అరుస్తూ నేలమీద పడి దొర్లసాగాను. అలా చేయక మరో దారి కనిపించలేదు. నా పరిస్థితి చూసి అక్క నా దగ్గరికి వచ్చింది. నేను అలాగే గిలాగిలా తన్నుకుంటూ ఉన్నాను. చివరికి అక్క రావటం చూసి నెమ్మదిగా ఊరకయ్యాను. ఆ రోజు నా పరిస్థితి చూసి అక్క భయపడిపోయింది.

మరుసటి రోజు తెల్లవారుతుండగా అనంతశయన గుడి దగ్గరికి వచ్చాం. అక్కడ ఆ రోజు మామ ఒక్కడే ఉండటం చూసి, "మామా. అక్కను ఒక్కదాన్నే యాటికి అంపీయొద్దు" అన్నాను.

అతడు మౌనంగా ఉన్నాడు.

ఆ రోజు సాయంత్రానికే నేను అమ్మానాన్నల దగ్గరికి వచ్చేశాను. బుక్కసాగరంలో జరిగిన సంఘటన అమ్మకు చెప్పాను. అమ్మ, "నువ్వు ఊరికెవుండు. బేరేవాళ్ళకి తెలిస్తే తప్పు అనుకుండారు" అంది. నేను మౌనంగా ఉండిపోయాను. నేను మా ఊరికి వచ్చిన రెండు రోజులకు అక్క మరిదితో మాయమైంది. చివరికి అక్కను వెదికి పట్టుకుని వచ్చారు. మామూలుగా దెబ్బలు, తప్పుదండన విధించారు. మా అక్క భర్తతో కాపురం చేయనని అనసాగింది. చివరికి పెద్దమనుషులంతా చేరి ఆమెను భర్తతో కలిపారు.

సారాయి దీక్ష :

నేను 10-12 ఏళ్ళవాడిగా ఉన్నప్పుడు జరిగిన సంఘటన. అప్పుడు మేము బళ్ళారిలో ఉన్నాం. రోజూ చుట్టుపక్కల పల్లెలకు వెళ్లటం, లేదా సిటిలోనే బిచ్చమడగటం చేసేవాళ్ళం. భిక్షం అడిగిన తరువాత మధ్యాహ్నమంతా ఖాళీగా ఉండేవాళ్ళం. ఆ సమయంలో మేము ఎక్కడికి పోయినా ఎవరూ అడిగేవాళ్ళు లేరు. మాలాంటి వీధి జనాన్ని అడిగేవాళ్ళు ఎవరు? పట్టించుకునేవాళ్ళు ఎవరు? ఇలా ఉన్నప్పుడు మమ్మల్ని ఇతర పనులకు వాడుకునే జనమూ ఉండేవారు. మాకూ ఒకటి రెండు రూపాయలు దొరుకుతాయనే ఆశ. వాళ్ళకూ సులభంగా, రహస్యంగా పని చేయడానికి మాకన్నా మంచి పిల్లలు దొరకటం అరుదు. ఆకారణంగా మమ్మల్ని ఉపయోగించుకునేవారని అనిపిస్తుంది.

ఆ కాలంలో బోయకులానికి చెందిన సుంకప్ప అనే వ్యక్తి ఉండేవాడు. మేము గుడారం వేసుకున్న ప్రదేశానికి దగ్గరే అతని ఇల్లు ఉండేది. ఆయన ఆ కాలంలో బట్టీ సారాయి తయారుచేసేవాడు. బట్టీ సారాను తయారుచేయడానికి నన్ను, నా కులానికి చెందిన మరో ఇద్దరు కుర్రవాళ్ళను పిల్చుకుని వెళ్ళేవాళ్ళు. పెద్ద పెద్ద బానలు, కుండలు మోయటం, నల్లబెల్లం మోయటం, నీళ్ళు తీసుకుని రావటం, ఇలాంటి పనులలో సహాయం చేసేవాళ్ళం. దాంతోపాటు పొయ్యిలో కట్టెపుల్లలు పెట్టి మంట రాజెయ్యడం, కడవలో చల్లని నీళ్ళు పోసేపని చెయ్యాల్సి వచ్చేది. ఒకేసారి మూడు పొయ్యిలను పెట్టి సారాయి తయారు చేసేవాళ్ళు. సారాయిని తయారు చేయటానికి బళ్ళారి కొండ మీదికి వెళ్ళేవాళ్ళం. అప్పుడప్పుడు అబ్కారి శాఖవాళ్ళు దాడి చేసేవారు. సుంకప్ప దాడికై వచ్చే జీపు చూసి పారిపొమ్మని చెప్పేవాడు. మేమంతా తప్పించుకుని పారిపోయేవాళ్ళం.


సారాయి చేయడానికి నల్లబెల్లం, చెట్టు బెరడు, కుళ్ళిన పళ్ళు, ఇంకా ఏమేమో పదార్థాలను వేసి దాని మీద నీళ్ళు పోసి కుళ్ళిపోవడానికి వదిలేవాళ్ళు. ఒక వారం తరువాత మమ్మల్ని పిల్చుకుని పోయి పొయ్యి వెలిగించమనేవారు. మేము ముగ్గురు కుర్రవాళ్ళం మూడు పొయ్యిల ముందు కూర్చుని పొయ్యిలో మంట పెట్టడంతోపాటు, కుండ మీద చల్లటి నీళ్ళు పోసేవాళ్ళం. సుంకప్ప మాత్రం ఆ ప్రదేశానికి రాకుండా దూరంగా నిలబడి ఎవరైనా దాడికి వస్తారేమోనని కాపలా కాసేవాడు. ఇలా ఒక రోజు సారాయి తయారు చేస్తున్న మేము ముగ్గురు కుర్రవాళ్ళల్లో నేను, మరొకడు ఒక్కొక్క చిప్ప సారాయి తాగేశాం.

సారాయి తాగితే ఏమౌతుందో మాకు తెలియదు. సారాయి తాగితే ఏమవుతుందనే కుతూహలం మాత్రం మాకుండేది. ముగ్గురిలో ఒకడు తాగడానికి భయపడి వెనక్కు అడుగు వేశాడు. మేము మరిగిపోతున్న సారాను తాగడం మాత్రం తెలుసు. ఇద్దరం పొయ్యి ముందు స్పృహ తప్పి పడివున్నాం. అదే సమయంలో అబ్కారి దాడి జరిగింది. మాకు స్పృహ లేదు. జీపు కొండ పక్కన ఆగివుండటం కొండమీది నుంచి చూసిన సుంకప్ప సారా తాగని కుర్రవాడి ద్వారా బైక్ ట్యూబ్‌లో సారాయి నింపి పారిపొమ్మని చెప్పాడు. తాగిన మా ఇద్దరినీ రెండు చంకల్లో ఇరికించుకుని మోసుకునిపోయి దూరంగా చెట్టు నీడలో, చెట్టుచాటున పడుకోబెట్టి పరారీ అయ్యాడు. మాకు చీకటి పడే సమయానికి మెలుకువ వచ్చింది. మేము లేచి చూస్తే చెట్టు చాటున పడుకుని ఉన్నాం. కాళ్ళు చేతులు విదిల్చుకుని, లేచి కొండ దిగి గుడారం వైపు నడిచాం.

అదే మొదటిసారి నేను సారాయి తాగటం. మేము సారాయి తాగినందుకు ఎవరూ మమ్మల్ని తిట్టలేదు. అది తప్పు అని నాకు అనిపించనేలేదు. అటు తరువాత తాగడం అలవాటు చేసుకున్నాను.

తరువాత అది తప్పని తెలిసి దాన్ని ఒక అదుపులో పెట్టుకున్నాను.

తరువాయి-- వచ్చే సంచికలో....



-డా॥వేదగిరి రాంబాబు
9391343916

గిడుగు రామమూర్తి పంతులుగారితో 36గంటలు గడిపిన శ్రీపాద



తెలుగుజాతి అంటే శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి ప్రాణం. చివరి రోజుల్లో ఆయనకు పక్షవాతం వస్తే "నా రచనలను కూడా సాపుప్రతి రాసి జాతికి సమర్పించుకోలేని దుస్థితి" అని బాధపడ్డారు. తెలుగుజాతిని అభివృద్ధిపథంలో నడపడానికే రచనలు చేశారు. భాషగురించి అనేక విషయాలు చర్చించడానికి ఆయన గిడుగువారిని కలుసుకోవడానికి పర్లాకిమిడి వెళ్ళారు. అప్పటికే అక్కడి పరిస్థితులు చాలా ఇబ్బందికరంగా ఉన్నాయి. పర్లాకిమిడి, మరికొన్ని తెలుగు గ్రామాలు కొత్తగా ఏర్పడే ఒరియా రాష్ట్రంలోకి చేరకుండా తెలుగు దేశంలోనే ఉండేందుకు గిడుగు పర్లాకిమిడి రాజావారితో కూడా విభేదించారు. రాజా గిడుగువారిని చాలా ఇబ్బంది పెట్టసాగారు. దాంతో గిడుగు తీవ్ర నిరాశకు గురయ్యారు. పర్లాకిమిడి నుంచి వెళ్ళిపోవాలి! ఎక్కడికి? అని రామమూర్తిగారు ఆలోచిస్తున్న రోజుల్లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు పర్లాకిమిడి వెళ్ళి రామమూర్తి పంతులుగారితో 36 గంటలు గడిపారు. ఆయన 10 డిసెంబర్ 1935 ప్రబుద్ధాంధ్రలో రాసుకున్నారిలా -

నవంబరు యిరవై మూడోతేదీ, శనివారం, సాయంత్రం రమారమి యెనిమిది గంటలవేళ, పర్లాకిమిడిలో నేను, రావుసాహెబు శ్రీ గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారి యింటికి వెళ్ళాను. ఇరవైఅయిదోతేదీ, సోమవారం, ఉదయం, అలాగే యెనిమిది గంటలవేళ మళ్ళీ అక్కణ్ణుంచి బయలుదేరాను.

ఈ 36 గంటలకూ నేను వెలకట్టలేను. నా జీవితంలో, యింత వరకూ, నేనిలాంటి సమయం గడిపి యెరగను. ఇకముందు కూడా గడపబోను.

పంతులుగారి కటాక్షవీక్షణం నామీద ప్రసరించినంతసేపూ యేదో అపూర్వ శక్తి వొకటి నాలో జాగరితం అవుతూ వున్నట్టు తోచింది. తెలుగు భాషను గురించిన సమ్యగ్జ్ఞానం నా మెదటిలో సంచితం అవుతూ వున్నట్టు కూడా అనిపించింది.

ఆంధ్రదేశానికి నూత్న సందేశం వెలువడ్డ ఆ గదిలో కూచుని ఉపదేశం చేస్తూ ఉండగా పంతులుగారి దివ్య దర్శనం చేసుకున్నాను. నా జన్మసఫలం అయింది.

నేను వెళ్ళేటప్పటికి, పంతులుగారు టేబిలుముందు కూచుని ఫలహారం చేస్తున్నారు. 'రాజమండ్రినుంచి ఎవరో వచ్చా'రని మాతృశ్రీ అన్నపూర్ణమ్మ గారు మనవి చెయ్యగా వారు, వెనక్కి తిరిగి చూశారు. వెంటనే నేను నమస్కారం చెయ్యగా అందుకున్నారు గాని నన్నానవాలు కట్టలేకపోయారు.

రాజమహేంద్రవరంలో వారికి సన్మానం జరిగాక మళ్ళీ నేనిదే వారి దర్శనం చెయ్యడం.

ఇది యిలాగే జరుగుతుందని నేను చేతిలోనే వుంచుకుని వున్నకార్డు అందించాను. వెంటనే వారు, దభీమని లేచి "అలాగా? చాలా సంతోషం" అంటూ నా భుజం మీద తట్టి, కొంచెం దూరంలో వున్న కుర్చీ తెచ్చి వేసి కూచోమన్నారు. నేనే అది తెచ్చుకోవాలని ప్రయత్నించాను గాని ఆ పులిపంజాలో వున్న కుర్చీని నేను స్వాధీన పరచుకోలేక పోయాను.

నన్ను చూశారు. అప్పటిదాకా ఫలహారం చేస్తూ, వూసిపోవడానికి మూలుగుతూ వున్న పంతులుగారు, గ్రాంథికవాదులలో కొమ్ములు తిరిగిన వారి తప్పుడు రచనల ప్రస్తావన ప్రారంభించారు.

అవి గ్రాంథిక వాదుల అపప్రయోగాలే కాదు, అర్థం లేని ఆక్షేపణలే కాదు, కుట్రలేకాదు, కుత్సితాలే కాదు, అశక్తదుర్జపనలే కాదు – అది అఖండ గోదావరి నిండు ప్రవాహం.

ఈ కారణం వల్ల, తరవాత, పదినిమిషాలలో పూర్తి కావలసిన ఫలహారానికి ముప్పావుగంట పట్టింది.

తరవాత నేను భోజనం చేసి వారితో కూడా మేడమీదకి వెళ్ళాను.

ఆ గదిలో ఒకచోట సవర నిఘంటువు చిత్తులు, ఒకచోట తయారులో ఉన్న సాపులు, ఒకచోట ప్రూఫులు, ఒకచోట నాలుగైదు రోజులుగా వచ్చిన తెనుగు పత్రికలు, ఎదటిగూట్లో అరవం, కన్నడం, మరాఠీ, ఇంగ్లీషు, జర్మనీ, ఫ్రెంచి వగైరా భాషల బృహన్నిఘంటువులు...

వాటి మధ్య, శరీరం అంతా చితక్కొట్టబడ్డ వీరాభిమన్యుడులాగ పడివున్న శబ్దరత్నాకరం.

ఆ గదిలో కార్యస్థానపు లక్షణాల కంటే యుద్ధరంగపు లక్షణాలే ఎక్కువగా ఉన్నాయి.

మళ్ళీ కబుర్లు మొదలయినాయి.

బ్రహ్మశ్రీ మారేపల్లి రామచంద్ర కవిగారి ప్రస్తావన వచ్చింది.

వెంటనే లేచి, పంతులుగారు, నా చెయ్యి పట్టుకుని వసారాలోనికి తీసుకువెళ్ళి గడనుంచీ మీద ఉన్న బండెడు తాటాకు పుస్తకాలూ చూపిస్తూ "కవి గారికి విశాఖపట్నం జిల్లావారు షష్టిపూర్తి మహోత్సవం చెయ్యడం బాగానే వుంది. కాని వారి ఘనతకా గౌరవం చాలదు. వారి పేర, యలమంచిలోను బోర్డు యాజమాన్యం కిందగాని, విశాఖపట్నంలో మునిసిపాలిటీ పెత్తనంలోగానీ వొక పుస్తక భాండాగారం స్థాపించి, రిజిస్టర్ చేయించేటట్టయితే నేనీ తాటాకు పుస్తకాలన్నీ ఆ భాండాగారానికిస్తాను. సీతాపతి యింట్లో లేకపోవడం మీరు చూస్తూనే వున్నారు. విశాఖపట్నం వెళ్ళి నేనా మహోత్సవం కళ్ళారా చూడవలసిన వాణ్ణే కాని ఇల్లు కదలలేని స్థితిలో వున్నాను. మీరు వెడుతున్నారు కనక యీ సంగతి మీ మాటలతో మహాసభలో చెప్పండి"

అని సెలవిచ్చారు.

తరవాత, వారి, యీ సందేశం, నేను విశాఖపట్నంలో మహాసభలో ప్రకటించాను.

అదివరకే నేను, కవిగారు గొప్ప పండితులని యెరుగుదును; కాని పంతులు గారి యీ సందేశం వల్ల నాకు కవిగారి పదవి, మరింత మహోన్నతంగా కనబడింది.

ఇవాళ, తెనుగుదేశంలో, ఆంధ్రపండితుల తారతమ్యం తెలుసుకోవా లంటే, అందుకు రామమూర్తి పంతులు గారి నిర్ణయం వొక్కటే ఆధారం.

తరవాత వీరేశలింగం పంతులుగారి శిలావిగ్రహం సంగతి వచ్చింది. "రేపది రాజమహేంద్రవరంలో మహోత్సవంతో ప్రతిష్టించ బడుతోంది కదా! మీరిలా వచ్చేశా" రేమని పంతులుగా రడిగారు. "ప్రబుద్ధాంధ్ర నన్నింటో వుండనివ్వడంలే" దని రాసి చూపించాను. "ఔనౌను, మీ ప్రచారం సంగతి విన్నాను. ప్రబుద్ధాంధ్ర, సంపాదకుడు నెలకు ఇరవై రోజుల చొప్పున ప్రెస్సుబిల్లూ పేపరు బిల్లూ పూర్తిగా చెల్లకపోతూ వుండడం దేశీయుల గాఢనిద్రకు నిదర్శనం అయితే; ఈ వూళ్ళోమీరు మా యింట్లో బసచేయడం బాగా లేదు, ఏమంటే? అన్ని విధాల మాకీ వూళ్ళో వెలి. ఈ వూరి తాపీపని వాడెవడూ మా యింట్లో పనిచెయ్యడానికి రాడు. వస్తే తరవాత, కంట్రాక్టరూ రాజావారి పోష్యవర్గంలో వారూ వాణ్నిక చేరనివ్వరు. పెంకులివ్వడు. ఇస్తే వాడిక వర్తకం కట్టిపెట్టుకోవాలి. రాజాగారితో సంబంధం వున్న పెద్దమనుష్యు లెవరూ మా యింటికేసి కూడా చూడరు. ఎక్కడేనా కనబడితే దూరంగా తొలగిపోతారు. మాకేగాక మరికొందరికి కూడా ఇలాంటి చిక్కు లున్నాయి. మీరు మరోచోట బసపెట్టుకుంటే పని జరిగివుండు"నని పంతులు గారన్నారు. దానికి నేను "తమ దర్శనం కోసం వచ్చాను. మరేమీ పనిలేదు. వచ్చాను కనుక యిదివరకే తమ ద్వారా చందాదారులై వున్నవారిని చూస్తాను" అని రాసి చూపించాను. పంతులుగారు సంతోషించారు. కాని "మాటలవల్ల పనులు జరుగుతాయా? సరే మరీ. కష్టపడండి. దేశీయులు మీ సేవను గుర్తిస్తారు. కొంతవరకూ గుర్తించి కూడా వున్నారు" అని చెబుతూ మళ్ళీ వీరేశలింగం పంతులుగారి ప్రస్తావన అందుకున్నారు.

"వీరేశలింగం పంతులుగారు పండితులనడానికి వీలులేదు; కాని పండితులే. చెయ్యవలసిన పనులెన్నో చేశారు. వారు చేసిన పనులు మరెవ్వరూ చెయ్యలేక పోయారు కూడానూ. వారు చివరికి, నా వాదం అంగీకరించారు. వెంటనే వారి ఆనందాశ్రమంలో వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం యేర్పరచబడ్డది. దానికి పంతులుగారే అధ్యక్షులు, అప్పటికి వారు ఆంధ్రకవుల చరిత్ర సంస్కరిస్తున్నారు. మద్రాసు ప్రయాణం తొందరలో కూడా వున్నారు. "ఈ పని పూర్తికాగానే నేనీ సమాజం పని శ్రద్ధగా చేస్తా"నని చెబుతూ వారు మద్రాసు వెళ్ళారు. కాని కొద్దిరోజుల్లోనే వారక్కడ కాలం చేశారు. ఈ సంగతులన్నీ తెలుపుతూ శిలా విగ్రహ ప్రతిష్ఠకు ప్రధాన పురుషులైన పెద్దాడ సుందర శివరావు గారికి నేను జాబు రాశాను. వారు దాన్ని ఆ సభలో చదువుతారని నమ్ముతున్నానన్నారు పంతులుగారు.

అప్పటికిరాత్రి పదిగంటలు దాటింది. పంతులుగారింకా మాట్లాడ గలిగేటట్టే వున్నారు. కాని ప్రయాణపు బడలిక వల్ల నా కంతకుముందే నిద్రమత్తు ప్రారంభమయివుంది. అది చూసి, వారు, నాకు, "పడుకో" మని సెలవిచ్చారు.

నవంబరు 24:

సూర్యోదయం అయ్యేటప్పటికే పంతులుగారు కాలకృత్యాలు తీర్చుకొని సిద్ధంగా ఉన్నారు. మరో అరగంటకి నేను తెమిలాను. మాతృశ్రీ గారిచ్చిన కాఫీ పుచ్చుకొని యిద్దరమూ మేడమీదకి వెళ్ళిపోయాము.

పంతులుగారు నన్ను రెండో గదికి తీసుకువెళ్ళి ఉత్తమ ప్రబంధా లున్న బీరువా తెరిచారు. భారతం, భాగవతం... రామాయణం, మను, వసుచరిత్రాదులు, ఏవి తీసినా పరిష్కర్తల తెలివితక్కువ సవరణలు ప్రతీ పేజీలోనూ గుర్తు పెట్టబడి వున్నాయి. కవిసార్వభౌముని శ్రీకృష్ణ భారతం కనబడింది. ఎర్ర పెన్సిలుతో గీటుపెట్టని పంక్తి కనబడలేదు. వావిలాల వాసుదేవశాస్త్రిగారి ఉత్తరరామ చరిత్ర కొత్త కూర్పు కనబడింది. అక్షరం అక్షరానికి గీట్లున్నాయి. ఒకచోట శాస్త్రిగారు "హాని పొసగదు" అని వాడారు. అది చూపించి, నవ్వుతూ "శాస్త్రిగారికి పొసగు ధాతువు అర్థం తెలవదు. దాని ప్రయోగం అసలే తెలవదు. అయినా ఉత్తర రామచరిత్ర తెనిగించారు. అయితే; వారి రచనలో వ్యావహారిక శబ్దాలు కుప్పలుగా వున్నాయి. తెలిసివుండే వారు వాటిని వాడారని నేను చెప్పగల"నన్నారు పంతులుగారు.

వడ్డాది సుబ్బరాయుడుగారి ప్రస్తావన వచ్చింది. "శబ్దరత్నాకరం లేనిదే వారు మాట్లాడ" రని చెబుతూ పంతులుగారు, నన్ను మొదటి గదికి తీసుకు వెళ్ళి శబ్దరత్నాకరం ముందుపడేశారు.

చూస్తిని గదా, బలమైన దారంతో అది గట్టిగా కట్టబడి వుంది. విప్పగా, ఏ అట్టకా అట్ట, ఏ కాగితానికా కాగితమూ విడిపోయి వరసగా మాత్రం వున్నాయి. అందులో తప్పులేని శబ్దం కనబడ్డం చాలా కష్టమయింది. ప్రతీ పేజీలోనూ అచ్చు భాగం కంటే పెన్సిలుతో, రాసిన భాగమే హెచ్చుగా ఉంది. అది మళ్ళీ యథాప్రకారంగా కట్టేస్తూ పంతులుగారిలా చెప్పారు.

ఇద్దరమూ నుంచునే వున్నాం. "తమరు కూచోండి" అని కుర్చీ దగ్గరికి లాగాను; కాని "నుంచుని మాట్లాడడమే నా కలవాటు" అంటూ వారలాగే వుండి మాట్లాడారు.

"ఇటీవల నేను, శబ్దరత్నాకరం మరో ప్రతి కూడా కొని, తెల్ల కాగితాలు చేర్చి బైండు చేయించి వున్నాను. కాని నేను యీ ప్రతిని నా ప్రాణం కంటే ఎక్కువగా కాపాడుకుంటున్నాను. ఒకప్పుడొక సన్నివేశం తటస్థించింది. ఒక సందర్భంలో మరికొన్ని పుస్తకాలతో పాటు ఇది కూడా పట్టుకుని రాజమహేంద్రవరం వెళ్ళాను. అక్కడ డాక్టరు చిలుకూరి నారాయణరావుగారి యింట్లో బస. పని పూర్తి అయ్యాక ఇంటికి వచ్చి చూడగా పెట్టెలో శబ్దరత్నాకరం కనబడలేదు. ప్రయాణం తొందరలో అది అక్కడే వుండిపోయింది. అది లేకపోవడం వల్ల నాకు మతి పోయింది. అంచేత "అది మళ్ళీ నా చేతికి వచ్చేదాకా నేను భోజనం చెయ్య"నని శపథం తాల్చాను. ఈ సంగతి తెలుపుతూ వెంటనే సీతాపతి, నారాయణరావుకి టెలిగ్రామిచ్చాడు. దానికి నారాయణరావు "అవును, అది యిక్కడ కనపడింది. వెంటనే పార్శిలు చేసి పంపేశాను. ఈ పాటికి సగం దారిలో వుంటుంది" అని బదులు తంతి కొట్టాడు. అప్పుడు మా వాళ్ళు బోధించి, బతిమాలగా నేను భోజనం చేశాను. అయితే ఈ పుస్తకం అంటే నాకింత శ్రద్ధ ఎందుకో మీకు తెలుసునా?"

ఇలా అడుగుతూ, పంతులుగారు, మరింత దగ్గరగా వచ్చి తమ రెండు చేతులూ నా భుజాలమీద వేసి వూపుతూ – వొత్తి వొత్తి పలుకుతూ

"మీరు బాగా వినండి. గట్టిగా నమ్మండి. నేనిదివరకు చేసిందిలా వుండనియ్యండి. నేనింకో పనిచెయ్యవలసి ఉంది. అది చెయ్యకుండా నేనీ శరీరం విడిచి పెట్టను. ఇది నా ఇచ్ఛకు వ్యతిరేకంగా జరగదు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు యొక్క స్థితిగతులు మీకు బాగా తెలుసు. జయంతి రామయ్యగారు దాని చిగుళ్ళన్నీ చిదిమేశారు. ఇప్పటికీ చిదిమేస్తూనే ఉన్నారు. అది పూర్తిగా గిడసబారి పోయింది. దానికింక యెదుగు బొదుగులు లేవు. అది యిక చిగుర్చదు. పుయ్యదు. కాయదు, ఫలించదు. ఇక రామయ్యగారు ఆశపెట్టుకున్నదల్లా సూర్యరాయాంధ్ర నిఘంటువు. దేశం కనిపెట్టుకుని వున్నది దాని కోసమే; అయితే అది శబ్దరత్నాకరం మీద ఇంప్రువుమెంటు తప్ప స్వతంత్రం కాదు. సమగ్రం అంతకంటే కాదు. నిర్దుష్టం కానేకాదు. కావడానికి తగిన సన్నివేశాలక్కడ లేనేలేవు. అది అచ్చులో వుందని తెలుస్తోంది. కనక యెప్పటికేనా బయటికి వొస్తుంది. నేను దానికోసం యెదురు చూస్తున్నాను. వచ్చీ రావడంతోటే దాన్ని నేను ముక్కాచెక్కాకింద చితక్కొట్టేస్తాను. అందు కోసమే యీ శబ్దరత్నాకరం యింత జాగ్రత్తగా వుంచాను. దీన్ని అనుసరించి వెడుతుంది కనుక అది, దాన్ని విమర్శించాలంటే దీనిమీద రాసి వుంచిన నోట్సు చాలా అవసరం. తరవాత, దీని పని తీరి పోతుంది. ఇంత పనిచేస్తేగాని కృతకాంధ్రం యొక్క దౌర్బల్యమూ, దౌర్భాగ్యమూ విదేశీయులకు పూర్తిగా బోధపడవు. నిఘంటువు రాయ డానికెలాంటివారు పూనుకోవాలో, వారి హృదయం యెంత విశాల మయినది కావాలో, సంకుచిత భావాలతో పూనుకుంటే అది ఎలాగ నిరర్థకం అయిపోతుందో, జీవద్భాషను విడిచిపెట్టి నిఘంటువు రాయడం యెంత శవాలంకరణమో దేశీయులకు బోధపడడం చాలా అవసరం. యేది జరిగినా యేది జరగకపోయినా నేనిది మాత్రం చేసి తీరతాను, మీరు చూస్తారు."

పంతులుగారీ మాటలుచ్చరించేటప్పుడు వారి ముఖం మీద దివ్యతేజస్సు మెరిసిపోయింది. తరవాత పంతులుగారు కుర్చీలో చేరబడి వొక్క క్షణానికి చిత్తాన్ని సమాహితం చేసుకొన్నారు. ఈ లోపుగా నేను పలకమీద వొక ప్రశ్నరాసి వారి కందించాను.

నా రచనలెంతో వుబలాటంతో చదివే ప్రియమిత్రులు, భావరాజు వెంకట కృష్ణారావు పంతులుగారు నాలుగైదు మార్లు నాకొక సలహా చెప్పి వున్నారు, కాని దాన్ని నేనింతవరకూ అంగీకరింపలేకపోతూనే వచ్చాను, అయితే: ఇటీవల రామమూర్తి పంతులుగారికి రాసి యీ విషయం పరిష్కరించుకోవాలనుకుంటూ – దీని సందర్భంలో కూడా శ్రద్ధ చేయలేకపోయాను.

"రాశాను" / "క్రోసెడు దూరం" / "బాగా వుంది"

"అది చూసి వొకడు" ఇలా రాయడం మంచిది కాదంటారు కృష్ణారావు పంతులుగారు. "వ్రాశాను" "క్రోసెడు దూరం" "బాగా ఉంది" "అది చూసి ఒకడు" అనకూడదా అంటారు వారు. "అసలు వ్యావహారిక భాషను ప్రవేశపెట్టిన రామమూర్తి పంతులుగారు మీరు రాసినట్లు రాస్తారా?" అని కూడా అడిగారు.

రామమూర్తి పంతులుగారికి నేను రాసి చూపించిన విషయం యిదీ. దీని మీద పంతులుగారిలా సెలవిచ్చారు.

సుబ్రహ్మణ్యశాస్త్రి రాసినట్టు రామమూర్తి రాయడు. రామమూర్తి రాసినట్టు సుబ్రహ్మణ్యశాస్త్రి యెందుకు రాయాలీ? కృష్ణారావుగారిని మీరిలా అడగండి. ఇందులో వున్న కిటుకేమిటంటే? నేను రాయమన్నది శిష్ట వ్యావహారికం. శిష్టులందరూ "రాశాను" అంటారు కాని "వ్రాశాను" అనరు. అనకపోతే లోపమున్నూ లేదు, నేను గ్రాంధికంలో పుట్టి పెరిగాను. ఆ వాసన యింకా నన్ను వదలలేదు. పూర్వులు వ్యాఖ్యానాలు వగైరాలలో వాడిన శబ్దాలను వాడడమే నాకలవాటయింది. మీరు శిష్ట వ్యావహారికాన్ని స్వీకరిస్తున్నారు. అది చాలా మంచి పని. నేనలా రాయకపోయినా మిమ్మల్ని ఆక్షేపించను. మీ రచనలలో జాతీయత వుంది. మీరు వాడే శబ్దాల వల్ల ఆ జాతీయత కేమీ భంగం కలగడం లేదు. శిష్ట వ్యవహారంలో వున్న భాష వాడాలి అని మీరు జ్ఞాపకం వుంచుకున్నంత కాలమూ మిమ్మల్ని నేనేమీ ఆక్షేపించను."

ఈ సమాధానం కృష్ణారావు పంతులు గారి కిష్టమవుతుందో కాదో నేను చెప్పలేను కాని నాకు మాత్రం చాలా వుత్సాహం కలిగించింది.

ఈ సమయంలో "వంట అయిం"దని మాతృశ్రీ గారి దగ్గరనుంచి కబురు వచ్చింది. మడికట్టుకుని యిద్దరమూ భోజనాల గదిలోకి వెళ్ళాము.

భోజనానంతరం మళ్ళీ మేడమీదికి వెళ్ళాము. పంతులుగారు ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మనీ వగైరా పాశ్చాత్య గ్రంథాలున్న బీరువా తెరిచారు. అందులో ఉన్నవన్నీ భాషాతత్వశాస్త్రానికీ, వ్యాకరణానికీ, ఆయా వాఙ్మయాల చరిత్రలకూ సంబంధించిన గ్రంథాలు. నేను యధాలాపంగా వొక పుస్తకం తీశాను. విప్పి చూడగా అది ఫ్రెంచిభాషాతత్వశాస్త్రానికి చెందిన గ్రంథం. చాలా విలువయింది. ప్రామాణ్యం కలది కూడాను. అందులో వొక పేజీ అంతటా పెన్సిలుతో పెట్టిన కొంకిర బింకిర గీతలున్నాయి. ఇదేమని నేనడగటానికి ముందే పంతులుగారు వాటిని చూపిస్తూ యిలా చెప్పారు.

"మీరు నా కుమారుడు సూర్యనారాయణ నెరుగుదురు. అతని కుమారుడు– ఏడెనిమిదేళ్ళవాడు – మీరెరుగుదురు. రాజమహేంద్ర వరంలో జరిగిన ఆధునికాంధ్ర సభలో అధ్యక్షులవారి – టేబిలు మీద కూచుని దీక్షితులుగారి లీలాసుందరి కథ చదివాడు. ఏం? బాగా జ్ఞాపకం. వాడు గీశాడు... ఆ గీతలు, నేనోనాడు దీక్షగా వొక పుస్తకం చదువుతున్నాను. పక్కన కూచుని యెప్పుడు తెరిచాడో యిదిచల్లగా గీసేస్తున్నాడు. నేను చూశాటప్పటికొక పేజి నిండిపోయింది. కాస్త ఆలస్యమయితే, మరో పేజీ కూడా అయిపోవును. అయితే నన్ను చూసి, వాడు, తెల్లపోయాడు. ఏం చెయ్యను? పుస్తకం గొప్పది. చేసిన పని కలిసిరాంది. చేసిన వాడు మనవడు. కోపం వచ్చింది. కాని వాత్సల్యంలో లీనం అయిపోయింది. చెయ్యెత్తాను. కాని వేళ్ళు వాడి మంగురులు నవరించాయి. ఇంకెందుకూ? కొట్టలేక పోయాను. గదుమలేకపోయాను. కళ్ళెర్రజేయడం కూడా పడింది కాదు. కాని కొంతసేపటికి గాంభీర్యం తెచ్చిపెట్టుకుని "శ్రద్ధగా చదువుకుంటా నంటే – ఈ పుస్తకం చదవగలిగేటంతవరకూ చదువుతానంటే నిన్నిప్పుడు కొట్టను. ఏం? ఏమంటావు?..." అన్నాను. దీంతో వాడికి ప్రాణాలు కుదుటబడ్డాయి. వెంటనే వాడు చాలా చురుకైన వాడు లేండి. ఉచితా నుచితాలు బాగా తెలిసినవాడవుతాడు. ఏమీ సందేహం లేదు, వెంటనే రెండు చేతులూ జోడించి "చదువుకుంటా" నన్నాడు. నా గాంభీర్యమంతా యేమయిపోయిందో పోయింది. హృదయం ఆనందమయమైంది. వాణ్ణి వక్కమాటు వొళ్ళోకి తీసుకుని హృదయానికదుముకుని "వెళ్ళి ఆడుకో" అన్నాను. వాడికి కూడా భయం పోయి ఉత్సాహం కలిగింది. వెంటనే ఎగురుతూ దుముకుతూ క్రిందికి వెళ్ళిపోయాడు. వాడెప్పుడేనా యీ

బీరువా దగ్గరకు వచ్చినప్పుడు "ఏమండీ నేను చదువుకునే పుస్తకం యిందులో వుందా?" అంటూ వుంటాడు. నాకేమీ సందేహం లేదు. వాడు అంతటివాడవుతాడు."

ఈ మాటలు చెప్పేటప్పుడు పంతులుగారి కళ్ళల్లో ఆనందం సుడి తిరిగిపోయింది.

తరవాత వొక్క అరగంటదాకా ఆ మాటా యీమాటా చెప్పు కున్నాము. ఆ సమయంలో డాక్టరు పోచిరాజు వైకుంఠం పంతులు గారూ, కెంబావి శ్రీనివాసరావు పంతులుగారూ వచ్చారు. నలుగురమూ డాబా మీద కూర్చున్నాము. పంతులుగారు వారికి నా సంగతి స్వయంగా చెప్పారు. నేను రాసిన ప్రేమపాశం సంగతి యెత్తుకుని దానిని గురించి వారితో చాలా ప్రీతితో మాట్లాడారు. మరికొంతసేపటికి పంతుళ్ళ వారిద్దరూ కచేరీలో పనివుండి వెళ్ళిపోయారు. రామమూర్తి పంతులుగారు చెప్పగా వారి వెనకనే నేను వూళ్ళోకి వెళ్ళాను.

నలుగురు యువకులు కొత్తగా చందాదారులయినారు. డాక్టరు పోచిరాజు వైకుంఠం పంతులుగారు ఐదురూపాయలు విరాళం యిచ్చారు. జి. భాస్కరరామచంద్రరావు (ఉలవభద్ర) దొరగారూ, కేంబావి శ్రీనివాసరావు పంతులుగారూ విరాళాలు వాగ్దానం చేసి "వారం పది రోజుల్లో పంపుతా" మన్నారు.

పొద్దు గూకింది. చీకటి పడింది. బసకి వచ్చాను. పంతులుగారు లఘువుగా ఫలహారమూ, నేను భోజనమూ చేశాము.

మళ్ళీ యథాప్రకారంగా మేడమీదకి వెళ్ళాము.

ఎందరో పండితుల ప్రస్తావన వచ్చింది. పంతులుగారు, ఆ పండితుల అపప్రయోగాలు వివరిస్తూ ఎంత విలువయిన పాఠాలో చెప్పారు.

మాటలో మాట. మన తెనుగువారి దేశసేవ ప్రస్తావన వచ్చింది. ఎన్నో సంగతులు వెళ్ళిపోయాయి. ఈ సందర్భంలో పంతులుగారు హృదయవిదారకమైన వొక సంగతి సెలవిచ్చారు.

అది తలుచుకుంటే యిప్పటికీ ఒళ్ళ జలదరిస్తోంది.

ఓఢ్రుల దురాక్రమణ సందర్భంలో మనం చూపిన ఔదాసీన్యం వల్ల - కాంగ్రెస్సు పేర ప్రదర్శించిన చచ్చు ఔదార్యం వల్ల శుద్ధాంధ్ర సోదరీసోదరులు సుమారు మూడులక్షలమంది ఓఢ్ర రాష్ట్రంలోకి లాగివేయబడ్డారు.

దీనివల్ల వచ్చిన ఆపత్తేమిటంటే?

మనతోపాటు మెజారిటీ సౌకర్యాలనుభవించిన మూడులక్షల తెనుగువారు ఓఢ్రుల పంజాలో చిక్కుకుని మైనారిటీలో పడిపోయారు. తద్వారా - యిక్కడ మనకి కూడా అరవల యెదట మైనారిటీ వచ్చింది.

ఇంతేకాదు.

దీనివల్ల మానధనులైన రామమూర్తి పంతులుగారికి, నమ్మి, ప్రాయం అంతా గడిపిన వూళ్ళో పదివేలు పోసి కట్టుకుని యాభైయేళ్ళ నుంచి కాపరం వున్న యింట్లో వుండే యోగం లేకుండా పోతోంది.

సంగతేమిటంటే-

1936వ సంవత్సరం ఏప్రిల్ నెల మొదటి తేదీని పర్లాకిమిడి పట్నం ఓఢ్ర రాష్ట్రంలో చేరిపోతుంది. పంతులుగారు ఓఢ్ర రాష్ట్రీయ పౌరులనిపించుకోవడానికి ఇష్టపడడం లేదు.

వారు సెలవిచ్చిందిదీ.

కొన్ని గడియలలో ఓఢ్ర రాష్ట్రీయచ్ఛాయ అలుముకుంటుందనగా, నేను, పర్లాకిమిడి విడిచి పెట్టి మద్రాసు ప్రెసిడెన్సీలోకి వచ్చేస్తాను. అయితే పర్లాకిమిడి స్టేషనులో రైలెక్కను. పాతపట్నం వెళ్ళి, ఏటిలో స్నానం చేసి, పర్లాకిమిడి మళ్ళీ మద్రాసు ప్రెసిడెన్సీలో చేరితే తప్ప లేకపోతే ఆ వూళ్ళో అడుగు పెట్టనని కంకణం కట్టుకొని రైలెక్కుతాను. అయితే, రైలెక్కి ఏ వూరు వెళ్ళడం? ఈ వృద్ధాప్యంలో నా కెక్కడ సుఖంగా వుంటుందీ? భాషా పరిశ్రమ చేసుకోవడానికి నాకే వూళ్ళో అవకాశాలున్నాయి?"

పంతులుగారు తల వూపుతూ ప్రశ్నార్థకంగా చూశారు.

వెంటనే నేను మా రాజమహేంద్రవరం దయచెయ్యవలసిందని ప్రార్థించాను. "మావూళ్ళో గౌతమి పేరిట పెద్ద పుస్తక భాండాగారం వుంది. మీ కుమారుడుగారు మా వూళ్ళోనే ఉద్యోగంలో వున్నారు. తాను గీతలు గీసిన ఫ్రెంచి పుస్తకం పెద్ద పెరిగాక చదువుతానని మాటిచ్చిన మీ మనుమడు కూడా మా వూళ్ళో వున్నాడు. మీ శిష్యపరమాణువులం మేము కూడా వున్నాము. గోదావరి ఒడ్డు కావాలంటారా, ఇన్నిస్ పేటలో వుండండి. విశాలమైన వీధులతో జనసమర్దం లేని స్థలం కావాలంటారో దానవాయి గుంటలో వుండండి. దీక్షితులు గారు షష్ఠి గడియలూ మమ్మల్ని కనిపెట్టుకునే వుంటారు. గౌతమీ భాండాగారం దగ్గిర కూడా చాలామంది యిళ్ళున్నాయి. మీ యిష్టం. రాజమహేంద్రవరమే మీరు దయచెయ్యాలి" అని నేను మరీ మరీ కోరాను.

పంతులుగారు తల వూపారు. బాగుందన్నారు. ప్రస్తుతం అంత కంటే మంచిది కనపడ్డం లేదని కూడా అన్నారు.

విశాఖపట్నంలో, కవిగారి షష్ఠిపూర్తి మహోత్సవ సభలో వుపన్యసిస్తూ, సభలో కూచుని వున్న డాక్టరు పాలకోడేటి గురుమూర్తి పంతులుగారినీ అగ్రాసనంలో ఉన్న న్యాపతి సుబ్బారావు పంతులుగారినీ సంబోధించి నేనీ సంగతి చెప్పాను.

పంతులుగారి శపథం విన్నప్పుడు నిజంగా నాకు శరీరం అవస్యం అయినట్లయిపోయింది.

ఏమనుకుంటే యేముంది?

తెనుగువాడిప్పుడు భావదాస్యంలో మగ్గిపోయి ఆత్మగౌరవం యెరక్కుండా వున్నాడు. పాము నోట్లో వున్న కప్ప కబళించే దోమగా వున్నాడు.

ఆ రాత్రి నాకు సరిగా నిద్రపట్టలేదు.

మర్నాడు - యిరవై అయిదో తేదీ వుదయం ఎనిమిదిగంటల వేళ పంతులు గారికి పాదాభివందనం చేసి, మాతృశ్రీ గారికి కూడా నమస్కారాలు చెప్పుకుని, ఆ గురుదంపతుల దీవెనలు శిరసావహించి, స్టేషనుకి వచ్చి రైలెక్కాను.

రైలు కూడా నాలాగే మందకొడిగా వుండి ఎనిమిది గంటలకు పర్లాకిమిడిలో బయలుదేరింది. పది కొట్టాక నౌపడా స్టేషను చేరింది.

- అంటూ ప్రబుద్ధాంధ్రలో రాసుకున్నారు.

పర్లాకిమిడి ఒరిస్సా రాష్ట్రంలోకి చేరడానికిముందే గిడుగువారు పర్లాకిమిడిని విడిచి పక్కనే ఉన్న మహేంద్రతనయ నదిలో స్నానంచేసి, తర్పణాలు విడిచి అక్కడనుండి సరాసరి రాజమహేంద్రవరం వచ్చేశారు. అలా అక్కడికి రావడం వెనుక శ్రీపాదవారి ప్రేరణ ప్రధానంగా చెప్పుకోవాలి.

-పి.వి.ఆర్.శివకుమార్
9594996990

ఇక్కడ నేను-ఎక్కడో వాడు

సుమారుగా పదహారేళ్ల తరువాత నాకు 'వలలో' చిక్కాడు మాధవ కుమార్. బజాజ్ కంపెనీలో మేనేజర్‌గా ఔరంగాబాద్‌లో వుంటున్నాట్ట. చాలా సంతోషం కలిగింది అతడి ఉనికి తెలుసుకునేసరికి.

కళాశాలలో యిద్దరం సహాధ్యాయులం. చదువు పూర్తయ్యి ఉద్యోగాలవేటలో పడ్డాక, మిత్రులందరూ తలో దిక్కుకీ ఊరికొకరు, రాష్ట్రానికొక్కరుగా చెల్లాచెదరై పోయారు. దేశాంతరం పట్టిపోయిన అదృష్టవంతులు మరికొందరు!

పుష్కరంపాటు ఉద్యోగంలో నిలదొక్కుకోవటం, పెళ్లి, పిల్లలు... యిత్యాది ఈతి బాధల్తో సంసార సాగరాన్ని యీదటంతో గడిచిపోయాక, యీత కాస్త అలవాటై, ఊపిరి అందటం మొదలయింది. అదిగో అప్పట్నించే మళ్లీ పాత జ్ఞాపకాలూ, మిత్రుల ఊసులు గుర్తుకు రావటం, గతాన్ని తవ్వటం...

ముఖపుస్తకం తిరగేస్తుంటే ఆ పేజీల మధ్య ఎక్కడెక్కడి పాత ముఖాలో సరికొత్తగా పలకరించటం- 'హాయ్... హాయ్'గా ఆమని సాగటం!

అలాగే తగిలాడు ఓరోజు మాధవకుమార్. అట్టే దూరాన కూడా లేడు- నేను తెలంగాణాలో వుంటే వాడు ఔరంగాబాద్!

వాట్సప్‌లో ఉచిత భాషణలు కొనసాగాక మమ్మల్ని కుటుంబ సమేతంగా ఔరంగాబాదుకు రమ్మని ఆహ్వానించాడు. అదేదో లాంఛన ప్రాయంగా కాక, అత్యంత ఆత్మీయంగా బలవంత పెట్టాడు- ఒకటికి నాలుగుసార్లు- ఫోన్లోనే అయినా.

మన దేశపు పర్యాటక స్థలాల్లో అగ్రస్థానంలో వుండే అజంతా, ఎల్లోరాలకి ఆలవాలం కావటాన, ఔరంగాబాద్ దర్శనానికి పిల్లలూ ఉత్సాహం చూపారు. తీర్థానికి తీర్థం స్వార్థానికి స్వార్థం!

దీపావళి పండగలప్పుడు ఔరంగాబాద్ పారిశ్రామిక వాడల్లో వారాంతాలు కలుపుకుని వారంరోజులు శలవులిస్తారనీ, అందువల్ల ఆ సమయంలో వస్తే పండగా కలిసి గడపవచ్చు- చూడవలసిన ప్రదేశాలూ వివరంగా చూసి రావచ్చు తీరిగ్గా- అంటూ ప్రణాళిక కూడా తయారు చేసి పంపాడు మాధవకుమార్.

'బొత్తిగా పరిచయం లేని వాళ్ల యింటికి- మరీ పండగకికూడా ఎలా వెళ్తాం? పండగ వెళ్లినమర్నాడు బయల్దేరి వస్తామని చెప్పండి' అంది రత్నం. అదేమాట కాస్త లౌక్యంగా తెలియజేశాను మాధవకి- "దీపావళి బంధువులతో కలిసి గడపటం ఏళ్ల తరబడి ఆనవాయితీ. కనుక, ఆ మర్నాడే వస్తాం" అంటూ. వాడు నొచ్చుకున్నాడు. ససేమిరా అన్నాడు. "బంధువులతో ప్రతి ఏడూ పండగ జరుపుకుంటున్నారు గనుక, ఈ ఏడు యీ మిత్రుడితో జరుపుకోవచ్చు. మీరు మొగమాట పడుతున్నారని తెలుస్తూనే వుంది. మా దగ్గర మొగమాటానిక్కూడా మొగమాటం వద్దం"టూ గొడవ చేశాడు.

"అంత మనసారా పిలిచే స్నేహితులు మాత్రం ఎవరుంటారు? ఇహ మనం కాదనటం బాగుండదు. పద..." మంటూ లేవదీశాను రత్నాన్ని. పిల్లలు రాజీవ్, సుమనలకీ ఉత్సాహంగా వుంది చాలా రోజుల తర్వాత విహారయాత్రకి బయల్దేరినందుకు.

రైల్వేస్టేషన్‌కి వచ్చి మమ్మల్ని సాదరంగా కలిశారు మాధవకుమార్, అతని భార్య మాధవి. వాళ్ల పిల్లలు శాయి, పల్లవీ కూడా వచ్చారు! అతని ఇనోవాలోనే యింటికి తీసుకు వెళ్లాడు.

అధునాతనంగా నిర్మించబడ్డ గృహసముదాయంలో వుంది మూడు గదుల నివాసం అతనిది. పొందిగ్గా అలంకరించబడి, ఎక్కడి వస్తువు లక్కడ తీర్చిదిద్దినట్లు పెట్టుకున్న ఆ యిల్లు యిల్లాలి అభిరుచికే కాక, పిల్లల క్రమశిక్షణకీ ఋజువుగా వుంది. "ముందుగా ప్రయాణ బడలిక తీర్చుకుని సేదదీరండి. ఈపూట యింట్లోనే కబుర్లు చెప్పుకుంటూ గడిపేద్దాం. మధ్యాహ్నం భోజనాలు చేసి ఊర్లో వున్న విశేషాలు చూడటానికి వెళ్దాం" చెప్పాడు మాధవ.

"మీ యిల్లు కూడా మీ ఫ్యాక్టరీలాగానే ఐ.యస్.ఓ 9001 సర్టిఫైడ్‌లాగా వుందే" ప్రశంసించకుండా వుండలేక పోయాను.

"అంత లేదులే. అసలు కారణం మాకున్న పరమ బద్ధకం! ఏ వస్తువయినా కనబడకపోతే, వెతుక్కునేటందుకు ఓపిక వుండదు. అనుకోగానే కనబడాల్సిందే! అందుకే ఎక్కడి వక్కడ, పనయిపోయిన వెంటనే, సర్దేస్తూ వుంటాం. అంతే" తమాషాగా నవ్వేశాడు అతను.

మాకోసం ఓగది కేటాయించారు. మేం స్నానాలవీ చేసి, తయారయి బయటకు వచ్చేసరికి భోజనాల బల్లమీద వేడి వేడి ఇడ్లీలు,కొబ్బరి పచ్చడి, కారప్పొడి, నెయ్యి..నోరూరిస్తూ...ఎదురుచూస్తూ యింటిల్లపాదీ!

అందరం కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ, కొత్త పోగొట్టుకుంటూ ఫలహారాలు పూర్తి చేశాం. ఆవెనకే కాఫీ, పిల్లలకి పాలూ!

ఆ తర్వాత రత్నం కూడా మాధవితో పాటుగా వంటగదిలోకి నడిచింది. పిల్లలు నలుగురూ పిల్లల గదిలోకి వెళ్లి ఆటలకి పడ్డారు.

నేనూ, మాధవా ముందుగదిలో కబుర్లేసుకున్నాం. కళాశాల కబుర్లూ, ఆతర్వాత ఉద్యోగాల వేటలో ఎదురైన జంతుజాలాలూ, ప్రస్తుతపు ఉద్యోగ విజయాలూ అపజయాలూ... కలబోతలో కాలక్షేపం జరుగుతోంది.

లోపల్నించి కలగాపులగంగా పిల్లల మాటలు చెవిన బడుతున్నాయి. నలుగురూ సమానంగా అరుస్తూ ఆడుకుంటున్నారు. 'పిల్లలెంత త్వరగా కలిసి పోతారో' అనుకున్నాను.

"మీ పిల్లలు చక్కని హిందీ మాట్లాడుతున్నారే ఆంధ్రలో వుంటున్నా" అన్నాడు మాధవ.


"ఆంధ్ర కాదు తెలంగాణా..." నవ్వాను నేను. "హైదరాబాద్ కాస్మోపాలిటన్ కదా. స్కూల్లో అన్ని రాష్ట్రాల పిల్లలూ వుంటారు. అందుకే

అందరూ ఇంగ్లీష్, తప్పితే హిందీలోనే మాట్లాడుకుంటారు. అదే అలవాటుతో ఘర్‌మేభీ...” నవ్వాను గర్వంగా(?) “వీళ్లిద్దరూ హిందీ పరీక్షలు కూడా రాస్తున్నారు- పెద్దవాడు ప్రవేశిక రాస్తాడు- చిన్నది రాష్ట్రభాష!”

మాధవకుమార్ తలూపేడు మెచ్చుకోలుగా. “గుడ్”

“అవును. హిందీ మన జాతీయభాష కదా! నేర్చుకోకపోతే ఎలా? రేపు వీళ్లు పెద్దయాక ఉద్యోగాలకీ, కాపరాలకీ ఏ రాష్ట్రాలలో తేలతారో తెలీదు కదా! అక్కడ భాష సమస్య కాకూడదు మరి” తెలివిగా చెప్పాను.

“అది నిజం. ఇక్కడికి వచ్చిన కొత్తలో మా యిద్దరికీ హిందీగాని, మరాఠీగాని రాదు కదా! చాలా ఇబ్బంది పడ్డాం. పిల్లలంటే యిక్కడే పుట్టి పెరుగుతున్నారు గనక భాష సమస్య కాలేదు. ఇప్పుడు వాళ్ల సమస్య తెలుగు!”



“అదేం... తెలుగు బాగానే మాట్లాడుతున్నారుగా! ఇంతకన్న తెలుగు యిప్పుడు ఆంధ్ర, తెలంగాణా పిల్లలకి కూడా రావడం లేదు” సమర్థనగా అన్నాను. ఇబ్బందిగా కదిలి, వూరుకున్నాడతను.

బోజనాలకి పిలుపు రావటంతో లేచాం.

భోజనాలు కాగానే బయటికి బయల్దేరాం. ముందుగా ‘బీబీకా మక్ బరా’ కి తీసుకు వెళ్లాడు. తాజ్‌మహల్‌ని పోలిన ఆ కట్టడం విశాలమైన ఉద్యాన వనాల మధ్య సుందరంగా వుంది.

తాజ్‌మహల్ ప్రేమికుల చిహ్నంగా ప్రసిద్ధమైతే, బీబీ–కా మక్‌బరా మాతృమూర్తి మీది ప్రేమకు చిహ్నం. ఔరంగజేబు కుమారుడు ఆజంషా, తనతల్లి దిల్‌రస్ బాను బేగం జ్ఞాపకార్థం సుమారు నాలుగు శతాబ్దాల క్రితం నిర్మించిన యీ కట్టడం యీనాటికీ పర్యాటకులని విశేషంగా ఆకర్షిస్తోంది.

బీబీకా మక్‌బరా తర్వాత ఆ దగ్గర్లోనే వున్న ‘పాన్ చక్కీ’కి వెళ్లాం. దర్గాకి వచ్చే భక్తులు, చుట్టుపక్కల వుండే పేదలు పిండి విసురుకునే తిరగలి ఆ పాన్ చక్కీ. సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందలేదని మనం అనుకునే 17వ శతాబ్దంలోనే, ఎక్కడో ఎనిమిది కిలోమీటర్ల దూరాన వున్న హర్సుల్ చెరువు నుంచి భూగర్భ మార్గంలో నీటిని తెచ్చి, ఎత్తు మీంచి, తిరగలిని త్రిప్పే టర్బయిన్ బ్లేడ్లమీద ప్రవహింపజేయటం ద్వారా ఆ పాన్‌చక్కీ నడిపేవారు. ఇప్పటికీ చక్కీ తిరగటం కనబడు తోంది.

చీకటి పడేవేళకి ఊళ్లోనేవున్న ఓ ఉద్యానవనంలో పిల్లల పార్కు కూడా వున్న చోటుకి చేరుకున్నాం. ఓ గంటసేపు అక్కడ గడిపేక, హోటల్లో భోజనాలు కానిచ్చేద్దామన్నాడు మాధవకుమార్.

నేనూ, రత్నం సున్నితంగానే ఆ ప్రతిపాదనను తిరస్కరించాం- “ఇంటికి వెళ్లి అరగంటలో వంట ముగించేస్తాం నేనూ, వదినగారూనూ! రేపట్నించీ

“నన్ను క్షమించు మాధవా! మా పిల్లలకి తెలుగు రాదు. తప్పు వాళ్లది కాదు. వాళ్లకి తెలుగు అవసరం లేదనుకున్న మాది!

పసిపిల్లలు మనం ఏది నేర్పితే అదే నేర్చుకుంటారు. అలాటిది, మనవైపు ఇప్పుడు బళ్లలోనే తెలుగుని కనుమరుగు చేసే విన్యాసాలు కొనసాగుతున్నాయి!

ఇంగ్లీష్ రావాలి, హిందీ రావాలి, ఇంకా... ఇంకా... ఫ్రెంచ్, జర్మనీ... ప్రపంచ భాషలన్నీ రావాలి. తెలుగు మాత్రం అక్కర్లేదు! తెలుగు పుస్తకాలు చదవలేరు. తెలుగు సాహితీ, సంస్కృతీ అక్కర్లేదు. ఇదీ యీనాటి తెలుగునాట వైఖరి!



పగటిపూట బయట తిరుగుతుంటే, ఎలాగూ బయటి హోటళ్లలోనే తినాలి కదా" అంటూ. మాధవి కూడా రత్నానికి వత్తాసు పలకటంతో యింటిముఖం పట్టాం.

మర్నాడు ఉదయమే బయల్దేరి ఎల్లోరా గుహలు చూడటానికి వెళ్లాం. ముందుగా, జ్యోతిర్లింగమైన ఘృష్ణేశ్వరుణ్ణి దర్శించుకుని, పదహారో గుహ చేరుకున్నాం. అది కైలాస మందిరం. చదునైన కొండని పైనుంచి త్రవ్వుతూ రెండస్థులలో ఆ కైలాస మందిరాన్ని చెక్కారు శిల్పశిఖామణులు! ఆ అద్భుత మందిరం ఆనాటి శిల్పుల సాంకేతిక ప్రజ్ఞకీ, కళా వైదుష్యానికీ అఖండ నిదర్శనం. ఆ కైలాస మందిరం ప్రపంచవింతలలో ఒకటి కాకపోవటమే ఒక వింత!!

ఆ తర్వాత మిగతా గుహలనీ, అద్భుత బౌద్ధశిల్పాలనీ దర్శించి, అక్కడే భోజనాలు ముగించుకుని వెనక్కి తిరిగాం. దారిలో దౌలతా బాద్‌కోటను కూడా సందర్శించాం.

దారి పొడుగునా దుకాణాలమీదా, హోర్డింగుల మీదా వున్న హిందీ వ్రాతలన్నీ రాజీవ్, సుమనా అనర్గళంగా చదువుతుంటే మాధవకుమార్, మాధవీ ముచ్చటగా చూస్తుండిపోయారు. "ఎంత బాగా చదువుతున్నారో హిందీ! మా పిల్లలు తెలుగు రాష్ట్రాలకి వచ్చినప్పుడల్లా అక్కడి దుకాణాల మీదా, బస్సుల మీదా వున్న తెలుగు అక్షరాలు అర్థంకాక తెల్లమొహం వేస్తుంటారు" అనేసింది మాధవి.

నామనసులో ఎక్కడో అపరాధ భావం.

ఆరాత్రి అందరం అలిసిపోయి వళ్లెరగని నిద్రపోయాం.

మూడోనాడు లేచినప్పటినించీ నిర్విరామంగా కుంభవృష్టి. ఆరోజు పైథాన్ వెళ్లాలనీ, జయక్వాడీ ఆనకట్ట, ఉద్యానవనం చూడాలనీ వేసుకున్న ప్రణాళిక భగ్నమైంది. ఇంక యింట్లోనే వుండిపోయాం.

"అందరం కలిసి ఏదైనా ఆడుకుందాం. మీ దగ్గర ఏవయినా బోర్డ్‌గేమ్స్ వున్నాయా?" పిల్లల్ని అడిగాను.

"ఓ... రండి, చూపిస్తాం" అన్నారు వాళ్లు. నేనూ, మాధవా పిల్లల గదిలోకి నడిచాం. పిల్లలు హడావిడి పడుతూ, కారమ్ బోర్డ్, ఛెస్‌బోర్డ్, లూడో, బిజినెస్, వైకుంఠపాళీ... యిలా వాళ్ల దగ్గరవున్నవన్నీ బయట పెట్టారు.

"ఇందులో ఏ ఆటా నలుగురికన్న ఎక్కువమంది ఆడలేమే! మనమేమో ఎనిమిది మందిమి" అన్నాను.

"పోనీ అంత్యాక్షరి ఆడదాం–" అంది రత్నం. అందరం సరేనన్నాం.

ఒక్కొక్క పెద్దవాళ్లం ఒక్కొక్క చిన్నవాళ్లతో నాలుగు బాచ్‌లుగా విడిపోయాం. మొదటి అవకాశం రత్నానిది.

"వాతాపి గణపతిం భజే... హం...వాతాపి గణపతిం భజే" అంటూ ప్రారంభించింది.

"అమ్మో... ఇక్కడ కూడా గుడి తెరిచేశావా?" తలపట్టుకుంది సుమన. అంతా గొల్లున నవ్వారు.

ఆట కొనసాగింది. చాలావరకూ హిందీ పాటతో సాగుతోంది. అప్పుడప్పుడు నేనో, రత్నమో ఓ తెలుగుపాట అందుకొంటుంటే పిల్లలు బిక్కమొహం వేస్తున్నారు.

"మమ్మీ ప్లీజ్ నో తెలుగు సాంగ్స్.." అరిచాడు మా రాజీవ్. అవునని వత్తాసు పలికారు మిగతా పిల్లలు. మాధవ కుమార్ కల్పించుకున్నాడు.

"ఎందుకు వద్దురా తెలుగు పాటలు? మీకు రాకపోతే తెలుసు కోవాలి– లేదా కనీసం వినాలి. వద్దనకూడదు. అదే మన భాష"

పిల్లలు నోరు మూసుకున్నారు– అసహనం వాళ్ల ముఖాల్లో కనిపించినా.

ఓ అరగంట ఆట తర్వాత, రత్నం, మాధవీ ఏవో తినుబండారాలు చేస్తామంటూ వంటగదిలోకి వెళ్లారు.

నేను పిల్లల గదిని పరిశీలించటం ప్రారంభించాను. పుస్తకాలూ, ఆటవస్తువులూ పొందిగ్గా అలమరల్లో సర్దివున్నాయి.

"ఇవేమిటీ యీ పుస్తకాలు?" ఓ అలమరలో ప్రత్యేకంగా కనిపించిన పుస్తకాలని చూస్తూ అడిగాను– అవి పాఠ్యపుస్తకాలలాగా కనిపించక.

మాధవ కుమార్ చెప్పాడు– "అది పిల్లల గ్రంథాలయం".

"ఓ... వెరీగుడ్" అంటూ ఆ పుస్తకాలు బయటకు తీశాను. కార్టూన్ పుస్తకాలు, కథల పుస్తకాలు, పిల్లల పత్రికలు, చిన్న చిన్న నవలలు... అన్నీ ఇంగ్లీషువే.

అవికాక, రెండు అరలలో సర్దివున్న తెలుగు పుస్తకాలు కనిపించాయి. ఏనాటివో బైండ్ చేయబడిన చందమామలు, బాపు– ముళ్లపూడి పుస్తకాలు– బుడుగు, కార్టూన్లు– బాలల బొమ్మల రామాయణం, భాగవతం... ఇలా ఎన్నో! నా కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

"మీ పిల్లలు యివి చదువుతారా?" అడిగాను.

"ఇంకాలేదు– కానీ, ఇంకో ఏడాది, రెండేళ్లకైనా చదవాలని నా కోరిక. ప్రస్తుతం బాలశిక్షలో వున్నారు. అక్షరాలు, గుణింతాలు వస్తున్నాయి. రాయటం నేర్పితే క్రమంగా చదవటమూ అలవడు తుందనీ..." నెమ్మదిగా అన్నాడు మాధవ.

"చాలా బాగుంది నీ ప్రయత్నం. మరి పిల్లలు ఉత్సాహం చూపిస్తున్నారా?"

"వాళ్లని ఆ దిశలో వీలయినంత ప్రోత్సహిస్తున్నాను. ఫరవాలేదు, కాదనకుండా నేర్చుకుంటున్నారు. ప్రతినెలా బాలభారతం తెప్పిస్తున్నాను. ఆ కథలవీ చదివి వినిపిస్తాం నేనో, తనో..."

ఒక్క క్షణం ఆగి ఉత్సాహంగా అన్నాడతను–

"ఓపని చేద్దామా?

ఇవాళ వీళ్లకి మీ పిల్లలతో కలిపి తెలుగు డిక్టేషన్ పోటీ పెడదాం. ప్రతి పదానికి ఓ చిన్న బహుమతి! అది కొంత 'మోటివేషన్' అవుతుంది మావాళ్లకి!"

సిగ్గుతో చచ్చిపోయాను నేను.

'ప్రేరణ' ఎవరికి? అతని పిల్లలకా లేక నాపిల్లలకా?!

తెలుగు దేశానికి దూరంగా పరాయి రాష్ట్రంలో వుంటున్నా, భాష మీది మమకారంతో, తన పిల్లలకి తెలుగు నేర్పాలని పరితపిస్తూ, కృషి చేస్తున్న అతనితో–

నా పిల్లలకి పొట్టకోస్తే తెలుగక్షరమ్ముక్కరాదన్న నిష్ఠుర సత్యాన్ని ఎలా చెప్పను? హిందీ, ఇంగ్లీషూ కలిపిన కలగాపులగపు కల్తీ తెలుగు తప్ప స్వచ్ఛమైన భాషలో మాట్లాడితే వెర్రి మొహాలు పెడతారని ఎలా చెప్పను?

ఈ ఊరి హిందీ బోర్డులు అనర్గళంగా చదివే వీళ్లు మావూళ్లో తెలుగు బోర్డులు చదివే పాటి పరిజ్ఞానం కూడా లేని బడుద్ధాయిలని ఎలా చులకన చెయ్యను?

అది 'చులకన' అని అసలు ఈ పిల్లలకి తెలిస్తేగా! కానీ... కానీ... యిదే మంచి అవకాశం. మాతృభాషపై మమకారం కలిగించటానికి ఇదో అవకాశం.

కుండ బద్దలు కొట్టాను.

"నన్ను క్షమించు మాధవా! మా పిల్లలకి తెలుగు రాదు. తప్పు వాళ్లది కాదు. వాళ్లకి తెలుగు అవసరం లేదనుకున్న మాది!

పసిపిల్లలు మనం ఏది నేర్పితే అదే నేర్చుకుంటారు. అలాటిది, మనవైపు ఇప్పుడు బళ్లలోనే తెలుగుని కనుమరుగు చేసే విన్యాసాలు కొనసాగుతున్నాయి!

ఇంగ్లీష్ రావాలి, హిందీ రావాలి, ఇంకా... ఇంకా... ఫ్రెంచ్, జర్మనీ... ప్రపంచ భాషలన్నీ రావాలి. తెలుగు మాత్రం అక్కర్లేదు! తెలుగు పుస్తకాలు చదవలేరు. తెలుగు సాహితీ, సంస్కృతీ అక్కర్లేదు. ఇదీ యీనాటి తెలుగునాట వైఖరి!

నిన్ను చూశాక, నీ పిల్లలకి నువ్వు ఏర్పరచిన గ్రంథాలయం చూశాక నాకు సిగ్గుగా వుంది- నేరం చేశానన్న నిజం తెలుస్తోంది!

పోటీ పెడదాం- తప్పకుండా

పొరుగు రాష్ట్రంలో వున్న తమ సాటి పిల్లలకున్న పాటి తెలుగు పరిజ్ఞానం తమకి లేదన్న చేదునిజం నా పిల్లలకి తెలియాలి. ఆవిధంగానైనా వాళ్లకి కనువిప్పు కలగాలి"

ఆవేశం కాదు- ఆవేదనతో అన్నాను.

"పోనియ్యరా- అందరి ప్రాధాన్యతలూ ఒక్కలా వుండవు. పిల్లల్ని చిన్నబుచ్చటం మంచిపని కాదు" అన్నాడతను.

"కాదు... సీరియస్‌గా అంటున్నాను... చిన్నబుచ్చటం కాదు. నీకేమీ తెలియనట్లు ప్రారంభించు. మావాళ్లు తెల్లమొహం వెయ్యగానే మెత్తగా వివరిద్దాం- మంచిగానే చెబుదాం- కానీ చెబుదాం- వాస్తవం వాళ్లకి తెలియజేద్దాం-

గ్రంథాలయం చూపించే నెపంతో, నెమ్మదిగా తెలుగు పుస్తకాలన్నీ బయట పెట్టు. నెమ్మది నెమ్మదిగా మీ పిల్లల పరిజ్ఞానం ప్రదర్శించు.

మనం ఎవర్నీ నేరుగా విమర్శించబోం. కేవలం, సందర్భవశాత్తు చెప్తున్నట్లుగా మన భాష అవసరం అందం వివరిస్తాం. అంతే!

ఈనాటిపిల్లలు మనకన్నా అనేకరెట్లు చురుకు! మనం అందిస్తే అర్థం చేసుకుంటారు- అల్లుకుపోతారు!"

మాధవకుమార్ అర్థమయినట్లు తలవూపాడు.

నాకూ అర్థమయింది నాకర్తవ్యం. అ

మల్లెతీగ పురస్కారం కోసం కవితలకు ఆహ్వానం


మల్లెతీగ పురస్కారం-2017 కోసం కవితల్ని ఆహ్వానిస్తున్నాం. ప్రధాన పురస్కారం - రు.5,000/-ల నగదుతో గౌరవ సత్కారం, మరో ఐదుగురికి ఆత్మీయ పురస్కారం రు.1,000/-ల నగదుతో సత్కారం వుంటుంది. సామాజికాంశాల్ని స్పృశించే కవితల్ని పంపాలి. అవి ఈ పోటీ కోసం ప్రత్యేకంగా రాసినవై వుండాలి. ఒక్కో కవిత రెండు కాపీలు పంపాలి. కవితతోపాటు రచయిత ఫొటో తప్పనిసరిగా పంపాలి. కవితల్ని నవంబరు 20లోగా కలిమిశ్రీ, మల్లెతీగ సాహిత్యవేదిక, 41-20/3-24, మన్నవవారి వీధి, కృష్ణలంక, విజయవాడ- 520 013 చిరునామాకు పంపాలి. వివరాలకు 92464 15150.

కవిత

గుండెకాయల ఘోష!!

-సద్లపల్లె చిదంబరరెడ్డి
9440073636

మా వుండూరి మన్నూ
ఆడుండే గాలీ నీరూ కలిసి
ఆడతనాలు నిండిన మా
అమ్మ రూప మయ్యింది!!
ఆ తల్లి పేగు తీగలో తెగిన
సన్న జీవ కణం లోని
సీమంత నలుసుని నేను!!
అధికారాల పీఠం గాళ్ళో
దళారీ నోట్ల కట్టల దగుల్బాజీలో
సముసుకురుత మని
యింగిలీషని
సముద్రం గడ్డోళ్ల పాసి పదాల్ని
నా నెత్తి కెత్తితే మోసే
మొద్దు మూగ మనిషిని కాను!!
అమ్మపాల బలాన్నిచ్చే
అసలు సిసలు పల్లె నుడుల్ని
సదువులు నేర్సిన జనాలు మర్సి
సచ్చి.. నిగంటువుల్లో సేరిన
సావు పదాల్ని నేర్సి
అదే తేట తెలుగని
తప్పెట వాయిస్తా వుంటే...!!
ముందర పుట్టిన సెవులకంటే
యనక పుట్టిన కొమ్ములు
శానా పొడువనే సామెత
గురుతు కొస్తా వుంది!!
వొరే అప్పయ్యా! అమ్మయ్యా!!
దుడ్లు పెట్టి కొనుక్కొన్నా సిక్కని
అపురూప అందాల పదాల్ని
అచ్చరాలు రాని అమాయకం జనాలు
దిన్నమూ వుచ్చారణ సేస్తా
వాళ్ల తడి తడి పెదాల మింద
బతికించి భాషకి సేవ సేస్తా వుండారు
వాళ్ల కాళ్లకి మొక్కిః ఆ
బంగారు పదాల్ని యేరి రాతల్లో సేర్సి
భాషా సంపదని పెంపు సేయంది!!
అట్లాంటి అమ్మ భాషే నా శ్వాస!!.. మా
జనాల అందాల యాసే
నా గుండెకాయల ఘోష!!



7. బౌద్ధం- నైతిక భౌతికవాదం

నమ్మకం - మూఢనమ్మకం

బౌద్ధ వైజ్ఞానిక పునాది దాని 'అనాత్మ' వాదమే! ఆ అనాత్మ వాదమే తిరుగులేని వైజ్ఞానిక ప్రపంచ ఆవిష్కరణకి దారి తీసింది. ఆత్మ, పరమాత్మల మాయాజాలం నుండి, స్వర్గ నరకాల మూఢ నమ్మకాల నుండి బౌద్ధాన్ని వేరు చేసిందీ అదే. తార్కిక, తాత్త్విక, సైద్ధాంతిక పునాదుల్ని పాదు కొల్పింది కూడా అదే! అందుకే...బుద్ధునితో పాటు, ఆ తర్వాత వచ్చిన బౌద్ధ గురువులు కూడా నమ్మకాలలో, మూఢనమ్మకాలలో కూరుకు పోకుండా ప్రకృతిని, ప్రపంచాన్ని, విశ్వాన్ని, సమాజాన్ని, అధ్యయనం చేసి, మానవ నాగరికతకీ, సామాజిక వికాసానికీ ముందుండి దారి చూపారు.

బుద్ధుడు కాలామసుత్తంలో చెప్పింది అదే. ఎవరు చెప్పినా నమ్మొద్దు అని. నీ ఆచరణ, ప్రత్యక్షప్రమాణం ద్వారా నీవు పొందిన జ్ఞానాన్ని విశ్వసించు అనేది.

నమ్మడం అంటే ఎవరో చెప్పిన దాన్ని నిజమని నమ్మడం.

"ఫలానా ప్రదేశంలో దున్నపోతులే ఈనతాయిట" అని ఎవరో చెప్తే విన్న వ్యక్తి, ఆ విషయాన్ని మరో వ్యక్తితో-

"దున్నపోతులే ఈనతాయి" అని 'ట'ను తీసేసి సొంత అనుభవంలా చెప్పేస్తాడు. ఇక, ఆ మూడోవాడు, మరొకరితో "దున్నపోతులు ఈనిన దూడల్ని చూశాను" అని ఇంకాస్త స్వానుభవాన్ని పెంచి చెప్పేస్తాడు.

ఇలా ఈ... పిసరంత కొసరంతలు పెరిగి పెరిగి కొండంతలై కూర్చుంటాయి. నమ్మకాలు మూఢ నమ్మకాలై పాతుకు పోతాయి.

మూఢనమ్మకాలు పాతుకు పోవడం ఏదో మన దేశంలో ఒక్కచోటే జరగలేదు. మానవ సమాజాలున్న అన్నిచోట్లా ఉన్నాయి. ఏ సమాజానికి తగ్గ మూఢనమ్మకాలు ఆయా సమాజాలకు ఉన్నాయి.

ఆదిమానవుడే మేలు..

నిజం చెప్పాలంటే ఆధునిక మానవులకి ఉన్నన్ని మూఢనమ్మకాలు ఆదిమ మానవులకు మాత్రం లేవు. ఇది పచ్చి నిజం. నాగరికత పెరిగిన కొద్దీ మూఢనమ్మకాలు పెరుగుతూనే ఉన్నాయి.

రకరకాల వ్యాపార లావాదేవీలు పెరగడం నాగరికతలో ఒక ప్రధానాంశం. వ్యాపారం పెరిగి, వస్తు కొనుగోలుకి వస్తుమార్పిడి విధానం పోయి, విలువల్ని 'డబ్బు'లోకి మార్చాక వ్యాపారాభివృద్ధి, పెద్దపెద్ద అంగలేసుకుంటూ నడచింది. నాగరికత పరుగులు తీసింది.

నాగరికత పెరిగిన కొద్దీ, మానవ సమాజాలు అభివృద్ధి ఐన కొద్దీ- వస్తువుల మీదే కాకుండా మనస్తత్వాల మీద కూడా వ్యాపారం చేయడం మొదలైంది. ఈ మనోవ్యాపారాభివృద్ధికి 'మతం' పెద్ద అండగా నిలబడింది. ఇలా మనుషుల్లో నెలకొన్న మానసిక భ్రమలపై వ్యాపారాలు సాగించేవారు కొందరు తయారైనారు.

ఈ వర్గం కూడా ఆ దేశం, ఈ దేశం, ఆ ప్రాంతం ఈ ప్రాంతం అని కాకుండా, అన్ని చోట్లా తలెత్తి, తమ వ్యాపారాభివృద్ధి కోసం దైవాల్ని, దయ్యాల్ని సృష్టించి, వారి సంపాదన పెంచుకొంది. జ్యోతిషం, చిలకజోస్యాలు, హస్త సాముద్రికం, వాస్తు, న్యూమరాలజీ... ఇలా...దేన్నీ వదలకుండా, ప్రతి వైజ్ఞానిక విషయాన్ని తమ 'వ్యాపార పరిధిలోకి మరల్చుకొంది. ఎప్పటికప్పుడు తాజాదనాన్ని సంతరించుకొంటూ కొత్తకొత్త విధానాల్ని ప్రవేశపెడుతూ నూతన మూఢనమ్మకాల్ని సృష్టిస్తూ పొట్ట నింపుకుంటూనే ఉంది.

నిజం...ఒకసారి ఆలోచిద్దాం.

ఆదిమానవుడికి జ్యోతిషంతో పనిలేదు. ఎందుకంటే అది అసలు తెలియదు.

గుహల్లో జీవించేవారికి వాస్తుతో పనేముంది.

మానవ సమాజం ఖగోళ విజ్ఞానం కోసం అన్వేషించి పరిశోధించి ఎంతో కొంత జ్ఞానం సంపాయించింది. ఆ ఖగోళ విజ్ఞానాన్ని (ఆస్ట్రానమీని) జ్యోతిషం (ఆస్ట్రాలజీ)గా మార్చారు కొందరు. నివాస గృహాలకి మంచీ చెడులు ఆపాదించి పబ్బం గడుపుకుంటున్నారు. పురాతన మానవ సమాజాలకి గ్రహ నక్షత్రాలు, సూర్య చంద్రులు, పగలు రాత్రులు, ఋతువుల మార్పులే తెలుసుగానీ, వాటివల్ల "మంచి చెడ్డ ఫలితాలు" కలుగుతాయనే కల్లబొల్లి మాటలు తెలియవు.

అలాగే నాటిమానవునికి హస్త సాముద్రికం తెలియదు. తర్వాత పుట్టుకొచ్చిన న్యూమరాలజీ కూడా వారికి తెలియనే తెలియదు.

వారికుండే 'నమ్మకాల' పరిధి చాలా తక్కువ.

విజ్ఞానంతో పాటే.... దాన్నీ వ్యాపారంగా మార్చుకొనే దుర్బుద్ధే జనాల్లో అజ్ఞానాన్ని నింపింది.- ఈ అజ్ఞానానికి మరింత బలం చేకూర్చేందుకు దేవుడు, దయ్యం, ఆత్మ, పరమాత్మ, పునర్జన్మ అనే కర్మ సిద్ధాంతాన్ని నిర్మించింది. అందుకే దైవ కేంద్రంగా స్వార్థపరశక్తులు నిర్మించిన ఈ మూఢనమ్మకపు కోటల్ని "అనాత్మ" వాదమే బద్దలు కొట్టింది.

నమ్మకాలకి కారణమైన శబ్దప్రమాణాన్ని, గ్రంథ ప్రమాణాల్ని బౌద్ధం తిరస్కరించిందీ అందుకే-

నిజానికి- "నమ్మకాలు" అనేవి భౌతికంగా ఉండవు. అవి



పంచేంద్రియాలకి అందవు. అవి కేవలం మనస్సునుండి పుట్టినవే! మనస్సులో నివాసం ఏర్పాటు చేసుకున్నవే! అంటే కేవలం భావనలు మాత్రమే! ఈ భావనల్ని భావజాలంగా మార్చేది మతమే! కాబట్టి మతం ఎంత బలంగా ఉంటే ఈ "నమ్మకాలు" అంత బలీయంగా ఉంటాయి– ఇవి ఎంత బలీయంగా ఉంటే దీనిమీద బ్రతికేవారి దోపిడీ అంతే బలీయంగా ఉంటుంది–

నిజానికి – ఈ ప్రపంచంలో ఉండేవి నిజాలే! కాని, ఈ నిజాల్ని చూడకుండా మన జ్ఞానేంద్రియాలకి "నమ్మకాలు" అనే పొరలు అడ్డువస్తాయి. ఎంతగా నంటే... అసలు నిజాల వైపుకేసి మన తల తిప్పనంతగా!–

అంటే... ఈ నమ్మకాలమీద వ్యాపారం చేసే మోసగాళ్ళు వాటిని అంత బలీయంగా ప్రచారం చేస్తారు. – ఇలాంటి వాటిలో ఎన్నింటినో బుద్ధుడు వ్యతిరేకించాడు.

అతి నీచం – మూఢనమ్మకాల వ్యాపారం

అయితే, బుద్ధుడు ఎంతటి భౌతిక వాదో, అంతటి నైతిక వాదికూడా. "ఇదిగో మీరు ఇలాంటి మూఢనమ్మకాల్లో బ్రతుకుతున్నారు. మీరు ఇంతటి మూర్ఖులా! ఇంతటి మూఢులా! ఓరి మూఢుల్లారా! మీలో ఉన్న మూఢత్వాన్ని వీడండి" అని బుద్ధుడు అలా నమ్మే జనాన్ని కించ పరచలేదు. ఎత్తిపొడవలేదు. ఇది ప్రజల దోషం కాదు. నమ్మకాల్ని పెంచి మూఢనమ్మకాలుగా మార్చి, వాటిమీద వ్యాపారం చేసే మోసగాళ్ళ మోసంగానే భావించాడు.

అలాంటి మోసగాళ్ళను ఎదుర్కొన్నాడు. అంతే కాదు– సాధారణ ప్రజలు ఈ మూఢనమ్మకాలకి అలవాటు పడిపోయి– "కొద్దో గొప్పో చదువుకున్న స్వాములవారినో, తాపసుల్నో, సన్యాసుల్నో, భిక్షువుల్నో 'అది ఏమిటి? ఇది ఏమిటి? ఆ దోషం పోవాలంటే ఏం చేయాలి? ఈ మేలు జరగాలంటే ఏంచేయాలి? ఎలా చేయాలి? ఎంత ఖర్చు అవుతుంది?" అని వెంటపడేవారు.

ఇలా వెంటపడే ప్రజల బలహీనతల్ని ఆసరాచేసుకొని బ్రతికేవారు కొందరుండేవారు.

అంటే... మూఢనమ్మకాల మీద వ్యాపారం అంటే ప్రజల బలహీనతల మీదచేసే వ్యాపారం అన్నమాట–

బుద్ధుడు తన ధర్మంలో భాగంగా కొన్ని వ్యాపారాల్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. అదంతా నీచమైన సంపాదనగా ప్రకటించాడు.

వాటిలో 1. సారా వ్యాపారం, 2) ఆయుధాల వ్యాపారం ప్రధానమైనవి. ఈ రెండూ పంచశీలకు భంగం కలిగించేవి. అయితే, "కామదురాచారం" అనేది పంచశీలలో ఒకభాగమే అయినా, కామదురాచారం తప్పు అని చెప్పాడు కానీ, వేశ్యలుగా జీవనం సాగించే స్త్రీల పట్ల ఆయన చులకన భావాన్ని ప్రకటించలేదు. వారికి దోషాన్ని ఆపాదించలేదు. "అది దోపిడి కాదు" అని గుర్తించాడు కాబట్టే ఆ విషయాన్ని సానుభూతిగానే చూశాడు. ఆ స్త్రీల పట్ల సానుభూతి చూపాడు. ఆమ్రపాలి, ప్రకృతి, చించిత మొదలైనవారి కథలే ఇందుకు ఉదాహరణ. వారికి గౌరవాన్ని చూపాడు. వారిని సంస్కరించాడు. కానీ, సారాయి, ఆయుధాల వ్యాపారం హింసకూ, దోపిడీకి కారకాలుగా భావించాడు. అందుకే వాటిమీద నిషేధం విధించాడు.

అయితే– ఇక్కడ మనం గుర్తుంచుకోవాల్సిన అసలు విషయం

ఏమిటంటే- ప్రజల్లో మూఢనమ్మకాల్ని పెంచడం, వాటిమీద సంపాదించడం కూడా సారాయి, ఆయుధాల వ్యాపారం లాంటి అకుశల, అనైతిక సంపాదనగానే బుద్ధుడు ప్రకటించడం.

అలా బ్రతికేవారి జీవనం అనైతిక జీవనంగా చెప్పాడు. భిక్షువులు ప్రజల దగ్గరకు వెళ్ళినప్పుడు, వారు "భంతే! ఈరోజు మంచిదేనా? వ్యవసాయం ఎప్పుడు ప్రారంభించాలి?మా గ్రహబలం ఎలా ఉంది?" ఇలాంటి విషయాలు అడిగినప్పుడు వారి నమ్మకాల్ని ఆసరా చేసుకొని, అవకాశంగా తీసుకుని సంపాదించకూడదు. అలా జీవించడం భిక్షువులకు తగదు" అని తన భిక్షువులకి చాలా గట్టిగా చెప్పాడు.

బ్రహ్మజాల సుత్తం

సుత్తపిటకంలో దీర్ఘనికాయం లోని శీలస్కంధంలో మొదటిదే "బ్రహ్మజాల సుత్తం. ఆ సుత్తంలో "మహాశీలం" అనే విభాగంలో ఇలాంటి మూఢనమ్మకాల వివరాలు ఉన్నాయి. అందులో... 7 భాగాల్లో 154 మూఢనమ్మకాల ప్రస్థావన ఉంది.

1. తేలు, పాములాంటి విషాల విరుగుడికి మంత్రాలు పెట్టడం. గృహవాస్తు, స్థలవాస్తు, మంచి చెడ్డలు చెప్పడం. పక్షుల కూతలు, జంతువుల అరుపుల్ని బట్టి శకునాలు చెప్పడం... ఇలాంటివి 29 రకాల మూఢనమ్మకాల వివరాలు ఈ ఒకటవ భాగంలో ఉన్నాయి.
2. రంగురాళ్ళ ధారణ, రంగువస్త్రాల ధారణ, కత్తులు, బాణాల ఆకారాలు, వాటిధారణ, స్త్రీ పురుషుల ఎత్తులు, ఆకారం, జుట్టురంగు, జుట్టు ఆకారాల గురించి. అలాగే గుర్రాల, పశువుల సుళ్ళు. కోడిపుంజుల జుట్టు, ఈకల తీరు, తోక తీరుల్ని బట్టి గెలుపు ఓటములు చెప్పడం- ఇలాంటివి 27 రకాలు ఈ రెండో విభాగంలో ఉన్నాయి.
3. రాజులు ఏరోజున యుద్ధం మొదలు పెట్టాలి, ఏదిక్కుగా సాగాలి. ఏ కాలం ఏ రాజుకి మంచిది. ఏ రాజు యుద్ధం గెలుస్తాడు. ఎవడు ఓడిపోతాడు- ఇలాంటివి 12 రకాలు.
4. గ్రహాలు, నక్షత్రాలు, తోకచుక్కలు, ఉల్కాపాతాలు, ఉరుములు, పిడుగులకి- సంబంధించిన మంచి చెడుల్ని చెప్పే 24 విషయాలు.
5. వానలు, అతివృష్టి, అనావృష్టి, కరువులు, వరదలు, క్షామాలు, ప్రజల్లో ప్రబలే రోగాలు- వీటిగురించినవి 13.
6. పెళ్ళి నిశ్చయం, విడాకులకు మంచిరోజులు చెప్పడం, చేతబడులు, కీడుకలిగించడం, అద్దంలో చూసి, గ్రుడ్డుమీద అంజనం వేసి, విషయాల్ని చెప్పడం, దయ్యాల్ని వదిలించడం లాంటివి 21.
7. జబ్బులకి మంత్రాలు, పుంసత్వాన్నిపెంచడం, నపుంసకత్వాన్ని కలిగించడం, వశీకరణం- ఇలాంటి విషయాలు 28.

ఈ మొత్తం 154 మూఢనమ్మకాల్ని చెప్పి, వీటితో ప్రజల దగ్గర డబ్బు సంపాదించుకోవడం అనైతిక చర్యగా బుద్ధుడు చెప్పాడు.

జాతక కథల్లో మూఢనమ్మకాల ఖండన

మూఢనమ్మకాలకి చెంపపెట్టులాంటి ఉదంతాలు, జాతక కథలు ఎన్నో ఉన్నాయి- వాటిలో

నక్షత్రబలాలు సరిపోలేదని పెళ్ళిని చెడగొట్టిన ఆడపిల్లవారిని నష్టపరచినది కథ **నక్షత్ర జాతకం**.

పేరుని, పేరు బలాన్ని చూసి మంచి నమ్మకస్తుణ్ణి దూరం చేసుకుని, చివరికి తనతప్పు తెలుసుకున్నరాజుకథ **కాలకణ్ణి జాతకం**.

ఎలుకలు బట్టల్ని కొరికితే కీడుగా భావించి, ఆ బట్టల్ని ఒక బ్రాహ్మణుడు శ్మశానంలో పారేస్తాడు. ఆ బట్టల్ని తీసుకుని బోధిసత్త్వుడు ధరించి, "ఇలాంటి మూఢనమ్మకాలు వద్దు. ఈ శకునాల వల్ల ఏలాంటి ప్రాణహానీ జరగదు" అని నిరూపించే కథే **"మంగళజాతకం"**.

"స్వయానా దేవరాజు వచ్చి "ఈ పండు తిను. సంతానం కలుగుతుంది" అని ఒక పండును ఇస్తే, దాన్ని తిన్న రాణికి సంతానం కలగదు- ఈ విషయాన్ని చెప్పింది **"అబ్బంతర జాతకం"**-

"పునర్జన్మలేదు" అని చెప్పే కథ- **"మహా పింగళ జాతకం"** క్రూరుడైన పింగళకుడు అనే రాజు చనిపోయాక తిరిగి పుడతాడేమో అని దుఃఖిస్తున్న సేవకునితో-

"దడ్డో వాహ సహస్సేహి, సిత్తో ఘట సహేతి సో
పరిక్ఖతా చ సాభూమి, మా భాయి నాగమిస్సతీతి!"

(అతని శరీరాన్ని వేయి కట్టెలతో కాల్చారు. ఆ చితిని వంద కడవల నీళ్ళతో ఆర్పారు. ఆ తర్వాత ఆ బూడిదను తవ్వి పోశారు. - ఇక ఆ పింగళకుడు తిరిగి రాడు. తిరిగి పుట్టడు) అని బోధిసత్త్వుడు చెప్తాడు.

అగ్నిదేవా! ఉన్నావా? లేవా?

ఇక ఈ కథ చూడండి-

వారణాసిలో ఒక బ్రాహ్మణ కుటుంబం ఉంది.వారికి ఒక కుమారుడు కలిగాడు. కొడుకు పుట్టగానే జాతాగ్నిని వెలిగించారు. (అగ్ని ఆరాధకుల సంప్రదాయం ఇది. వారి కుటుంబంలో పుట్టిన ప్రతి పిల్లవాడికీ పుట్టగానే ఒక అగ్నిగుండం వెలిగిస్తారు. దాన్ని నిత్యం రాజేస్తూనే ఉంటారు. అతనికి చేసే ఉపనయనాది సంస్కారాలకన్నీ ఆ అగ్నిగుండం నుండే అగ్నిని తీసుకుంటారు. ఆ వ్యక్తి చనిపోయాక ఆ అగ్నిని తీసుకుపోయే అతని చితిని వెలిగిస్తారు. అప్పుడు ఆ అగ్నిగుండాన్ని ఆర్పేస్తారు. దీన్ని జాతాగ్ని అంటారు)

అతను పెరిగి పెద్దవాడయ్యాడు. పదహారేళ్ళు వచ్చేసరికి తక్షశిలకు పోయి విద్యలన్నీ నేర్చి ఇంటికి వచ్చాడు. అప్పుడు తల్లిదండ్రులు-

"నాయనా! నీకు పదహారేళ్ళు వచ్చాయి.నీవు గృహస్తుగా ఉండి వేదాధ్యయనం చేస్తానంటే వివాహం చేసుకో. లేదా తపస్సు చేసుకుంటూ, అగ్నిని ఆరాధిస్తూ బ్రహ్మలోకం పొందాలంటే అడవికి పోయి అగ్నిని ఆరాధించు" అని చెప్పారు.

ఆ కుమారుడు అడవికే పోయాడు. అక్కడ ఒక పర్ణశాల నిర్మించుకున్నాడు. అగ్ని వేదిక ఏర్పాటు చేసుకున్నాడు. నిత్యం అగ్నిని వెలిగిస్తూ, అగ్ని ఆరాధన చేస్తూ జీవిస్తున్నాడు.

ఒక రోజున ఒక గృహస్తుడు అతనికి ఒక ఆవుని దక్షిణగా ఇచ్చాడు. ఈ ఆవు మాంసంతో అగ్నిదేవుణ్ణి సంతృప్తి పరచాలి అనుకున్నాడు ఆ తాపసి. యాగానికి కావలసిన వస్తువులకోసం దగ్గరలోని గ్రామానికి బయలుదేరాడు. బయలుదేరుతూ ఆ ఆవుని అగ్నివేదిక సమీపంలో కట్టేసి, మంత్రాలు చదివి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన కొంతసేపటికి కొందరు దొంగలు ఆ ఆశ్రమానికి వచ్చారు. అగ్నివేదిక ముందు కట్టేసిన ఆవుని చూశారు. దాన్ని చంపి మంచి మాంసాన్నంతా కడుపారా తిన్నారు. తోక, గిట్టలు, కొమ్ములు అక్కడే పడేసి వెళ్ళిపోయారు.

వారు వెళ్ళిపోయిన చాలా సేపటికి తాపసి వచ్చాడు. అక్కడే పడి ఉన్న తోక, గిట్టలు, కొమ్ముల్ని చూశాడు. విషయం గ్రహించాడు.

ఆ తాపసి మౌనంగా అగ్నివేదిక ముందు కూర్చొని ఆలోచించాడు. వెంటనే లేచి– ఆ తోక, కొమ్ములు, గిట్టల్ని తీసుకుని అగ్నిలో పడేస్తూ–

"ఓ అగ్నిదేవా! ఈ ఆవుని నీకు సమర్పించాను. నీ ఆహారాన్ని నీవే కాపాడుకోలేక పోయావు. ఇక నన్నేం కాపాడగలవు. నీకు మిగిలింది ఇదే! నీకు ఇదే చాలు" అని ఆ అగ్నిని నీరుపోసి ఆర్పేశాడు. యాగం కంటే, అగ్ని కంటే జ్ఞానం గొప్పది అని తెలుసుకుని ఆశ్రమాన్ని వదిలి వెళ్ళిపోయాడు.

– ఇదీ ఆ జాతక కథ. ఇది **నంగుట్ఠ జాతకం.**

మూఢనమ్మకం పరమ శత్రువు

అలాగే హేతువులు కానటువంటి వాస్తు, పంచాంగం, మంత్రత్రాల్ని హేతువులుగా నమ్మి నష్టపోయిన **నందగోపుని కథ** ధమ్మపథం కథల్లో ప్రసిద్ధమైనది. ఈ కథలో....

ద్విట్ ద్విషం యత్ కుర్యాత్ వైరీ వా పునర్వైరిణం
మిథ్యాప్రణిహితం చిత్తం పాపీయాంసమేనం తతః కుర్యాత్

అని ఉంటుంది. అంటే "ఒకరినొకరు ద్వేషించుకునేవారు, ఒకరికొరకు శత్రువులైనవారు చేసుకునే నష్టంకంటే మిథ్యాదృష్టి (మూఢనమ్మకాలు) వల్ల ఎక్కువ నష్టపోతారు" అని.

ఇలాంటి కథలు, మరెన్నో సంఘటనలు బౌద్ధంలో కనిపిస్తాయి–

బుద్ధుడు ఇంత గొప్ప హేతువాద దృక్పథం కలిగిన శాస్త్రీయ వాది.

ఇతరులు చెప్పే అభౌతిక విషయాల్ని మూఢంగా నమ్మవద్దు అని చెప్పిన బుద్ధుని ప్రభావం ఆ తర్వాత ఎందరెందరి మీదో బలీయంగా పనిచేసింది. భౌతిక వాదానికి దారులు తీసింది.

"మూఢః పరప్రత్యయమేయ బుద్ధిః" అంటాడు కాళిదాసు. ఇతరులు చెప్పినదానిమీద ఆధారపడేవాడే మూఢుడు అని దీనర్థం.

"నాయం జనోమే సుఖ దుఃఖహేతుః
న దేవతాత్మ గ్రహకర్మ కాలాః
మనః పరం కారణ ఆమయంతి
సంసార చక్రం పరివర్తయేద్యత్" అంటుంది భాగవతంలోని భిక్షుగీత– మన సుఖ దుఃఖాలకి దేవతలు, దయ్యాలు, గ్రహాలు, కర్మలు, కాలం– ఇవేవీ కారణం కాదు. మన మనస్సే కారణం అని దీనర్థం.

ఇది–

"మనో పుబ్బంగమా ధమ్మా
మనో సేట్ఠా మనో మయా...." అనే ధమ్మపద సూక్తానికి మక్కికి మక్కే.

బౌద్ధం చెప్పిన ప్రతీత్యసముత్పాదం ఒక కార్యకారణ సమూహ వాదం. గతకాల కర్మల్ని సరిచేసుకుంటూ తప్పుల్ని సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలనేది బౌద్ధం చెప్తుంది. ఈ సరిదిద్దుకునే తత్త్వమే అనాత్మవాద అసలైన కార్యాచరణ– ఇది శాస్త్రీయం. బౌద్ధం శాస్త్రీయం. అందుకే ఈ బౌద్ధ నైతిక, భౌతిక అంశాల్ని ఆ తర్వాత ఎన్నో వైదిక సిద్ధాంత వేత్తలు కూడా తీసుకోక తప్పలేదు.

ఇది చూడండి–

"ప్రాక్తనం చైహికం సేతి ద్వివిధం విద్ధి పౌరుషం
ప్రాక్తనో ఆర్ద్రతనేనా అచు పురుషార్ధేన ధీయతే!"

(నిన్న చేసిందే ఇప్పుడూ చేయడం అనే రెండు విధానాలు లేవు. అంటే సంచిత కర్మ ప్రస్తుత కర్మ కానవసరం లేదు. నిన్న చేసిన దానిని సవరించుకొంటూ ఇప్పుడు చేయాలి.... అదే మనుషులు చేయాల్సిన పని.) ఇది **వాశిష్ఠ గీతోపదేశం.**

బౌద్ధం వేసిన బలమైన భౌతికవాద పునాదులకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే!

అలాగని– బుద్ధుణ్ణి కేవలం భౌతిక వాదిగా మనం ముద్రవేయకూడదు. ఆయన సిద్ధాంతానికి శీలం కేంద్రం. నైతికత పునాది. కేవల భౌతిక వాదుల నుండి, చార్వాకుల నుండి, ప్రకృతిహేతువాదుల నుండి ఆయనను వేరుపరచిన అంశం ఇదే.

"దేవుడు లేదు. ఆత్మ లేదు. పాపం లేదు. పుణ్యం లేదు. స్వర్గం లేదు, నరకం లేదు చెడు చేసినా నరకం రాదు. –" అనే వాదాన్ని ఆయన అంగీకరించలేదు. పైన చెప్పిన ఆత్మ, స్వర్గం, నరకం లేవు అనే చెప్పినా మనిషికి నైతిక బలం, శీలబలం, సదాచార బలం ముఖ్యం అని చెప్పాడు–

అందుకే–

బుద్ధుడు నైతిక భౌతిక వాది!

సదాచార చార్వాకుడు!

హిరి ఔత్తోప సంపన్నో.. అంటే.. "చెడును చేయడానికి సిగ్గుపడాలి" అని చెప్పిన శీలగుణ హేతువాది!!

స్నేహ సౌగంధం

–ఎస్. ఆర్. పృథ్వి
9989223245

స్నేహం నిత్య వసంతం
మనిషికి సన్నిహితమై
మనసుకి హితమౌతుంది
రెండు హృదయాల నడుమ వంతెన
దూరపు కొండల మాటున వున్నా
ఆత్మీయుడిని దర్శించగలుగుతుంది
రంగు శ్వేతాంబరమై మెరుస్తుంది
రుచి తేనె మాధుర్యాన్ని మరపిస్తుంది
వాసన మానవతై పరిమళిస్తుంది
ప్రతి మనిషిలోను
స్నేహ పుష్పం వికసించాలి
చీకటి కుహరంలో సైతం
వెన్నెలై విహరిస్తుందది
వ్యవస్థ విలువలను
కాల్చేస్తున్న స్వార్థ జ్వాలలు
స్నేహ పరిమళాల తోటలోకి
చొరబడటం అసాధ్యం
చెలిమి కనుసన్నల్లోంచి
జీవితం ప్రకాశిస్తుంది
స్నేహం తరగని సత్యసంపద
స్నేహం చెరగని శిలాశాసనం
స్నేహం జీవితమంతా
విస్తరించే పారిజాతం!

కవిత

–డా॥మధురాంతకం నరేంద్ర
98662 43659

నేటి తెలుగు నాటకరంగం– కొన్ని ఆలోచనలు

గురజాడ అప్పారావుగారి “కన్యాశుల్కం” తరువాత తెలుగులో గొప్ప నాటకమేదీ రాలేదని విమర్శకులూ, రచయితలూ కొందరు అంటూ వుంటారు. 1909లో కన్యాశుల్కం రెండవ ముద్రణ జరిగిందనుకుంటే ఆ తరువాత యీ దాదాపు శతాబ్దపు కాలంలో గొప్పనాటకాలు రాలేదనడం నిజమేనా? అసలింతకూ ప్రపంచ నాటక రంగమనే చిత్రపటంలో తెలుగు నాటకపు స్థానమెంత? భారతదేశంలోని మిగిలిన భాషల్లో వున్నంత గొప్ప నాటకాలు తెలుగులో లేవా? యీ ప్రశ్నలన్నింటికీ సమాధానాలను వెతుక్కున్నప్పుడు మనకు చాలా ఆసక్తికరమైన అంశాలు బోధపడతాయి.

– బొర్రా గోవర్ధన్
93906 00157

సినిమా వచ్చాక నాటకాల ప్రాధాన్యత బాగా తగ్గిపోయింది. కానీ యితర భాషల్లో మనకంటే మంచి నాటకాలు రావడానికీ, వాటిలో పోటీ పడగలిగిన నాటకాలు మనకు లేక పోవడానికీ కారణాలు అన్వేషించి తెలుసుకోవాలి. ప్రపంచ భాషల స్థాయిలో మన మాతృభాషగూడా సగర్వంగా నిలబడాలంటే అన్ని రంగాల్లోనూ మనం వున్నత ప్రమాణాలను నిలబెట్టగలగాలి.

సరైన భారతీయ సాహిత్య చరిత్ర నిర్మాణం యింతవరకూ జరగక పోవడంతో, సంప్రదాయ భారతనాటకాలైన సంస్కృత నాటకాల కాలమూ, భరతుని ‘నాట్యశాస్త్రం’ వెలువడిన సమయాల గురించి యిప్పటికీ నిర్దుష్టమైన నిర్ణయాలకు రాలేకపోతున్నాము. తొలినాటి భారత సాహిత్య చరిత్ర నిర్మాతలైన పాశ్చాత్యులు వాళ్ళను క్రీస్తు తరువాతి వాళ్లుగా భావిస్తుండగా, భారతీయ సాహిత్యకారులు క్రీస్తు పూర్వపు శతాబ్దాల వారిగా పరిగణిస్తున్నారు.

సంస్కృత నాటకాల ప్రాభవం తగ్గిపోయాక 19వ శతాబ్దంలో సాంస్కృతిక పునరుజ్జీవం వచ్చేవరకూ వివిధ భారతీయ భాషల్లో జానపద కళారూపాలే నాటక అస్తిత్వానికి భూమికలుగా నిలిచాయి. తెలుగు ప్రాంతాల్లో కూడా నృత్యాలూ, బొమ్మలాటలూ, యక్షగానాలూ, పగటివేషాలూ, విప్రవినోదాలూ, తోలు బొమ్మలాటలూ, హరికథలూ, భారతరామాయణగాథల నాధారంగా చేసుకున్న జానపద నాటకాలూ మొదలైన జానపద ప్రదర్శనలే 19వ శతాబ్దపు ప్రారంభం వరకూ ప్రాచుర్యంలో వుండేవి.

19వ శతాబ్దంలో వచ్చిన పద్యనాటకాలు అటు జానపద నాటకాలకూ, యిటు ఆధునిక నాటకాలకూ మధ్య వంతెనల్లా రూపొందాయి. అయితే ఆనాటి పద్యనాటకాలకు (తిరుపతి వేంకట కవుల పాండవోద్యోగ విజయాలు, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి గయోపాఖ్యానము, బలిజేపల్లి లక్ష్మీకాంతకవి సత్యహరిశ్చంద్ర వంటివి) యిప్పటికీ ఆదరణ తగ్గలేదు. పద్యాలను వాడిన “చింతామణి’, ‘వరవిక్రయం’ వంటి నాటకాలు యిప్పటికీ వినబడుతూ వుంటాయి. అయితే పూర్తిగా వచనంలోకి, మరీముఖ్యంగా వ్యావహారిక భాషలోకి వచ్చిన ఆధునిక తెలుగునాటకాలకు అంతటి ప్రాచుర్యం రాకపోవడానికి కారణాలేమిటో తరచి చూడాలి.

నాటకాలకు ముఖ్యంగా కావలసింది రంగస్థలం. అనుకూలమైన రంగస్థలాలుండే నాటక ప్రదర్శనశాలలు (Theatres) అన్ని ప్రముఖ పట్టణాల్లోనూ, యిప్పటికి కూడా, వొకటో రెండో కనిపిస్తూ వుంటాయి. అయితే తొలినాటినుంచీ ఆధునిక తెలుగునాటకానికి ఆలంబనగా వున్నది పరిషత్తులే! శ్రీరామ అప్పారావుగారు తన ‘తెలుగునాటక వికాసమనే పరిశోధనా గ్రంథంలో 1897– 1920ల మధ్యకాలంలో తెలుగు ప్రాంతాల్లో దాదాపు 185 పరిషత్తులుండేవని పేర్కొన్నారు. అప్పటినుంచీ యిప్పటివరకూ కూడా తెలుగునాటకం యిలాగైనా మనగలుగుతున్నందుకు పరిషత్తులూ, పరిషత్తునాటకపోటీలే కారణం.

గురజాడ తర్వాత పేరు ప్రఖ్యాతులున్న గొప్ప తెలుగు నాటక రచయితలందరూ పరిషత్తులకోసమే నాటకాలు రాశారు. పరిషత్తులో దాదాపు 170 వరకూ కోస్తా ప్రాంతంలోనే వుండేవి. యిప్పుడుగూడా పరిషత్తులు గోదావరిజిల్లాలలోనూ, కృష్ణా గుంటూరు జిల్లాలలోనూ మాత్రమే యెక్కువగా వున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో వున్నవి చాలా తక్కువ. ఆధునిక తెలుగునాటకాల రూపకల్పనంతా పరిషత్తుల చేతుల్లోనే జరిగింది.

పద్యనాటకాలనుంచీ వ్యావహారిక భాషా నాటకాలకూ, నాటకాల నుంచీ నాటికలకూ జరిగిన పరిణామాలకంతా పరిషత్తులూ, పరిషత్తుల ప్రేక్షకుల అభిరుచులే కారణం. రెండు గంటలవరకూ సాగే నాటకాల కంటే గంటలో ముగిసే నాటికలే యిప్పుడు ప్రాచుర్యంలో వున్నాయి. నాటికలు దాదాపుగా ఏకాంకికలే! అయితే సౌలభ్యంకోసం పరిషత్తులు నాటికలో రెండుసార్లు లైటు ఆఫ్, మళ్ళీ ఆన్ చేసుకునే అవకాశాన్నిచ్చారు. యీ చట్రంలోనే ఆధునిక నాటికలు కొనసాగుతున్నాయి.

పరిషత్తు నాటకాలను కేవలం వుత్సాహవంతులైన కొందరు వ్యక్తులు మాత్రమే నడుపుతున్నారు. అది వృత్తిగాదు. పైగా నాటక పరిషత్తులు నడపడం బాగా ఖర్చుతో కూడిన పని. తమ స్వంత డబ్బులతో వారి నాటక ప్రదర్శనలకు వాళ్ళు పూనుకుంటున్నారు. అందుకే ఆర్థికంగా సంపన్నమైన 4 జిల్లాలలో మాత్రమే పరిషత్తులు మనగలుగుతున్నాయి. క్రమంగా పరిషత్తులకోసం రాసే నాటకాలకు ప్రత్యేకమైన లక్షణాలు యేర్పడ్డాయి.

సమకాలీన సమాజంలో యేర్పడుతున్న పరిణామాలను యెప్పటి కప్పుడు గుర్తించి, అందరికంటే ముందుగా ఆ విషయాన్ని గురించి నాటకం రాయడమన్నది పరిషత్తుల నాటికలకు వుండవలసిన ముఖ్యమైన లక్షణం. సాధారణంగా పరిషత్తుల ప్రేక్షకులందరూ మధ్య తరగతివాళ్ళు. అలాగే నాటక రచయితలూ, నటులూ కూడా! అందువల్ల పరిషత్తు నాటకాల వస్తువెప్పుడూ మధ్యతరగతి జీవితాలవే అయి వుంటుంది.

రైతుల సమస్యలు, పిల్లల చదువులు, నిరుద్యోగం, ముసలి తల్లిదండ్రులు, ఆర్థిక సంబంధాలు మొదలైనవే నేటి నాటికల వస్తువులు. అంటే యీనాటికలన్నీ విషయ ప్రధానమైనవని అర్థం. (Idological Plays) దాన్ని సహజంగా మలచడానికి రచయితకు జీవితానుభవం బాగా వుండాలి. నిజజీవితంలో పాత్రల్ని తీసుకోగలిగే శక్తి వుండాలి. నాటక యితివృత్తాన్ని సహజంగా మలచగలగాలి.

స్వంత డబ్బులు వెచ్చించి, శ్రమపడి, తమ నాటకాభిలాషను తీర్చుకుంటున్న వ్యక్తులే వుండే ప్రస్తుత తెలుగునాటకరంగంలో వృత్తిగా

జీవిస్తున్నవాళ్ళు స్త్రీపాత్రధారులు మాత్రమే. నాటక ప్రదర్శనకు పూను కుంటున్న స్త్రీలు చాలా తక్కువగావడం యిందుకు కారణం. పరిషత్తు నాటికల పోటీలకు వెళ్ళినప్పుడు వొకే నటి రెండు మూడు నాటకాల్లో పాత్రల్ని పోషించడం గమనించవచ్చు. స్త్రీపాత్రధారులు తక్కువగా వుండటమూ, స్త్రీ పాత్రధారులను తీసుకురావడం ఖర్చుతో కూడిన పనిగావడమూ కారణాలుగా యిప్పటి నాటికలలో రచయితలు వీలయినంత స్త్రీ పాత్రలుండేలా జాగ్రత్తపడుతున్నారు. సాధారణంగా వొకే స్త్రీ పాత్రవుండే నాటకాలే రూపొందిస్తున్నారు. అవసరమైనప్పుడు, తప్పనిసరి అయినప్పుడు మాత్రమే రెండో స్త్రీ పాత్రను తీసుకొస్తున్నారు.

పరిషత్తు నాటకాలకు బాగా ప్రాచుర్యముండే నాలుగు తెలుగు జిల్లాల్లో గూడా యిష్టపడి నాటక ప్రదర్శనలకెళ్లే ప్రేక్షకులు కొందరే వున్నారు. యేదో వొకప్పుడు, యేదో వొకరకంగా రంగస్థలంలో అనుబంధమున్నవాళ్ళు మాత్రమే ప్రదర్శనలకు హాజరవుతున్నారు. వాళ్ళ అభిరుచులు చాలాపాతవి గావడంతో, వాళ్ళకు నచ్చేలా నాటకాలు తయారవుతూ వుండడంతో, యివాల్టి తెలుగునాటి కలలన్నీ పాత వాసనలతోనే వస్తున్నాయి. ప్రస్తుతం వస్తున్న తెలుగునాటికలను పరిషత్తులకోసం, పరిషత్తులకు సంబంధించిన రచయితలే రాస్తున్నారు.

సంప్రదాయసిద్ధమైన పాత రంగస్థలాల్లోనే పరిషత్తునాటకాలు చాలావరకూ ప్రదర్శించబడుతున్నాయి. రంగస్థలాలు లేని చోట్లలో తాత్కాలిక రంగస్థలాలు తయారుచేసుకుంటున్నారు. యీ పరిమితులవల్ల పరిషత్తులకోసం రాసే నాటికల రంగస్థలం దాదాపుగా మధ్యతరగతి యిల్లులానే వుంటుంది. మధ్యతరగతి రైతు యిల్లో, వుద్యోగి యిల్లో అయితే అలంకరణ సులభం గూడా! ప్రతినాటికలోనూ రెండు ద్వారాలూ, రెండు కిటికీలూ, సోఫాసెట్టో, మంచమో, ఫోనో లేకపోతే వ్యవసాయ పరికరాలో– యిలాగే వుంటుంది. లైటు ఆర్పి మళ్లీ ఆన్ చేసుకునే రెండు అవకాశాల్లో పెద్దగా రంగస్థలాన్ని మార్చుకోగలిగే అవకాశం చాలా తక్కువగా వుంటుంది.

వున్న పరిమితులకు లోబడే నాటక రచయితలూ, దర్శకులూ తమ ప్రయోగాలనూ, అభిరుచులనూ దిద్దుకోవడం తప్పదు. షేక్స్పియర్ లాంటి వారు గూడా ఆపని చేయక తప్పలేదు. అయితే ఆరోజుల్లో ఆయనకున్నంత స్వేచ్ఛకూడా యిప్పటి పరిషత్తునాటక రచయితలకు లేదు. బహుమతులకోసమే ప్రదర్శించబడే పరిషత్తు నాటకాలలో తప్పనిసరిగా వో రకమైన విషాద వాతావరణమూ, కంఠస్వరమూ వుండి తీరాలనే నమ్మకం బలపడిపోయి వుంది.

గంటసేపటిలో ముగియాల్సిన నాటికలను తీరికైన ప్రారంభమూ, నెమ్మదిగా సాగే కొనసాగింపూ, తాపీగావచ్చే ముగింపూ వచ్చే అవకాశం లేదు. అందువల్ల చాలా నాటికలు కృత్రిమంగా ముగించబడినట్టుగానూ, అనవసరంగా సాగదీసినట్టుగానూ అనిపిస్తూ వుంటాయి. అలాగే యిటువంటి నాటికల్లో అనేక రసాలను పోషించడమూ కష్టమే! అందుకే యెప్పుడూ విషాదరాగంలోనే పరిషత్తునాటకాలుంటాయి.

గంటసేపు నిడివుండే పరిషత్తు నాటికల్లో జీవితపు బహుళ పార్శ్వాలను చిత్రించడం చాలా కష్టం. సూటిగా, యేకోన్ముఖంగా సాగే కథనంలో రచయిత యెప్పుడైనా ప్రయోగాలు చేస్తే, దాన్ని సహృదయంతో ఆదరించే ప్రేక్షకులు అరుదు.

20వ శతాబ్దపు తొలిరోజుల్లో యింగ్లాండులో కవిత్వాత్మక నాటకాలను పునర్జీవింపజేయడానికి టి.ఎస్. ఎలియట్ వంటి ప్రసిద్ధ రచయితలే పూనుకున్నారు. 16వ శతాబ్దపు కవిత్వాత్మక నాటక సంప్రదాయానికి గండి పడడంతో ఆ తర్వాత దాన్ని పునర్జీవింపజేయడం ఆయనవంటి వారికే సాధ్యం కాలేదు. అయితే భారతదేశంలో ప్రాచీన కవితాత్మక నాటకాలకు జానపదనాటకాలు కొనసాగుతూ వచ్చాయి. అందుకే రవీంద్రనాథటాగూరు బెంగాలు జానపద కళారూపమైన 'జాత్ర' పద్ధతిని వాడుకుంటూనే, పాటలూ, వచనమూ కలగలిసిన గొప్ప కవితాత్మక నాటకాలు రాయగలిగాడు. జానపదనాటకాల సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, గిరీష్ కర్నాడ్ రాసిన ఆధునిక కన్నడ నాటకాలూ విజయవంతమయ్యాయి. ఆధునిక నాటక రీతుల్లో విజయ్ టెండూల్కర్ రాసిన వచన నాటకాలూ ప్రాచుర్యాన్ని పొందాయి. రవీంద్రుడి నాటకాలు యెక్కువగా శాంతినికేతన్ విద్యార్థులే ప్రదర్శించారు. గిరీష్ కర్నాడ్, విజయ్ టెండూల్కర్ నాటకాలను పట్టణప్రాంత విద్యావంతులే ఆదరించారు. అవిగూడా జనసామాన్యానికి దగ్గరవలేదు. సాధారణ ప్రేక్షకుల కోసం గాకుండా, పరిమితమైన పట్టణ వర్గాలతో సంతృప్తి పరచడం చేతనే వాళ్లు పాశ్చాత్య నాటక ధోరణులను భారతీయంగావించే ప్రయత్నం చేయగలిగారు. తెలుగు నాటకరంగంలో అటువంటి అవకాశం దొరకలేదు.

20వ శతాబ్దంలో పాశ్చాత్య నాటకరంగంలో శామ్యూల్ బెకెట్, యూజీన్ఓనీల్, టెన్నెస్సీ విలియమ్స్, ఆల్బీ, ఆర్థర్ మిల్లర్, హెరాల్డ్ వింటర్ వంటివాళ్లు చాలా విజయవంతమైన ప్రయోగాలు చేశారు. వాళ్ల నాటకాలు అటు రంగస్థలంపైనే గాకుండా సినిమాలుగానూ విజయవంతమయ్యాయి. తెలుగు నాటక రచయితలు కొందరు (గొల్లపూడి మారుతీరావుగారి... యెన్నార్ నంది మరో మొహెంజదారో వంటివి) అటువంటి ప్రయోగాలు చేయడానికి ప్రయత్నించారు. అయితే కావలసినంత ఆదరణ లేకపోవటంతో అటువంటి ప్రయోగాలు కొనసాగలేదు.

నాటికల్లో పాత్రోచితమైన భాషకెంతో ప్రాముఖ్యత వుంటుంది. అయితే ఆధునిక తెలుగునాటికల్లో యెక్కువగా 4 జిల్లాల భాషే వుంటుంది. మిగిలిన ప్రాంతాల్లో నాటికల కంత ప్రాచుర్యంలేకపోవడమే కారణం. గణేష్పాత్రో రాసిన కళింగాంధ్ర మాండలికమూ, తపస్సు వంటి నాటకాల్లో రాసిన రాయలసీమ మాండలికాలకు కొనసాగింపులు లేవు.

అమెరికాలో ప్రసిద్ధమైన బ్రాడ్వే నాటకాల్లో సంగీతాత్మకమైన బాలేలే యెక్కువ విజయవంతమవుతున్నాయి. యింగ్లీషు సినిమాల్లో పాటలుండక పోవడమూ, బ్రాడ్వే నాటకాల్లో పాటలూ, నాట్యాలూ వుండడమూ వైచిత్రి. అలాగే తెలుగు సినిమాల్లో నాట్యాలూ, పాటలూ వుండడమూ, యిప్పటి నాటకాల్లో అవి వుండకపోవడమూ యింకో వైచిత్రి. నాటకాన్ని దృశ్యమానం చేయడంలో, మిరుమిట్లు గొలిపేలా మైమరిపింప జేయడంలో (spectacle) నాట్యమూ, సంగీతమూ ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఆధునిక తెలుగు నాటకపు తొలిరోజుల్లో వాటికున్న ప్రాముఖ్యత యిప్పుడు పూర్తిగా మాసిపోవడం కూడా వైచిత్రే!

వొక్కోకాలంలో వొకో ప్రక్రియ ప్రాచుర్యాన్ని పొందుతుంది. వొకప్పుడు పురాణాలూ, తర్వాత ప్రబంధాలూ, నవలలూ, కథలూ... యిలా ప్రాధాన్యతలు మారుతూ వుంటాయి. పఠనీయత తగ్గిపోయిన యిప్పటి కాలంలోగూడా ప్రపంచ సాహిత్యాల్లో ప్రధానమైన ప్రక్రియగా నవలే నిలబడుతోంది. అలాగే సినిమా వచ్చాక నాటకాల ప్రాధాన్యత బాగా తగ్గిపోయింది. కానీ యితర భాషల్లో మనకంటే మంచి నాటకాలు రావడానికీ, వాటిలో పోటీ పడగలిగిన నాటకాలు మనకు లేకపోవడానికీ కారణాలు అన్వేషించి తెలుసుకోవాలి. ప్రపంచ భాషల స్థాయిలో మన మాతృభాషగూడా సగర్వంగా నిలబడాలంటే అన్ని రంగాల్లోనూ మనం వున్నత ప్రమాణాలను నిలబెట్టగలగాలి.

-డా॥వేదగిరి రాంబాబు
9391343916

కథానికల్లో స్త్రీ పాత్రలు-ఇంకా కొన్ని...

'స్త్రీ పాత్రయొక్క ప్రస్థానం -నూరేండ్ల తెలుగు కథ' పెద్దాడ సాయి సూర్య సుబ్బలక్ష్మిగారి వ్యాసం చదివాను. చాలా సమాచారం ఇచ్చారు. మరి కొందర్ని కలుపుకుంటే బాగుంటుందనే ఉద్దేశంతో ఆ వ్యాసానికి కొనసాగింపుగా ఈ వివరాల్నిస్తున్నాను.

మొట్టమొదట నుంచి కూడా ఈ చిన్న వచన ప్రక్రియ ప్రాముఖ్యాన్ని గడిస్తూనే ఉంది.

"తొలితరం కథకులు జీవితాన్ని స్పృశించారు. రెండోతరం కథకులు జీవితాల్ని విశ్లేషించారు. మూడో తరం కథకులు జీవితాన్ని నిర్దేశిస్తున్నారు. కాలంతో పాటు సాహిత్య దృక్పథమూ మారుతూ వస్తోం"దన్న శీలా వీర్రాజుగారి మాటలు అక్షరాలా నిజం.

1848లో 'హితవాది' పత్రికను ప్రారంభించారు ఎడ్మండ్ షార్కె. ఆయన రచయితకూడా. అప్పటి భారతీయస్త్రీల స్థితిగతుల్ని మెరుగు పరచాలనే ఉద్దేశంతో కొన్ని ఆంగ్ల షార్ట్‌స్టోరీస్‌ని తెలుగులోకి అనువదించి, ప్రచురించారు. అలా తెలుగు కథ వస్తుపరంగా ఆధునికతని సంతరించుకోవడం ప్రారంభించింది. అంతేకాదు, మరోవిషయం మనం గమనించాలి. కథ ఆధునికతని సంతరించుకోవడమే స్త్రీలకు మేలు చేయాలని!

ఆంగ్లంలో 'షార్ట్ స్టోరీస్' అంత శక్తివంతంగా, తెలుగులో కథలు ఎందుకు ఉండడం లేదన్న ఆలోచనతో కథా శిల్పాన్ని ఆంగ్లభాషా స్ఫూర్తితో మార్చడానికి దాదాపు 15 సంవత్సరాలు గురజాడ మానసిక సంఘర్షణకి లోనయ్యారు. ఈ విషయాన్ని ఆయన డైరీలు మనకి చెబుతున్నాయి. అంతేకాదు-గిడుగు, శ్రీనివాసయ్యంగార్, ఏట్స్‌ల వ్యావహారిక భాషోద్యమం ఊపందుకోవాలని, భాషని మార్చడానికి సాహిత్యమే మంచి సాధనమని భావించిన గురజాడ 1910లో ఆధునిక కథ, గేయం, కవిత్వాలకు శ్రీకారం చుట్టారు. ఆధునిక నాటకం కన్యాశుల్కం రాసిన తర్వాత విజయనగర సంస్థ పెద్దదావా, ఆ తర్వాత కన్యాశుల్కం పునర్ముద్రణ పూర్తయ్యేసరికి 1909 అయింది. అప్పుడాయనదృష్టి వ్యావహారిక భాషోద్యమం వైపు మళ్ళింది.

1910 ఫిబ్రవరి సంచికలోనే క్లుప్తత, స్పష్టతని పాటిస్తూ అంతకు ముందున్న గ్రాంధిక భాష నుంచి మాట్లాడుకునే భాషలోకి తిరగరాసిన 'దిద్దుబాటు' ముందు ప్రచురితమైంది. ఏకాంశం, కథాకాలం ఏక కాలంలో సాగడం కూడా మనం గమనించవచ్చు. మూడు పుటలు మాత్రమే పరిమాణం.

'తలుపు... తలుపు...' తలుపు తెరవలేదు. .. అంటూ హఠాత్తుగా మధ్యలో ప్రారంభమవుతుంది కథ. ఇతివృత్తాన్ని హఠాత్తుగా వృత్తం మధ్యలో ఎక్కడో ప్రారంభించడంతో పాఠకులలో ఒక విధమైన ఉత్సుకతని కలిగించడానికి వీలవుతుంది. ఏమిటదో తెలుసుకోవాలనే ఉబలాటంతో చదవడం ప్రారంభిస్తారు. పాఠకుల్ని అయోమయంలో పెట్టకుండా ఏకాంశంతో కథ సాగుతుంది. ముగింపు ఊహించని విధంగా ఉంటుంది. గోపాల్రావు బుద్ధి వచ్చిందని చెంపలు వేసుకోవడంతో భార్య కమలిని మంచం క్రింద నుంచి కిలకిలా నవ్వుతూ బయటకు వస్తుంది.

వృత్తం పూర్తవాలంటే ముగింపు, ప్రారంభాన్ని కలవాలి. అప్పుడే ఇతివృత్తం పూర్తయినట్లు!

తను వేశ్యల చుట్టూ తిరుగుతుండడంతో విసుగెత్తిన భార్య పుట్టింటికి వెళ్ళిపోయిందని భయపడతాడు. నౌకరు రాముడితో అతని సంవివాదం అతని భయాన్ని మరింత పెంచి కథని పతాకస్థాయికి తీసుకు వస్తుంది.

నౌకరు రాముడుతో పాత్రోచిత మాండలికాన్ని పండించడమే కాకుండా, అమాయకత్వంతో యజమాని మీద వ్యంగ్యాస్త్రాలని వదిలి హాస్యాన్ని పండింపచేస్తాడు. హాస్యం వేరే కృతకంగా ఉండదు. కథలో కలిసిపోయే ఉంటుంది.

"..... ఆడదయి సెప్పకుండా పుట్టి నోరింటికి ఎల్తానంటే లెంపలో యించి కూకోబెట్టాలి గాని, మొగోల్లాగా రాతలూ, కోతలూ మప్పితే ఉడ్డోరం పుట్టదా బాబూ...." అని రాముడన్నప్పుడు అంత బాధలోనూ గోపాల్రావు చేత అతడితో ఖండింప చేస్తాడు గురజాడ. "ఓరి మూర్ఖుడా భగవంతుడి సృష్టిలో కెల్లా ఉత్కృష్టమైన వస్తువు విద్యనేర్చిన స్త్రీరత్నమే. శివుడు పార్వతికి సగం దేహం పంచి ఇచ్చాడు కూడా. ఇంగ్లీష్‌వాడు భార్యని 'బెటర్‌హాఫ్' అంటాడు. అనగా పెళ్ళాం మొగుడికన్నా దొడ్డది అన్నమాట. బోధ పడ్డాదా?" అంటాడు. అంతటితో ఊరుకోకుండా "నీ కూతురుని బడికి పంపిస్తున్నాం కదా. విద్య యొక్క విలువ నీకే బోధపడుతుంది. .." అని కూడా చెప్పిస్తాడు గురజాడ.

అలాగే కమలిని ప్రవర్తన కూడా! భర్త వేశ్యాలోలుడైతే భార్య అతడితో ఊరికే తగవుకు దిగదు. కోపంతో పుట్టింటికి వెళ్ళిపోదు. ఇంట్లో అతనికనిపించకుండా దాగి ఉండి, భర్తలో భయోత్పాతాలు కలిగేట్టు చేసి, లెంపలు వేసుకునేట్టు చేస్తుంది. మరి, కమలిని అబలా? సబలా?

'సాంఘిక అవినీతి క్రిములతో నిండిన దుర్భర దాస్యం నుండి మహిళలను కాపాడడానికి, సమాజాన్ని అప్రతిష్టపాలు చేసే పరిస్థితిని కళ్ళ ఎదుట పెట్టి, నైతిక భావాల ఉన్నత ప్రమాణాన్ని ప్రాచుర్యానికి తేవడం కంటే సాహిత్యానికి ఉత్తమమైన కార్యమేదీ ఉండదు' అన్న గురజాడ ఉద్ఘోష ఈ కథలోనూ మనకి కనిపిస్తుంది. అసలు ఈ కారణం కోసమే ఆయన 'కన్యాశుల్కం' తో తెలుగులో రచనకు శ్రీకారం చుట్టారు. ఆయన మాటల్లోని ఔన్నత్యం రచనల్లో పూర్తిగా ప్రతిబింబి స్తుంది. అందుకు ఉదాహరణ 'దిద్దుబాటు'. నైతిక భావాల ఉన్నత ప్రమాణాన్ని ప్రాచుర్యానికి తేవడం కంటే సాహిత్యానికి ఉత్తమమైన కార్యమేమీ లేదన్న గురజాడ 'స్త్రీలకి విద్య నేర్పకూడద'ని తనకి అనువునా నౌకరు రాముడు చెప్పినా ఏకీభవించడు. ప్రపంచంలో చదువుకున్న స్త్రీకి మించిన కన్యారత్నం లేదంటాడు.

ఈ కథ ద్వారా స్త్రీవిద్య ఆవశ్యకతను చెప్పారు గురజాడ. అంతేకాదు ఒకరిలో ఔన్నత్యం కొద్దిగా దెబ్బతిన్నంత మాత్రాన బంధం తెంపేసుకోనక్కర్లేదు. తమ తెలివితేటలతో దిద్దుబాటు చేసుకోవచ్చనీ ఈ కథ ద్వారా చెప్పిస్తారు.

అందరికీ అర్థమయ్యే వ్యావహారిక భాషలో ఉపోద్ఘాతాలు, వర్ణనలు లేకుండా సరాసరి కథలో కొచ్చి తర్వాతేమి జరుగుతుందో చదవాలనిపించే ప్రారంభంతో క్లుప్తంగా, స్పష్టంగా విషయాన్ని చెప్పి ఊహించని, ఆలోచింప చేసే ముగింపుతో 'దిద్దుబాటు' ద్వారా చదువు కున్న స్త్రీ ఇంట్లోంచి బయటకు అడుగుపెట్టకుండా తన సంసారాన్ని తాను ఎలా చక్కదిద్దుకోగలదో చెప్పారు. ఆధునిక మహిళ భారతదేశ చరిత్రని తిరిగి రాస్తుందన్న ఆయన నమ్మకానికి తగ్గట్టు కమలిని పాత్రని తీర్చిదిద్దారు. అంతకు

ముందొచ్చిన కథలకు భిన్నంగా 'దిద్దుబాటు'ని తీర్చిదిద్దారు.

గురజాడవారు 'దేవుడు చేసిన మనుషుల్లారా! మనుషులు చేసిన దేవుళ్ళారా! మీ పేరేమిటి?' కథానికలో ఒకే మతంలో శైవ, వైష్ణవ దగాకోరుతనాల్ని నిర్భయంగా నాంచారమ్మ అనే స్త్రీ పాత్రతోనే బయట పెట్టి మూఢభక్తిమీద, మూఢనమ్మకాలమీద చురకలు వేసారు.

1932లో రాజమండ్రిలో జరిగిన ఓ సభలో గురజాడవారి గురించి ప్రస్తావిస్తూ ప్రముఖ కథానికా రచయిత, కథానికకు ఆ పేరు పెట్టిన విమర్శకులు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు మాట్లాడుతూ 'రాజారామ మోహనరాయ్, కందుకూరి వీరేశలింగంగార్లు సంస్కరణోద్యమం ద్వారా కేకలు పెట్టి చెప్పిన విషయాల్ని గడుసు అప్పారాయ కవీంద్రుడు మూడు ముక్కల్లో చెప్పాడు– కనిపించిన రాయి రప్పల్ని మొక్కడం లాంటి మూఢ నమ్మకాలతో మనిషి ఉన్నంతకాలం అభివృద్ధిని సాధించలేడు, ఆధునిక స్త్రీ సమాజాన్ని తిరగరాస్తుంది, ఆధునిక భాష ద్వారానే సాహిత్యం ఎక్కువమందికి చేరి ఎక్కువలబ్ధిని అందించగలదు. ముక్కుపచ్చలారని బాలికల దుస్థితిని చూసి, దరిద్రభారంతో పుడమికి అంటుకుపోయిన నిర్భాగ్యులను చూసి వాళ్ళ దయనీయస్థితికి వల వల దుఃఖించి, అందుకు కారణమైన వాళ్ళమీద కన్నెర్ర జేశారు. ఆ ఎరుపు మంటల్లోంచే కన్యాశుల్కం 'ఢాం' అని పేలింది. ఆ వెలుగులో అప్పారాయకవీంద్రుని చేతులలో ముత్యాలసరాలు తళతళలాడాయి. ఆధునిక కథలూ ఆవిర్భవించాయి. వీటి ప్రభావం తెలుగుభాషమీద పడి లింకులు వదులయ్యాయి.' ఈ నివేదిక ప్రబుద్ధాంధ్రలో ప్రచురిం చారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.

స్త్రీల అభ్యుదయంపట్ల శ్రీపాదవారికున్న మక్కువని బట్టి ఆయనను అభిమానంగా 'స్త్రీపాద' అనికూడా కొందరంటుంటారు. ఆరోజుల్లో ఫొటోలో భార్య కూర్చుంటే ఆయన వెనుక నిల్చున్నారు. అదీ స్త్రీలపట్ల ఆయనకున్న గౌరవం!

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి చిన్న కథల్ని విస్తృత నేపథ్యంలోంచి చూస్తే అన్ని కాలాలకు వర్తించే చేదు నిజాలు గుర్తించుకోతగ్గ సందేశాలు మనల్ని పలకరిస్తాయి. మూఢాచారాలతో నిండిన సమకాలీన సమా జంలో స్త్రీకి జరుగుతున్న అన్యాయాలపట్ల ఆయన ఆవేదనలు ఎన్నో చిన్న కథల్లో మనకు కనిపిస్తాయి.

బాల్య వివాహాల్ని ఖండిస్తూ విధవా వివాహాల్ని ప్రోత్సహిస్తూ– కందుకూరివారి సంస్కరణాభిలాషకు ఊతమిస్తూ–జట్కా బండి అతనితో కూడా పంతులుగారి తోటకి తీసుకెళ్ళడానికి డబ్బులు తీసుకోనని చెప్పిస్తాడు. శాఖాంతర వివాహాల్ని, కులాంతర వివాహాల్ని ప్రోత్సహిస్తూ చిన్న కథలు రాశారు. వరకట్నం కోసం వెంపర్లాడే యువకుల్ని ఆటలు పట్టించే రచనలు చేశారు.

ముందుచూపుతో శాస్త్రిగారు చెప్పిన చిన్నకథ 'కొత్త చూపు'. స్త్రీలు కూడా వ్యాయామం చేసి, శారీరక బలాన్ని పెంచుకోవలసిన ఆవశ్యకతను చెబుతుంది ఈ చిన్న కథ. స్త్రీ ధైర్యమైన జీవితాన్ని గడపడానికి సాము గరిడీల్లాంటి విద్యల్ని నేర్వాల్సిన అవసరం ఎంతో ఉందని చిన్నకథ ద్వారా చెప్పారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. పెళ్ళి చూపుల్లో అన్నపూర్ణ, పెళ్లయిన తర్వాత నువ్వు నీ భార్యతో కలసి బజారులోకి వెళ్తే ఏ పోకిరీ వాడైనా అల్లరిపెట్టచూస్తే నువ్వు నీ భార్యని కాపాడుకోగలవా?' అని అడుగుతుంది పెళ్ళిచూపులకు వచ్చిన మగధీరుణ్ణి. కొత్తచూపుని ఈ చిన్న కథలో మనకి కలిగించారు ఆనాడే శ్రీపాద.

'వెలిపెడితే అల్లుడైనాడు' కథలో రచయిత వితంతు వివాహ సంస్కరణతో బాటు శాఖాంతర వివాహం అనే మరో సంస్కారాన్ని ప్రోత్సహించారు. 'జూనియరు కాదు అల్లుడు' కథలో అప్పట్లో తప్పయిన రజస్వలానంతర వివాహాన్ని సమర్ధించారు. వేశ్యాకులంలో కూడా జాతిరత్నాల వంటి స్త్రీలున్నారని నిరూపించే కథ 'తులసి మొక్కలు'. లోకంలో పెద్దమనుషులుగా చెలామణి అయ్యే కొందరు వ్యక్తులు ఎంతటి అవినీతిపరులు, లంచగొండులూ అయి ఉంటారో – సమాజంలోని కలుపుమొక్కలు వీళ్ళు. వేశ్యల కన్నా హీన సంస్కారులు అని చెప్పిన కథ 'కలుపు మొక్కలు'. 'నా ఆత్మద్రోహం, ప్రెసిడెంటు పశుత్వం కలిస్తే ఓ పేద బ్రాహ్మణుడు కుటుంబానికి భుక్తి ఏర్పరుస్తాయంటే ప్రెసిడెంటుని రమ్మన్నానని ఆ ఊరకుక్కకు చెప్పు" అన్న మాటలలో వేశ్య పాత్ర ఔదార్యం వ్యక్తమవుతుంది. ప్రెసిడెంట్ పశుత్వం మీద అసహ్యం వేస్తుంది.

కులం కట్టుబాట్లకు జంకి పెళ్లి కోసం మతం మార్చుకున్న నిమ్నజాతి యువతీయువకుల కథ 'సాగర మథనం'.

మధ్యతరగతి కుటుంబాలలో స్త్రీలు మాట్లాడుకునే భాషని వ్యావహారిక భాషగా తీసుకుని రచనలు చేశానని ఆయనే చెప్పుకున్నారు.

కుటుంబంలోని అపేక్షల్ని చెప్పే చిన్న కథ– 'కూతుళ్ల తల్లి' తల్లి మనసుకి అద్దం ఈ చిన్న కథ.

శ్రీపాదవారికి వీరేశలింగం గారంటే అపరిమితమైన అభిమానం. ఆ రోజుల్లో బాల్యవివాహాలు ఎక్కువ. ముసలివాళ్ళతో పెళ్ళిళ్ళు జరగడం వల్ల చిన్నవయసులోనే భర్త చనిపోయి పుట్టింటికి చేరేవారు. అక్కడి పరిస్థితులు అంతకన్నా అధ్వాన్నంగా తయారయ్యేవి.

'అరికాళ్ళకింద మంటలు'లో ఇలాంటి సమస్యని చిత్రించడమే కాదు, పరిష్కారమూ చెప్పారు.

పుట్టింట్లోని బాధల్ని భరించలేక ఒక వితంతుయువతి రాత్రిపూట బయటికొస్తుంది.

"ఎక్కడికెళ్తారమ్మా?" జట్కా అతను అడుగుతాడు.

"నీ పేటేది?" మెల్లిగా అడుగుతుందామె.

"దానవాయిగుంట" చెప్పాడతను.

"ఏం పుచ్చుకుంటావ్?"

"పంతులుగారి తోటకా?" అడుగుతాడు.

అవునన్నట్లు తలూపుతుందామె.

"నిముసాల మీద తోటకు తీసుకుపోతాను. బండెక్కం దమ్మగారూ..."

"నా దగ్గర ఒక్క రాగి దమ్మిడీలేదు"

"పంతులుగారి తోటకు నాకేమీ ఇవ్వక్కర్లేదు" అంటాడు జట్కా అతను.

అది కందుకూరి వారి సంస్కరణకు శ్రీపాద వారందించిన అక్షర ప్రోత్సాహం.

జట్కా అతనిచేత అలా చెప్పించి వూరుకోకుండా ఆ తర్వాత కారణాన్నీ జట్కా అతనితోనే చెప్పిస్తారు రచయిత.

జట్కా అతని తల చెడిన కూతురుకి వీరేశలింగంగారు పునర్జన్మ నిచ్చారు. 'నీకూ ఆయన దగ్గర మేలు జరుగుతుందమ్మా?' అంటా డామెతో.

గిరిజనులు, సంచార జీవనాన్ని సాగించేవాళ్ళ జీవితాల్ని చక్కటి కథానికలుగా మలిచి తెలుగు పాఠకులకందించారు శ్రీచింతా దీక్షితులు.

'సుగాలీ కుటుంబం'లో సుగాలీల నిత్య కష్టాలను కరుణాజనకంగా చిత్రించారు దీక్షితులు. సుగాలీలు – చెంచులు, ఎరుకలు, కోయలు, ఒడ్డెలు అడవి జాతికి చెందినవాళ్లే. సుగాలీలకు కొండలు, అడవులూ నివాసస్థలాలు, ఎర్ర కొండలలో ఉన్న వీళ్ళు అక్కడున్న చెంచువాళ్లు దోచుకోవడంతో అడవికి దగ్గరగా ఉన్న గ్రామానికి మకాం మారుస్తారు. కానీ అడవి మీదే ఆధారపడి బ్రతుకుతుంటారు. అడవిలో దేవదారు కూర, పింకికాయలు, పాలపళ్ళు, వెలగపళ్ళు – ఏవి దొరికితే వాటిని ఏరుకొచ్చి అమ్మి జొన్నకర్రలు సంపాదించి, జొన్న సంకటి చేసుకుని

ఇంటిల్లిపాదీ తినేవారు. ఆకుకూరలు, పళ్ళుకొనేవాళ్లు తగ్గిపోతారు. ఈత పళ్ళని అక్కడక్కడ పోగుచేసి – ఎండబెట్టి – దంచి ఆ పొడితో చేసిన రొట్టెల్ని కాల్చుకుని తిన్నారు కొన్నాళ్ళు. క్రమంగా ఈతపళ్లు కరువవు తాయి... చింతగింజల్ని దంచి – నానబెట్టి – ఎండబెట్టి – తిరగలితో విసిరి – రొట్టెలుచేసి తినేవారు. క్రమంగా అవీ లభ్యంకాకుండా పోయాయి. చింతచిగురు, చింతపండు బూడిదలో కలిపి తయారైన అంబలిని తాగ సాగారు. అడవిలో చింతపండు తెచ్చేవాళ్ళకు శిక్షపడుతుందని తెలపడంతో ఆ ఆధారం పోయింది. ఎవ్వరూ చూడకుండా అర్ధరాత్రి అడవిలోకి పోయి దేవదారు కూరని తెచ్చి ఉడకబెట్టి పిల్లలకిచ్చి తిన్నారు. కొన్నాళ్ళకి అదీ అయిపోయింది. తిండిలేదు ... అడవిమీద ఆధారపడి బ్రతికేవాళ్ళని అడవిలోకి రావద్దనడం 'తల్లిపాలు తాగుతున్న పిల్లాడిని బలవంతాన లాగేయడం లాంటిదే' అంటారు రచయిత.

దేవదారు కూరను తెద్దామని అడవిలోకి వెళ్ళిన రూరల్ నాయక్‌కి శిక్ష పడుతుంది. అతని భార్యా పిల్లలు అనాథలై ఎటో వెళ్ళిపోతారు. కడుపు చేత బట్టుకుని ఆకలి బాధతో చెల్లాచెదురైతే సుగాలీ కుటుంబం – డబ్బాశతో ఉద్యోగాన్ని పోగొట్టుకున్న మునుస్వామి గ్రామానికి తిరిగివస్తే మిత్ర బంధుకోటి కరువవుతుంది. ఇదీ కరువు కథే.

'చెంచులక్ష్మి', 'దాసరిపాట' లాంటి కథానికలూ రాశారాయన. వ్యక్తిగత జీవితం ఎంతటి ఆటుపోట్లకి ఎదురైనా ఊరూరా పాట చెప్పు కోనిదే ఆ దాసరి కుటుంబానికి గడవదు. ఒక్కగానొక్క కొడుకు జ్వరంతో ఉన్నా, చనిపోయినా కూడా పాట మానలేని దయనీయ స్థితి వాళ్లది. పిల్లాడి అనారోగ్య కారణాన 'బొబ్బిలి' కథలో తాండ్ర పాపారాయుడి శౌర్యాన్ని సరిగా వివరించలేకపోతాడు. గుమ్మెత్తి వాయి స్తున్న భార్య ఒడిలో కొడుకు చనిపోవడంతో బొబ్బిలి కథలో అందరూ మరణించిన సన్నివేశాన్ని ఏడుస్తూ రక్తికట్టించ గలుగుతాడు. ప్రేక్షకు లానందిస్తారు గాని దాసరి దంపతుల గుండె పగులుతుంది

ఒక బాల వితంతువును స్వంత మరిదే దగా చేస్తాడు. చెల్లెలు ఈసడించుకుంటుంది. సమాజం నిప్పులు గ్రక్కుతుంది. అర్థం చేసుకునే వాళ్ళు లేరు. ఏం చేస్తుంది "నువ్వయినా నన్ను అక్కున చేర్చుకోవమ్మా" అంటూ కృష్ణలో కలిసిపోతుంది. ఆమె మల్లాది వారి 'సర్వమంగళ!'

గోపీచంద్, హిందూ పాతివ్రత్యం, 'పతివ్రత అంతరంగికం' లాంటి చాలా కథానికల్లో హిందూ విలువల్ని అపహాస్యం చేసారు. ఆ విలువల పేరుతో జరుగుతున్న ఆత్మవంచనను దుయ్యబట్టారు.

ప్రజలు పోరాడి స్వతంత్ర్యాన్ని తెచ్చుకున్న ఓ దేశంలో స్వాతంత్ర్య విగ్రహాన్ని రాజధాని నగరంలో ప్రతిష్ఠించడానికి తీసుకొచ్చారు. ప్రభుత్వా ధ్యక్షుడు ప్రసంగించి, స్వతంత్ర విగ్రహం ముఖం మీదున్న ముఖ్‌మల్ గుడ్డని తొలగించగానే స్వాతంత్ర్య విగ్రహం ఆధునిక ఆయుధాలతో ఓ స్త్రీగా సాక్షాత్కరించింది, ఒక భయంకరమైన 'దయ్యం రూపంలో' అంటూ 'శారద' 'స్వాతంత్ర్య స్వరూపం' అనే కథానికని రాశారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో రాసిన కథానిక ఇది.

తిలక్‌గారి కథానికలలో స్త్రీ మానవతా విలువలతో కనిపిస్తుంది.

'దొంగ' కథానికలో దొంగతనానికి వచ్చినవాడు దొరలా ప్రవర్తి స్తాడు. దొరలా తిరిగే ఆత్మద్రోహిని నిలదీస్తాడు. భర్త రాక్షసత్వ బారి నుంచి తనను రక్షించిన ఆ అగంతుకుణ్ణి "ఎవరు బాబూ నువ్వు?" అని అడగగానే అతనికి ఏమి జవాబు చెప్పాలో అర్థం కాదు. ఇబ్బంది పడిపోతాడు. ప్రతీ మనిషిలోనూ మానవత్వముంటుంది. అది, అట్టడుగున పడిపోకూడదని చెప్పే కథానిక 'దొంగ'.

మనిషి అంతరంగిక ప్రపంచాన్ని స్పృశిస్తాయి బుచ్చిబాబు కథానికలు. కథానికలు వ్రాయడానికి ఏమీ ఉండదనిపించే జీవితాలలో కూడా విశేషాలు ఉంటాయి, వ్రాయడానికి అని చెప్పాయి ఆయన కథలు. నిజంగా జరిగిన విషయం ఎంత అపూర్వమైనదైనా కొంత వడపోత, చిత్రిక అవసరం అని ఆయన భావన.

"అనాగరికులైన స్త్రీల పట్ల సానుభూతి, ఇష్టం నాకు ప్రబలంగా ఉన్నాయి. నా రచనలలో తరచూ అలాంటి స్త్రీలు దర్శనమిస్తుంటారు. వారి శరీరాలను, మూగ మనస్తత్వాలను వర్ణించడంలో ఒక వింత ఆనందాన్ని పొందుతాను" అన్నారు బుచ్చిబాబు.

ఆయన పుట్టగానే తల్లికి పెద్దజబ్బు చేసింది. పిల్లవాడికి పాలు ఇవ్వలేని స్థితి! అందుకని పిల్లవాడికి ఓ ఉప్పరస్త్రీతో పాలిప్పించారు. ఆరోజుల్లో ఆర్థికంగా ఇబ్బంది పడేవారు ఇలా పాలందక బాధపడే పిల్లలకు పాలిచ్చి కొంత లబ్ది పొందేవారు. బుచ్చిబాబుకి తానలా స్తన్యం పొందడానికి కారణమైన స్త్రీ లాంటి స్త్రీలంటే చిన్నప్పటినుంచే ఓ ప్రత్యేకాభిమాన ముండేది. పెద్దయిన తర్వాత వాళ్ళకి రచనల్లో ఓ ప్రత్యేక స్థానమిచ్చారు.

పారిశ్రామికాభివృద్ధి, నాగరికత పెంపొందడంతో బాటు మానసిక మైన ఒక అమాయకత్వం మరుగున పడి, మనుషులలో ఒక కృత్రిమమైన మనస్తత్వం ఏర్పడుతోందన్న భయం ఆయనలో ఉండేది. ఆ అమాయ కత్వం – నైతిక శక్తికి, నిజాయితీకి గీటురాయి. అలాంటిపాత్రలను సృష్టించడంలో ఆయనకెంతో ఆనందం ఉండేదిట. "నన్ను గురించి కథ వ్రాయవూ" లో కుముదం పాత్ర "అరకులోయలో కూలిన శిఖరం" లో మూనా పాత్ర, "చివరకు మిగిలేది"లో కోమలి పాత్ర ఇలాంటివే నంటారు.

''పల్లెటూళ్ళలో నేనెరిగున్న స్త్రీలలో చాలా మందిలో ఈ అమాయకత్వం ఉండేది. అది విలువకలదని, పోగొట్టుకోకూడదని నమ్మే నేనలాంటి పాత్రలను చిత్రించడంలో ఆసక్తి చూపిస్తాను. దీనికంతకీ కారణం చిన్నప్పుడు ఉప్పరి మనిషి పాలు త్రాగడం వల్లనే అనుకోవడం అతిశయోక్తి కాదేమో నాకు తెలీదు" అని కూడా అంటారు బుచ్చిబాబు.

'ఉత్తమ ఇల్లాలు' అంటూ ఎంకినాయుడు బావల గురించి బుచ్చి బాబు ఓ నాటకం రాశారు. ఈనాటకంలో ఎంకిని స్వేచ్ఛాజీవిగా చిత్రించారు. పెళ్ళి కూడా ఆమె స్వేచ్ఛకి ఎక్కడ అంతరాయం కలిగిస్తుందో నని చేసుకోదు. నాయుడుతో సహజీవనం చేస్తుంటుంది. అందుకు ఊళ్ళో పెద్దలు అంగీకరించరు. వాళ్ళని ఊళ్ళో నుంచి వెళ్ళగొడతారు.

"స్వేచ్ఛని అంతగా కోరే ఎంకి–నాయుడు చెప్పినట్లు వినడానికి అంగీ కరించిందంటే చిన్ననాడు ఆడుకున్న ఆటల్లో ఏర్పడిన మనస్తత్వం– ఒకరు చెప్పినట్లు నడుచుకోవాలన్న మనస్తత్వం పట్ల తాత్కాలికంగా ఇష్టం ఏర్పడిందేమో నాలో..." అంటారు బుచ్చిబాబు.

పాలగుమ్మి పద్మరాజుగారు రాజమండ్రి వీరేశలింగం హైస్కూలులో ఉపాధ్యాయులుగా పనిచేస్తుండేవారు. అక్కడ నుంచి శలవుల్లో తాతగా రింటికి పడవమీద వచ్చేవారు. రాజమండ్రిలో మధ్యాహ్నం పడవ ఎక్కే వాళ్ళట. గోదావరి దాటి విజ్జేశ్వరం చేరుకునే సరికి సాయంకాల మయ్యేది. విజ్జేశ్వరం లాకుల్ని చూసేసరికి పద్మరాజుగారికి భయం వేసేది. లాకు దాటి నిడదవోలు కాలవలో రాత్రంతా ప్రయాణం. ఎక్కువ భాగం రాత్రిలోనే గడిచినా, ఆ పడవ ప్రయాణాలన్నీ స్ఫుటంగా ఆయన మనసులో నిలిచిపోయాయి! 'పడవ ప్రయాణం' రాయడానికి అవే ముడిపదార్థాలు!

'నేను నిత్యం మసిలే మధ్యతరగతి సమాజానికి కాస్తదూరంగా నా మనసు ఒంటరితనంతో, దిగులుకాని దిగులుతో నిండిపోయిన అసందిగ్ధ మైన సంధ్యాసమయంలో, ఒక పడవమీద చిత్తప్రవృత్తులతో –రంగు, రుచితో నాకు దర్శనమిచ్చిన స్త్రీ, పురుషుల కథని పాత అనుభవాల సహకారంతో పడవ ప్రయాణం రాశాను' అంటారు.

మార్క్సిజం ఆత్మవాద, ఆత్మాశ్రయ ధోరణులలో పడిపోయిందని చెప్పటం తొందరపాటు

అమ్మనుడి అక్టోబర్ సంచికలో "బౌద్ధ ఆచరణ కూడా శాస్త్రీయమే" అన్న వ్యాసంలో రచయిత బొర్రా గోవర్ధన్ గారు వ్రాసిన ఒక విషయం అభ్యంతరకరంగా వుందనిపించి ఈ లేఖ వ్రాస్తున్నాను.

అభ్యంతరకర విషయం:

దాదాపుగా బౌద్ధంలాంటి సామాజిక సిద్ధాంతమే అయినా మార్క్సిజాన్ని.... ఆత్మవాద భావజాలం నుంచి అవి బయటపడలేక పోయాయి. ఆ బలహీనత లెనిన్, స్టాలిన్‌తో మొదలయ్యి మావోతో బలపడింది. ఈ దేశంలో అయితే విప్లవవాద సంస్థలన్నీ వ్యక్తి పేర్లతోనూ ప్రాచుర్యంలో వున్నాయి. అనాత్మ వాదమైన మార్క్సిజం ఇలా ఆత్మవాద, ఆత్మాశ్రయ ధోరణులలో పడిపోయింది.

వ్యాఖ్య: మార్క్సిజాన్ని అనుసరిస్తున్నామని చెప్పుకునే వారిలో కొందరో, లేదా చాలా మందో గోవర్ధన్ గారు నిర్వచిస్తున్న ఆత్మాశ్రయ ధోరణులలో పడిపోయి వుండవచ్చు. కానీ, మార్క్సిజమే ఆ ధోరణులలో పడిపోయింది అనటం అభ్యంతరకరం. మార్క్సిజం ఎప్పుడూ ఆ ధోరణిలో పడలేదు. పెట్టుబడిదారీ సమాజంలోని వర్గ సంబంధాలు, ఆ వర్గ సంబంధాలపై ఆధారపడి ఏర్పడిన నైతిక విలువల గురించి, పెట్టుబడిదారీ సమాజాన్ని సోషలిస్టు సమాజంగా మార్చటం గురించీ, దానికి నాయకత్వం వహించేది ఆ సమాజంలోని ఆధునిక పరిశ్రమలలో సజీవ అంశం కార్మికులు మాత్రమే అని మార్క్సిజం శాస్త్రీయంగా ప్రతిపాదించింది. లెనిన్ దగ్గరకు వచ్చేటప్పటికి ఈ మార్గం పెడమార్గం పట్టడం ప్రారంభిం చిందని ఈ వ్యాస రచయిత వ్యాఖ్యానించారు. అయితే మార్క్సిజం సమకాలీన సమాజంలోని అత్యంత పురోగామి సామాజిక విజ్ఞాన శాస్త్రం. ఏ సైన్సూ స్థిరమైనదిగా వుండదు. ప్రయోగ ఫలితాలకు అనుగుణంగా తనను తాను అభివృద్ధి చేసుకుంటూ వుంటుంది. 20వ శతాబ్ది ప్రారంభం నాటికి మార్క్స్ కాలం నాటి పెట్టుబడిదారీ విధానం పరిణితి చెందిన గుత్త పెట్టుబడిదారీ విధానంగా ఎదిగింది. పెట్టుబడి స్థానంలో ఫైనాన్స్ పెట్టుబడి ఎగుమతి ప్రముఖ స్థానం వహించటం ప్రారంభించింది. ఆ దశలో సోషలిస్టు విప్లవాలు, సామ్రాజ్యవాద గొలుసులో బలహీనమైన లింకు వద్ద సంభవిస్తాయనే ప్రతిపాదనతో వెనకబడిన పెట్టుబడిదారీ దేశమగు జారిస్టు రష్యాలో కార్మికవర్గ నాయకత్వంలో సోషలిస్టు విప్లవం వస్తుందనే మౌలిక ప్రతిపాదన చేసి అనేక విశ్లేషణల ద్వారా రుజువు చేసి లెనిన్ అక్కడ విప్లవానికి చోదకు డయ్యాడు. లెనిన్ మరణానంతరం జోసఫ్ స్టాలిన్ సోవియట్ రష్యాలో సోషలిజాన్ని పరిపూర్తి చేయటానికి అడ్డువచ్చిన అనేక ధోరణులను ఓడిస్తూ, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో తన దేశాన్నే కాకుండా మొత్తం ప్రపంచాన్నే ఫాసిజం నుంచి కాపాడటానికి తన స్వంత కుమారుడితో సహా కొన్ని లక్షల మందిని ప్రాణత్యాగాలకు సిద్ధం చేశాడు. ఆ క్రమంలో కొన్ని పెద్ద తప్పులే జరిగి వుండవచ్చు. అలాగే మావో జెడాంగ్, మార్క్స్ – లెనిన్ ల బోధనలను తన అర్థవలస, అర్థ ఫ్యూడల్ చైనా సమాజానికి వర్తింప చేసే క్రమంలో చైనా కమ్యునిస్టు పార్టీలోని వివిధ మితవాద, అతివాద ధోరణులను ఓడిస్తూ 1949లో విప్లవాన్ని విజయవంతం చేసి, ఆ తరువాత తమ పార్టీలోని పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణ పంథాను ఓడించటం కోసం కోట్లాదిగా చైనా ప్రజలను కదిలించాడు. కనుక ప్రస్తుత యుగపు మార్క్సిజాన్ని, మార్క్సిజం – లెనినిజం – మావో ఆలోచనా విధానం అని పిలవటంలో ఎలాంటి ఆత్మాశ్రయ ధోరణి లేదు.

బుద్ధుడి అనుయాయిలు ఆయన మరణానంతరం ఆ బోధనలకు బౌద్ధం లేదా బుద్ధిజం అని పేరు పెట్టలేదా? అలాగే శాఖోపశాఖలుగా చీలిన బౌద్ధాన్ని హీనయాన బౌద్ధం, మహాయాన బౌద్ధం, జెన్ బౌద్ధం తదితర పేర్లతో పిలవటం లేదా? బౌద్ధం అనే తోక వీటికి ఎందుకు వుంది? ఇది ఆత్మాశ్రయ ధోరణి కానప్పుడు ప్రస్తుత యుగపు మార్క్సిజాన్ని, మార్క్సిజం – లెనినిజం – మావో ఆలోచనా విధానం అని ఆ సిద్ధాంతం అనుయాయులు పిలవటం ఎంత మాత్రం ఆత్మాశ్రయ ధోరణి కాదు. అయితే భారతదేశ విప్లవ మౌలిక పంథాలో తేడా లేకపోయి నప్పటికీ విప్లవ ఉద్యమం అనేక పార్టీలుగా చీలిపోయి వ్యక్తుల పేర్లతో పిలవబడుతూండటం దిగజారిన, ఆత్మాశ్రయ, అహంభావ ధోరణులకు గురికావటమే అని చెప్పవచ్చు.

–చిగురుపాటి భాస్కరరావు,
(విశ్రాంత) అధ్యాపకుడు,

<u>రచయిత ప్రతిస్పందన:</u>

అఖిలభారత ఒ.పి.డి.ఆర్. నాయకులు సి.భాస్కరరావు (సి.బి.ఆర్) గారు నా వ్యాసంపై స్పందించడం సంతోషం.


కొన్ని విషయాలతో ఏకీభవించడం మరీ సంతోషం. అయితే వారు తప్పుపట్టిన "అనాత్మవాదమైన మార్క్సిజం ఇలా అత్మవాద, ఆత్మాశ్రయ ధోరణుల్లో పడిపోయింది" అనే వాక్యం "అనాత్మవాదమైన మార్క్సిజాన్ని ముందుకు నడిపించేవారు ఇలా ఆత్మాశ్రయ(ఆత్మవాద) ధోరణుల్లో పడిపోవటమే ఇక్కడి విషయం" అని ఉంటే భావం చక్కగా నప్పేది.

ఈ తప్పును తెలియజెప్పిన సి.బి.ఆర్.గారికి కృతజ్ఞతలు.

సద్విమర్శ ఎప్పుడూ స్వీకరించతగిందే. **–బొర్రా గోవర్ధన్**

'శ్రీరామచంద్రుడు వంటి ఉత్తమోత్తముని ఆరాధించే సీతకన్నా–క్రౌర్యం, పొగరు, అలక్ష్యం మూర్తీభవించిన ఒక మగవాణ్ణి–మరొక వ్యక్తికి ఎప్పుడూ లొంగి ఉండనివాణ్ణి, తన వాడుకాడని రూఢిగా తెలిసిన వాణ్ణి–మనసారా వాంఛిస్తూ, ఆరాధిస్తూ–అతనికోసం అవమానం, మసకగా హింసకూడా భరించగలిగిన స్త్రీమూర్తి ఎంతో గొప్పదని పించింది నాకా వయసులో. అందుకే అందీ అందకుండా జారిపోతున్న చీకటి రాత్రితో సమంగా ఆ మూర్తిని గురించి రాశాను.' ఇలా తెలుగు కథానికలలో స్త్రీమూర్తి కనిపిస్తుంది...

ఇది పూర్తిగా సంపూర్ణమని అనను. ఇంకా ఎందరో రచయితలు, రచయిత్రులు స్త్రీ అభ్యుదయాన్ని, అభివృద్ధిని కోరుతూ–స్త్రీ పాత్రల్ని భిన్నంగా మలిచారు.



–చలసాని నరేంద్ర
98495 69050

కాశ్మీర్‌లో చర్చల ప్రక్రియకు తగు భూమిక అవసరం !



కాశ్మీర్ లోయలో ఉగ్రవాద కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేస్తాం అంటూ వస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడున్నరేళ్ల అనంతరం ఇప్పుడు అన్ని వైపుల నుండి వస్తున్న వత్తిడులను తట్టు కోవడం కోసం చర్చల ప్రక్రియకు పూనుకొనక తప్పలేదు. గత సంవత్సరం జనవరిలో జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి మహబూబ్ ముఫ్తీ స్వయంగా ఢిల్లీ వెళ్లి, ప్రధానిని కలసి రాజకీయ ప్రక్రియ ప్రారంభించాలని అభ్యర్ధించారు. లేని పక్షంలో పరిస్థితులు మరింతగా దిగజారగలవని ఆందోళన వ్యక్తం చేశారు.

మూడేళ్ళ క్రితం భారత సైన్యం ఉత్తర దళ కమాండర్ సహితం ఉగ్రవాదం అదుపులోకి తీసుకు వచ్చామని, ఇప్పుడు ప్రభుత్వం రాజకీయ చొరవ చూపాలని సూచించారు. 2015 మార్చిలో పిడిపి – బిజెపి కలసి ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఆమోదించిన కనీస కార్యక్రమంలో సహితం గతంలో వాజపేయి ప్రారంభించిన రాజకీయ ప్రక్రియను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కానీ ఆ దిశలో గత మూడున్నరేళ్లలో ఎటువంటి ప్రయత్నం జరుగనే లేదు.

చివరకు గత ఆగష్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుండి జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ "కశ్మీర్ సమస్యను బుల్లెట్లతోనో, బలప్రయోగంతోనో పరిష్కరించలేం. కాశ్మీరీల మనసుకు చేరువకావటం ద్వారానే చేయగలం" అనడం ద్వారా రాజకీయ ప్రక్రియ మాత్రమే పరిష్కారం చూపగలదని ప్రధాని నరేంద్ర మోడీ గుర్తించినట్లు స్పష్టమైనది. ఇప్పుడు అక్కడ నెలకొన్న సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనేందుకు సంబంధిత వ్యక్తులు/సంస్థలన్నిటితోనూ చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం.

అందుకోసం కేంద్రం తన ప్రత్యేక ప్రతినిధిగా నిఘా విభాగ (ఐబీ) మాజీ డైరెక్టర్ దినేశ్వర్ శర్మను నియమించింది. జమ్ముకశ్మీర్ సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరిస్తుందని ఈ సందర్భంగా హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎవరెవరితో మాట్లాడాలో నిర్ణయించుకొనేందుకు దినేశ్వర్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని తెలిపారు.

చర్చలపై ఎలాంటి ఆంక్షలు లేవని, కాశ్మీర్ ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోవడమే అంతిమలక్ష్యం అని పేర్కొన్నారు. చర్చలకు కాలపరిమితి కూడా లేదని అంటూ, ఈ సున్నితమైన అంశంపై పరిష్కారం కోసం కృషి చేయడానికి దినేశ్వర్‌కు క్యాబినెట్ కార్యదర్శి హోదా కల్పిస్తున్నట్లు హోమ్ మంత్రి చెప్పారు. గతంలో ఇటువంటి చర్చలు చెప్పుకోదగిన ఫలితాన్ని సాధించలేక పోయినా "మేం సదుద్దేశంతో, స్పష్టమైన విధానంతో చర్చలు ప్రారంభిస్తున్నాం. చర్చలు ఫలప్రదంకావని ముందే నిర్ణయించవద్దు" అని విమర్శకులకు సమాధానమిచ్చారు.

కాశ్మీరీలతో చర్చలకై కేంద్ర ప్రభుత్వాలు 2002 నుంచి ఇప్పటివరకు రాజకీయ ప్రక్రియ ప్రారంభించడం కోసం నాలుగు యత్నాలు చేశాయి. తొలుత కేంద్ర మాజీ మంత్రి కేసీపంత్, ఆ తర్వాత ఎన్ఎన్ వోహ్రా, మూడో ప్రయత్నంగా ముగ్గురు ప్రతినిధుల బృందం (ఎం.ఎం.అన్సారీ, రాధాకుమార్, దివంగత పాత్రికేయుడు దిలీప్ పడ్గోంకార్)లను నియమించాయి. అయితే వివిధ కారణాల దృష్ట్యా ఇవేమీ ఆశించిన ఫలితాలు ఇవ్వలేక పోయాయి. చర్చలకు నిర్దుష్టమైన ఉద్దేశ్యాలు, విధివిధానాలు లేకపోవడం. మరోవంక రాజకీయ సంసిద్ధత కనిపించక పోవడం ఇందుకు ప్రధాన కారణాలు.

గత 25 ఏళ్లుగా కాశ్మీర్ లోయను ఆవహించిన ఉగ్రవాద భూతం కారణంగా ఇప్పటి వరకు భద్రత దళాలు 20 వేలమందిని పైగా చంపాయి. మరో 15 వేలమంది పౌరులు మృతి చెందారు. అయినా 'వేర్పాటు వాద' ధోరణులను మాత్రం అరికట్టలేక పోతున్నారు. అందుకు ప్రధాన కారణం సరిహద్దు అవతల పాకిస్థాన్ నుండి వేర్పాటు వాదులకు ఆయుధాలు, వనరులు లభించడమే కాకుండా ఉగ్రవాదులను సహితం శిక్షణ ఇచ్చి సరఫరా అవుతూ ఉండటమే. స్థానిక ప్రజలను ఉగ్రవాదుల ప్రభావం నుండి వేరు చేయడం కోసం చెప్పుకోదగిన ప్రయత్నాలు ఈ సందర్భంగా జరగలేదని చెప్పాలి.

ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి నిర్దిష్టమైన విధానం అంటూ లేకపోవడం సమస్యలను మరింతగా సంక్లిష్ట పరుస్తున్నది. ప్రపంచం మొత్తంలో ఉగ్రవాదులను అదుపు చేయడం కోసం భద్రత దళాలను ఉపయోగించి అణచి వేయడం లేదా రాజకీయ ప్రక్రియ ద్వారా వారితో సమాలోచనలు జరిపి ఒక అవగాహనకు రావడం వంటి రెండే మార్గాలు ఉన్నాయి. భారత దేశం రెండు పద్ధతులను కలగాపులగం చేసి వ్యవహరిస్తున్నది. రాజకీయ ప్రక్రియకు ఎంతో సహనం అవసరం. దూరదృష్టి అవసరం. అన్ని వర్గాలలో విశ్వాసం కలిగించడం మరింత అత్యవసరం.

ఇప్పటివరకు కాశ్మీర్ ప్రజలలో కేవలం వాజపేయి మాత్రమే అటువంటి విశ్వాసం కలిగించారు. కాశ్మీర్ ప్రజలలో మాత్రమే కాకుండా పాకిస్థాన్ ప్రజలలో సహితం రెండు దేశాల మధ్య శాంతి నెలకొల్ప గల యోధుడు ఆయనే అనే అభిప్రాయం కలిగించారు. వివిధ కారణాల వల్ల ఆయన ప్రయత్నాలు ఆశించిన ప్రయోజనం సాధించలేక పోయాయి. పలు పర్యాయాలు అర్ధాంతరంగా నిలిపివేయవలసి వచ్చింది. ఆ ప్రయత్నాలను కొనసాగిస్తామని చెబుతూ వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పటి వరకు అటువైపు దృష్టి సారించలేక పోయారు.

కాశ్మీర్ లోయలో నెలకొన్న సమస్యను భద్రత దళాలకు వదిలి వేయకుండా రాజకీయ నాయకత్వం పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలని ఉన్నత సైనిక, పోలీస్ అధికారులు పలు సందర్భాలలో స్పష్టం చేస్తున్నారు. వాజపేయి హయాంలో కె సి పంత్, రామ్ జెఠ్మలానీ, జార్జ్ ఫెర్నాండెస్, చివరకు ఎల్ కె అద్వానీ వంటి వారిని కాశ్మీర్ అంశంలో రంగంలోకి దింపారు. పివి నరసింహారావు సహితం ప్రత్యేకంగా కాశ్మీర్

వ్యవహారాలు అంటూ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి రాజేష్ పైలట్‌కు అప్పచెప్పారు. అటువంటి రాజకీయ ప్రయత్నం యుపిఎ హయాంలో జరుగలేదు.

ఇప్పుడు కూడా ఒక రిటైర్డ్ పోలీస్ అధికారిని మధ్యవర్తిగా నియమించడం ఎటువంటి ఫలితాలు ఇవ్వగలదో చూడవలసి ఉంది. ఐపీఎస్ 1979 (కేరళ కేడర్) బ్యాచ్ అధికారి అయిన దినేశ్వర్ శర్మకు కాశ్మీర్‌తో సుదీర్ఘ అనుబంధమే ఉంది. 1992లో ఐబీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా (25 ఏళ్ల క్రితం) కాశ్మీర్‌లో అడుగుపెట్టారు. 1994 వరకు ఆ హోదాలో ఉన్నారు. ఆ తర్వాత ఢిల్లీకి వచ్చినా కశ్మీర్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. 2014 నుండి 2016 వరకు ఐబి డైరెక్టర్‌గా పనిచేశారు.

అందుకనే కాశ్మీర్ సమస్య పట్ల ఆయనకు విస్తృతంగా అవగాహన ఉన్నదనడంలో సందేహం లేదు. కానీ నిర్దుష్టమైన విధానం లేకుండా సమాలోచనలు జరపడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండే అవకాశం ఉండదు. పైగా కాశ్మీర్ సమస్య పట్ల తనకు మించిన అవగాహన మరొకరికి లేదనే భావనతో ఇప్పటి వరకు ఈ వ్యవహారాలపై ఆధిపత్యం వహిస్తున్న జాతీయ భద్రత సలహాదారుడు అజిత్ డియోల్‌కు సన్నిహితుడు కావడం వల్లననే ఆయనను మధ్యవర్తిగా నియమించారని తెలుస్తున్నది.

పాకిస్థాన్‌తో అయినా నేరుగా చర్చలు జరుపుతాను గాని ఇక్కడ వారి తొత్తులైన హుర్రియత్ నాయకులతో చర్చలు జరిపే ప్రసక్తి లేదని ఇప్పటివరకు డియోల్ అంటూ వచ్చారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రమేయం లేకుండా పాకిస్థాన్ వ్యవహారాలను సహితం ఆయన పర్యవేక్షిస్తున్నారు. ఇటువంటి సున్నిత అంశాలలో రాజకీయ నాయకత్వ ప్రమేయం లేకుండా, పోలీస్ అధికారులకు అప్పచెబితే వివిధ వర్గాలలో ఎటువంటి విశ్వాసం కలిగించగలమో అన్నది అనుమానాస్పదమే.

ఇటువంటి అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకొనే అనుకుంటా "కాశ్మీర్ లో కొన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా ప్రతిపక్షాలు: హుర్రియత్‌తో సహా కొన్ని కాశ్మీరీ బృందాలు రాజకీయ పార్టీతో సంబంధం ఉన్న నాయకునితో చర్చలకు సుముఖత వ్యక్తం చేయక పోవచ్చు. పైగా హింసాయుత నిరసనలతో పాల్గొంటున్న యువతకు నిర్దుష్టంగా ఒక నాయకుడు అంటూ లేరు. అటువంటివారికి కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిని కలసి తమ సమస్యలను నివేదించు కోవడానికి తేలికగా ఉంటుంది" అంటూ కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ వివరణ ఇచ్చింది.

చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఎక్కువగా సంతోషం వ్యక్తం చేస్తున్నది జమ్మూ-కశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తి అనడంలో సందేహం లేదు. దీనితో కొంతకాలం పాటు ఆమెకు కొంత ఊపిరి పీల్చుకొని అవకాశం కల్పించినట్లు కాగలదు. కాశ్మీర్ లోయలో రాజకీయ ప్రక్రియ నేటి అవసరం అని అంటూ ఈ అవకాశాన్ని కాశ్మీర్‌లోని అన్ని వర్గాలు సద్వినియోగం చేసుకోగలవని ఆమె నమ్మకం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చొరవ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చర్చల ఫలితాలు ఎలా ఉంటాయో వేచిచూ దాల్సిందేనని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా ట్వీట్‌లో పేర్కొన్నారు.

చర్చల ప్రక్రియకు కేంద్రం పూనుకోవడాన్ని మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సైఫుద్దీన్ సోజ్ కూడా స్వాగతించారు. హురీయత్ కాన్ఫరెన్స్‌తో సహా అన్ని వర్గాల వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని అర్థవంతమైన పరిష్కారం కోసం కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. వాజపేయి ప్రభుత్వంలో చర్చలు జరిపిన బృందంలో ఉన్న ప్రస్తుత జమ్మూ కాశ్మీర్ గవర్నర్ ఎన్ ఎన్ వోహ్రా ఇది సరైన మార్గంలో తీసుకున్న చర్య అని అభివర్ణించారు.

కాశ్మీర్ ప్రజలలో వివక్షత భావం తొలగించాలి

కాశ్మీర్‌లో నెలకొన్న మౌలిక సమస్యలను ఈ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొంటున్నదా అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకరంగా మారుతున్నది. ఉగ్రవాదం ప్రబలడానికి పాకిస్థాన్ తోడ్పాటు కారణం అవుతున్నా స్థానిక పరిస్థితులు సహితం అందుకు దోహదం చేస్తున్నాయని మరువలము. తమ పట్ల మిగిలిన దేశం వివక్షత ప్రదర్శిస్తున్నదనే భావన అక్కడి ప్రజలలో బలీయంగా నెలకొన్నది. తామంతా ఉగ్రవాదులమో, ఉగ్రవాదులకు మద్దతు దారులమో అనే అభిప్రాయాన్ని కేంద్ర ప్రభుత్వం, జాతీయ మీడియా ఉద్దేశ్య పూర్వకంగా వ్యాప్తి చేస్తున్నదనే అసహనాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.


దేశంలో ఎక్కడా ఉపయోగించని పెల్లెట్ తూటాలను తమ పైననే భద్రతా దళాలు ఎందుకని ఉపయోగిస్తున్నాయి? భద్రత దళాలపై నిరసన ప్రదర్శనలలో రాళ్ళు రువ్వుతున్న యువకులు 'అద్దెకు' వస్తున్నారనే ప్రచారం ఎందుకని చేస్తున్నారు ? రూ 500 నోట్ ఇస్తే ఎవ్వరైనా తుపాకీ గుళ్లకు ఎదురు వెళ్లగలరా ? భద్రత దళాలకు ప్రత్యేక అధికారాల చట్టాన్ని కొన్ని ఈశాన్య రాష్ట్రాలతో పాటు ఇక్కడనే నిరంతరం అర్ధ శతాబ్దికి పైగా అమలు చేస్తున్నారు ? తీవ్రమైన శాంతి భద్రత సమస్యలు ఉన్న దేశంలోని ఇతర ప్రాంతాలలో ప్రయోగించరే? ... ఇవ్వన్నీ నేడు కాశ్మీర్ ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు.

అంతర్గత భద్రతను మిగిలిన అన్ని ప్రదేశాలలోవలే కాశ్మీర్ లోయలో సహితం స్థానిక పోలీసులు, వారికి సహాయకారిగా ఉన్న కేంద్ర బలగాలు అదుపులో ఉంచగలవు. సరిహద్దుల్లో ఉండవలసిన సైనికులను దింపడం వల్లన సమస్య క్లిష్టంగా మారుతున్నది. సాధారణ ప్రజలపై భద్రత దళాలు పలు అత్యాచారాలకు దిగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అటువంటి వాటి పై ఎటువంటి విచారణకు పూనుకోవడం లేదు. బాధ్యులను జవాబుదారిగా చేసే ప్రయత్నం చేయడం లేదు.

పైగా గత రెండున్నర దశాబ్దాలలో 'అదృశ్యం' అయిన రెండు లక్షల మందికి పైగా అమాయక యువకుల సంగతి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వారు చనిపోయారా ? వారిని చంపి వేశారా ? వారు కనబడటం లేదా? కనీసం పాలకులు సమాధానం కూడా ఇవ్వరేమి అని అడుగుతున్నారు. ఈ సంవత్సరం లోనే ఇప్పటి వరకు 160 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టామని, కాశ్మీర్ లో ఉగ్రవాదుల చొరబాటు అదుపులో ఉన్నదని, వారిని చాలావరకు కట్టడి చేయగలిగా మని జమ్మూ కాశ్మీర్ డిజిపి శేష్ పౌల్ వైద్ పేర్కొన్నారు.

అయితే ఉద్యోగాలు లేక తిరుగుతున్న యువత చాల ప్రమాదకరమని, వారికి తగు ఉపాధి అవకాశాలు కల్పించే ప్రయత్నాల పట్ల ప్రభుత్వాలు దృష్టి సారించాలని ఆయన హెచ్చరించారు. నమాజ్ పూర్తి కాగానే మొబైల్ ఫోన్ నే మదరస్సా గా ఉపయోగించు కొంటున్నారు. మొబైల్ లో ప్రమాదకరమైన చాల సమాచారాన్ని నింపుతున్నారు. 10వ తరగతి పూర్తి చేసిన యువతకు ఏదో ఒక వ్యాపకం కల్పించడం ద్వారా వారిని ఉగ్రవాద ప్రభావం నుండి తప్పించాలని సూచించారు.

ఇటువంటి అంశాల పట్ల స్పష్టత లేకుండా చర్చల ప్రక్రియకు పూనుకోవడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉంటుందో అర్థం కాదు. ఇప్పటి వరకు అనుసరిస్తున్న విధానం తగు ఫలితాలు ఇవ్వక పోవడంతో రాజకీయ ప్రక్రియకు ప్రభుత్వం నిజాయతీతో దిగిందా? అంతర్జాతీయంగా, ముఖ్యంగా అమెరికా నుండి వస్తున్న వత్తిడిని తట్టుకోవడం కోసం చర్చల ప్రక్రియకు దిగిందా ? లేదా సమస్యను నాన్చడం కోసం ప్రయత్నం చేస్తున్నారా ? ఇటువంటి ప్రశ్నలకు ప్రభుత్వ ప్రకటనలో సమాధానం లభించడం లేదు.



కొత్తకోణంలో 'పద్యానుభవం'





31-08-2017 తిరుపతిలో డా. జి వి పూర్ణచందు రచన 'పద్యానుభవం' గ్రంథావిష్కరణ సభ దృశ్యం. తెలుగు భాషోద్యమ సమితి, శంకరంబాడి సుందరాచారి సాహితీపీఠం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. డా. మండలి బుద్ధప్రసాద్ గ్రంథాన్ని ఆవిష్కరించారు. డా. గార్లపాటి దామోదరనాయుడు సభకు అధ్యక్షత వహించారు. డా. నందివెలుగు ముక్తేశ్వరరావు ఐ ఏ యస్, శ్రీ గుత్తికొండసుబ్బారావు ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు. డా. గుమ్మా సాంబశివరావు గ్రంథ పరిచయం చేశారు. డా. గంగవరపు శ్రీదేవి, డా. డి మస్తానమ్మ, శ్రీ సాకం నాగరాజు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పద్యానుభవం గ్రంథాన్ని డా. సామల రమేష్‌బాబుకు డా. పూర్ణచందు అంకితం చేశారు.

ఆధునిక కాలంలో వచన కవితలు బాగా ప్రచారంలోనికి రావటంతో పద్యం పరాయిదైపోయింది. ఏకొద్దిమంది మాత్రమో పద్యాల పట్ల అభిమానాన్ని ప్రదర్శిస్తున్నారు. దీనికి కారణం పద్యం అంటే అది పండితులకు మాత్రమే పరిమితమైంది, అది సమకాలీనతను పట్టించుకోదు అనే అపోహను కలిగి ఉండటమే. కానీ ప్రాచీన పద్యమైనా ఆధునిక పద్యమైనా దాన్ని తరచి చూస్తే సార్వకాలిక సామాజిక విశేషాలు కనిపిస్తాయని డా॥ జి.వి. పూర్ణచందు రచించిన పద్యానుభవం ప్రకటిస్తుంది. ఈ పుస్తకాన్ని భాషోద్యమ నాయకులు డా॥ సామల రమేష్‌బాబు, వారి శ్రీమతి డా॥ దుర్గావతి గార్లకు అంకితం ఇవ్వటం సమంజసంగా ఉంది.

డా॥ జి.వి. పూర్ణచందు శతాధిక గ్రంథకర్త. బహుముఖీనమైన అంశాల్ని గురించి పలు గ్రంథాలు రచించిన పూర్ణచందుగారి చూపు ఇప్పుడు పద్యాలు, శ్లోకాల మీద పడింది. ఇంతకుముందు పద్యాలు, శ్లోకాలు విశ్లేషించబడిన తీరుకంటే పూర్ణచందుగారు విశ్లేషించిన తీరు కొత్తగా ఉంది. పూర్వం పద్యానికి అర్థాలు, తాత్పర్యాలు, అలంకారాలు వ్యాకరణ విశేషాలు చెబితే అది గొప్ప విశ్లేషణ. కానీ పద్యాన్ని లోతుగా, కొత్తగా ఎలా పరిశీలించాలో చెబుతుంది-పూర్ణచందుగారి పద్యానుభవం. ఇందులో 15 అంశాలున్నాయి. సంస్కృత చాటువుల్లోని 'అతిథి మర్యాదలు'తో ఈ గ్రంథం మొదలైంది. క్షేత్రయ్యగారి పర్యావరణ కవితతో ముగిసింది. ప్రతీ శ్లోకాన్ని పద్యాన్ని ఆధునిక సమాజానికి అన్వయింప చేస్తూ సామాజిక ప్రబోధం గావించిన పూర్ణచందుగారి విలక్షణ విశ్లేషణాత్మక ప్రతిభ ప్రస్తుత విమర్శకులకు మార్గదర్శనం చేస్తున్నది. మొదటి వ్యాసాన్ని ముగిస్తూ "అంతంత మాత్రమే ఉన్న ఇంటికి చుట్టం వచ్చినా తెలుగు కుటుంబీకులు అతిథి మర్యాదలు మాత్రం ఆపరు. అదే మన సంస్కృతి. మన సంస్కృతిలో చెడనిది మర్యాద ఒకటే" అని రాశారు. మానవ సంబంధాలు లోపిస్తున్న ప్రస్తుత సమాజానికి ఈ ముగింపు మన ప్రత్యేకతను మరోసారి గుర్తుకు తెస్తున్నది.

ఆయుర్వేద వైద్యునిగా వృత్తి జీవనాన్ని సాగిస్తూ భాషా సాహిత్య ఉద్యమాన్ని ప్రవృత్తిగా నిర్వహిస్తున్న పూర్ణచందుగారు ఏ విషయాన్నయినా భాషకు ముడి పెట్టటంలో సమర్థులనటానికి కేతన ఆంధ్రభాషా భూషణంలోని పద్యాన్ని అచ్చ తెలుగు ఉద్యమం అని రచించటం ద్వారా గుర్తించవచ్చు. సంస్కృత పదాలకు తెలుగు పదాల్ని సృష్టించడం కష్టమనే వారికి దారి చూపుతూ కేతన అనేక పదాల్ని సృష్టించిన తీరును ఈ వ్యాసంలో వివరించారు. ఆలోచిస్తే అన్యభాషా పదాలకు తెలుగు పదాల్ని కల్పించటం కష్టంకాదని పూర్ణచందుగారు ద్వారా వెల్లడించారు. పాల్కురికి సోమనాథుడు తెలుగు మాటలనంగ వలదు వేదముల కొలదియగా జూడుడు" అంటాడు. అందుకే పాల్కురికి సోమనాథుడు "తెలుగే దేవభాష" అని రాశారు.

భాస్కర శతకం, భర్తృహరి సుభాషితాలకు ఏనుగు లక్ష్మణకవి అందించిన పద్యాల్ని ఆధునిక కాలానికి అన్వయించిన తీరుకూడా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. పోతనగారి 'ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి" పద్యాన్ని వివరిస్తూ డబ్బులిచ్చి పురస్కారాలు పొందేవారికి తమకు తామే బిరుదులు తగిలించుకునేవారికి చురక లంటించారు. పాల్కురికి సోమనాథుని ద్విపద పాదాల్ని వివరిస్తూ 'గాలివాటు పాలన' అనే శీర్షికను రచించిన పూర్ణచందుగారు ప్రభుత్వానికి ఒక సాంస్కృతిక విధానం ఉండాలి. దాన్ని అమలు పరిచే పటిష్టమైన యంత్రాంగం ఉండాలి. తన విధానానికి పాలకుడు కట్టుబడి ఉండాలి. గాలివాటుగా పోతుంటే జాతి సంస్కృతికి తీరని అపకారం జరుగుతుంది. నేటి పాలకులకు ఇది అవసరమైన సందేశమే అని రాశారు. తెలుగు భాషోద్యమానికి బాసటగా ఉన్న పుస్తకం 'పద్యానుభవం'.

ఈ పుస్తకంలో ఇంకా మహాభారతం, పాండురంగమహాత్మ్యం, యక్షగానాలు, చాటువులు, హరివంశం, ఆముక్తమాల్యద మొదలైన గ్రంథాల్లోని పద్యాలున్నాయి. క్షేత్రయ్య కవితలో పర్యావరణ దృక్పథమున్నదని చెప్పిన రచయిత విశ్లేషణ అభినందనీయం. ఇకనుంచి పద్యాన్ని విశ్లేషణ చేసేవారు, పద్యాభిమానులు పూర్ణచందుగారి 'పద్యానుభవం' గ్రంథాన్ని తప్పక కొని చదవాలి. వ్యక్తిత్వ వికాస బోధకులకు, యువతకు ఈ పుస్తకం ఎంతగానో ఉపకరిస్తుంది. (పద్యానుభవం: రచన: డా॥ జి.వి. పూర్ణచందు, మొదటి ముద్రణ 2017. ప్రతులకు: సుశ్రుత ఆయుర్వేదిక్ స్పెషాలిటీ హాస్పిటల్ 1వ అంతస్తు, సత్నాం టవర్స్, బకింగ్‌హామ్‌పేట పోస్టాఫీసు ఎదురు, గవర్నరుపేట, విజయవాడ-2. చరవాణి 9440172642. వెల- రూ. 125/-)

-డా.గుమ్మా సాంబశివరావు

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136)
RNI-APTEL/2015/62362

సెట్టి ఈశ్వరరావు శతజయంతి మహోత్సవం





విశాలాంధ్ర మాసపత్రిక వ్యవస్థాపకుడు, గురజాడ సాహిత్య ఆవిష్కర్త, రచయిత, సంపాదకుడు కీ.శే. సెట్టి ఈశ్వరరావుగారి శతజయంతి మహోత్సవం అక్టోబరు 21, 22 తేదీలలో విశాఖపట్టణంలో పౌరగ్రంథాలయంలో జరిగింది. 1. ప్రారంభసభలో ఈశ్వరరావుగారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీయుతులు కె.ఎస్.చలం, గొల్లపూడి మారుతీరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సెట్టి సోమశేఖర్, తదితరులు. 2. ముగింపు సభలో శ్రీయతులు కె.ఎస్.చలం, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య నాగేశ్వరరావు, నన్నయ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ముత్యాల నాయుడు, ఆచార్య చందు సుబ్బారావు, ఆచార్య కేతు విశ్వనాధరెడ్డి, హరనాధరెడ్డి, మానం ఆంజనేయులు, జె.వి.సత్యనారాయణమూర్తి తదితరులు.

ఘనంగా జరిగిన 'కథానికతో ఓ సాయంత్రం'





ఆరేళ్ళుగా ప్రతీ సంవత్సరం అక్టోబరు 14న హైద్రాబాద్‌లో పెద్దఎత్తున 'కథానికతో ఓ సాయంత్రం' అనే సాహిత్య కార్యక్రమం జరుగుతుంది. త్యాగరాయ గానసభ, కళాసుబ్బారావు లలితకళావేదికల్లో ఒకేసారి జరిగింది. ఎక్కువమంది రచయితలు, రచయిత్రులు, సాహిత్యాభిమానులు రావటంతో ఒకేసారి రెండు ఆడిటోరియంలలో ఈ పండుగ వైభవంగా జరిగింది.

మొదటి సదస్సులో తొలుత ఆలూరు కృష్ణకుమారి గారి సంస్మరణను డా॥ కె.బి.లక్ష్మి నిర్వహించారు. అధ్యక్షత వహించిన శ్రీ సుధామ ఈ సంవత్సరం శతజయంతి జరుపుకుంటున్న మా గోఖలే, సెట్టి ఈశ్వరరావు, చక్రవర్తి రంగస్వామి, దేవులపల్లి రామానుజరావుల సాహితీ సేవల్ని కొనియాడారు. అమ్మనుడి సంపాదకులు డా॥ సామల రమేష్‌బాబుగారు 'చక్రవర్తి రంగస్వామి కథానికలు' గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ, "భాష, సాహిత్యాల మధ్య అవినాభావ సంబంధముంది. సాహిత్యంతోనే భాషని గ్రాంధికం నుంచి వ్యవహారంలోకి మార్చవచ్చని గురజాడ ఏనాడో చెప్పారు. ఎంతోమంది మహనీయుల కృషితో ఈ స్థాయికి చేరుకున్న తెలుగు భాషను కాపాడే బాధ్యత మనందరిమీదా ఉంది. తెలుగురాష్ట్రాల్లో తెలుగుని ఓ భాషగా నేర్పడమే గొప్పన్నట్లు ప్రభుత్వాలు ప్రవర్తించడం హాస్యాస్పదం. తెలుగుని బోధనా భాషగా చెయ్యాలి" అన్నారు.

40మంది రచయిత/త్రుల కథానికలతోబాటు మాగోఖలే 'బల్లకట్టు బాపయ్య' కథానికతో వాణిశ్రీ సంపాదకత్వంలో వచ్చిన మాగోఖలేకి అంకితమైన 'మా కథలు–2016' ని విహారిగారు ఆవిష్కరించారు.

రెండవ సమావేశం 'కథానిక సదస్సు' విహారిగారి నేతృత్వంలో 'కథానిక, నిన్న–నేడు–రేపు' చర్చాకార్యక్రమం జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న వీరాజీ కథానిక సమాజానికి హితవు చెప్పాలన్నారు.

మూడవ సమావేశానికి ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥ కె. వి. రమణాచారి విచ్చేసి సింహప్రసాద్ యువ కథానికా రచయితల్ని ప్రోత్సహించడానికి ప్రారంభించిన 'డా॥ వేదగిరి రాంబాబు కథానికా పురస్కారాన్ని' వేంపల్లి షరీఫ్‌కు, దార్ల బుజ్జిబాబుకి 'డా॥ వేదగిరి రాంబాబు బాలసాహిత్య పురస్కారాన్ని ఇచ్చి, శాలువా, జ్ఞాపిక, పూలదండలతో సత్కరించారు.

తర్వాత విహారిగారు డా॥ వాసా ప్రభావతి నవల 'భూత్ బంగళా'ని ఆవిష్కరించారు. రచయిత్రి ఆ గ్రంథాన్ని రమణాచారి దంపతులకు అంకితం చేశారు. తర్వాత రమణాచారిగారు డా॥ వేదగిరి రాంబాబు వ్యంగ్య కథానికల్ని, హనుమంతరావు 'సొల్లుఫోన్' కథానికా సంపుటాన్ని ఆవిష్కరించారు. శ్రీమతి లతారమణాచారి వేదం సూర్యప్రకాశంగారి 'సూర్యస్పందన'ని ఆవిష్కరించారు. బండారు పబ్లికేషన్స్ బాలసాహిత్య గ్రంథం కూడా ఈసభలో ఆవిష్కృతమైంది.

తన జన్మదినోత్సవం రోజున ఏటా ఇలా పెద్ద సంఖ్యలో హాజరై తనకిష్టమైన కథానికా పండగ జరుపుకోవడం తనకెంతో సంతోషంగా ఉందని లేఖిని–త్యాగరాయ గానసభ, సింహప్రసాద్ సాహిత్య సమితి సంయుక్తంగా నిర్వహించిన 'కథానికతో ఓ సాయంత్రం' కార్యక్రమానికి ముగింపు పలుకుతూ డా॥ వేదగిరి రాంబాబు అన్నారు.

అమ్మనుడి (తెలుగుజాతి పత్రిక)
AMMANUDI (Telugu Monthly)
November 2017, Vol.3, Issue 9
Date of publication : 1st of every month
Date of posting : 4th of every month
RNI-APTEL/2015/62362
Postal Reg. No.TEN/12/2015-17